
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం 29-01-2025
సంపుటి : 01 | సంచిక : 267 | పేజీలు : 15 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD




# భారత్‌లో 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ప్రయత్నాలు

- విశ్వక్రీడల నిర్వహణ భారతీయ క్రీడలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుంది
- ఒలింపిక్స్ వల్ల అనేక రంగాల్లో విస్తృత అవకాశాలు వస్తాయి
- ఇవి క్రీడలకే పరిమితం కాదు.. ఇవి జరిగిన చోట అన్ని రంగాలు లాభపడతాయి
- 38వ జాతీయ క్రీడలను ప్రారంభించి, మాట్లాడిన మోడీ



**ఢిల్లీ:** భారత్‌లో 2036 ఒలింపిక్స్ నిర్వహణ హక్కులను దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. విశ్వక్రీడల నిర్వహణ భారతీయ క్రీడలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందన్నారు. దేహ్రాదూన్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడలను ప్రారంభించిన ఆయన.. ఒలింపిక్స్ వల్ల అనేక రంగాల్లో విస్తృత అవకాశాలు వస్తాయన్నారు.''ఒలింపిక్స్ 2036 నిర్వహణ హక్కుల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. కేవలం ఇవి క్రీడలకే పరిమితం కాదు.. ఇవి జరిగిన చోట అన్ని రంగాలు లాభపడతాయి. క్రీడాకారులతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది భారత్‌కు వస్తారు. ఇక్కడి క్రీడాకారులకు అనేక వసతులు అందుబాటులోకి వస్తాయి. నిర్మాణ రంగానికి ఊతమిస్తుంది. రవాణా వసతులు,

మిగతా2లో...



# రేవంత్ చెప్పేవన్నీ మాయ మాటలే

## ఒక్కమాట నిలబెట్టుకోలేదు

స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల కోసం రేవంత్ మళ్లీ రైతుభరోసా నాటకం ఆడుతున్నాడని, ఎన్నికలు అయిపోంగనే రైతుబంధు మళ్లీ బందేనని కేటీఆర్ విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని, ఆ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ పేరే నిలబడుతదనే భయం సీఎం రేవంత్ రెడ్డిలో ఉన్నదని నల్లగొండ రైతు మహాధర్నా సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

- జనవరి 26 రాత్రి నుంచే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు అన్నాడు
- ఇంతవరకు డబ్బులు పడలేదు
- రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరు
- అందుకే రైతుబంధు ఇవ్వడంలేదు.. రైతు భరోసా నాటకం ఆడుతున్నాడు
- రైతు రుణమాఫీ విషయంలో సర్కారు అట్టర్‌ప్లాప్
- ఏ ఊర్లో కూడా 25శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదు
- అసెంబ్లీలో ఇదే విషయమై నిలదీస్తే సీఎం నోరు మెదపలే

- గ్రామ సభల్లో అధికారులను రైతులు నిలదీస్తున్నరు
- ఏమాయె ఆరు గ్యారంటీలు అంటే సమాధానం లేదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సిగ్గుందా అని అడుగుతున్నా..
- 'నీకు ధైర్యం ఉంటే, దమ్ముంటే గడియారం సెంటర్‌కు రా...
- 'పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ సాయుధపోరాటానికి స్ఫూర్తినింపింది
- అందుకే ఇక్కడినుంచే ఈ రైతు పోరు మొదలుపెట్టినం..
- నల్లగొండ రైతు ధర్నాలో కేటీఆర్ వ్యాఖ్యలు

**విశ్వంభర, నల్లగొండ:**

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పెద్దపెద్ద మాటలు చెప్పిండని, అధికారంలోకి వచ్చినంక ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నల్లగొండ క్లాక్ టవర్ వేదికగా రైతు ధర్నాలో పాల్గొన్న కేటీఆర్ రేవంత్ సర్కార్ పై మండిపడ్డారు. రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కారు అట్టర్‌ప్లాప్ అయ్యిందన్నారు. రాష్ట్రంలో ఏ ఊర్లో చూసుకున్నా పావులా వంతు కూడా రుణమాఫీ కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ హామీలపై ఇప్పుడు గ్రామ సభల్లో జనం నిలదీస్తుంటే పాలకుల దగ్గర సమాధానం లేదని చెప్పారు.అధికారంలోకి రాంగనే ఒకటే సంతకంతో రుణమాఫీ చేస్త అన్నడు.

మిగతా2లో...



# పల్లి రైతుల ఆందోళన

## దద్దరిల్లిన మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డ్

గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్

బోయపల్లి గేట్ రైల్వే పట్టాలపై నిరసన

నిలిచిపోయిన రైళ్ల రాకపోకలు

2



# క్షణికావేశం కాదు పక్కా ప్లాన్

- మీర్‌పేట్ హత్యకేసులో విస్తుగొలిపే విషయాలు..!
- మీర్‌పేట హత్యకేసు.. నిందితుడి అరెస్టు
- గురుమూర్తిని మీడియా ఎదుట ప్రవేశపెట్టిన పోలీసులు
- 'ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా?' అని నివ్వెరపోయాం
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు

2

# పద్మ అవార్డులపై రాజకీయ రచ్చ

- కొనసాగుతున్న పంచాయితీ.. కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం
- ఏపీకి ఐదు అవార్డులిచ్చారు.. తెలంగాణకు నాలుగు కూడా ఇవ్వకపోవడం వివక్ష కాదా?
- రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన పేర్లను పట్టించుకోలేదు: రేవంత్ రెడ్డి
- కేంద్రం పరిశీలనలో అర్హులైన వారికే అవార్డులొస్తాయి
- నక్సల్ భావజాలమున్న గద్దర్ లాంటివారికి బరాబర్ అవార్డులివ్వం: బండి సంజయ్



తెలంగాణలో పద్మ అవార్డుల పంచాయితీ కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై ఇటు కాంగ్రెస్..అటు బీజేపీ నేతలు కౌంటర్లు విసురుతున్నారు. రాష్ట్రం పంపించిన సిఫారసులకు పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని అని కాంగ్రెస్ పార్టీ మండిపడుతోంది. అటు బీజేపీ మాత్రం..లిస్ట్ పంపించినంత మాత్రాన అనర్హులకు అవార్డులు ఇవ్వాలా అంటూ ప్రశ్నిస్తోంది..? ఇలా.. గణతంత్ర దినోత్సవం

మిగతా3లో...



# సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లి

- చరిత్రలో తొలిసారి దళిత బిడ్డకు అవకాశం
- సంగారెడ్డిలో జరిగిన మహాసభలో ఎన్నిక
- మహబూబ్ నగర్ జిల్లాలోని అమరచింత ప్రాంతానికి చెందిన వారు జాన్‌వెస్లి

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## అంతేగా!





## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 115 | ₹ 137 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 199 | ₹ 226 |



# ఇది పూర్తిస్థాయిలో తప్పుడు పిటిషన్

- చంద్రబాబుపై కేసులు సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు
- జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం

2

# కొత్త ఐటీ పాలసీ తీసుకొస్తాం

- ఫ్యూచర్ సిటీని నాలుగేళ్లలో అభివృద్ధి చేస్తాం
- పదేళ్లలో రాష్ట్రానికి ఇప్పుడు వచ్చినన్ని పెట్టుబడులు ఎప్పుడూ రాలేదు
- ఏపీలో పెట్టుబడుల సాధనకు చంద్రబాబు ప్రయత్నాలు బాగున్నాయి
- మంత్రి శ్రీధర్‌బాబు



2

# అట్టహాసంగా పోలీసుల స్పోర్ట్స్ మీట్



- ప్రారంభించిన ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి
- 29 క్రీడాంశాల్లో పోటీపడుతున్న 2400మంది క్రీడాకారులు
- క్రీడాపోటీల్లో రాణించే పోలీసులకు ఇంక్రిమెంట్లు అందిస్తున్నాం: శివధర్ రెడ్డి

2



# గోదావరి కరకట్ట నిర్మాణం వేగవంతం చేయాలి

- లక్నవరం నుంచి రామప్ప కెనాల్ నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలి
- గడువులోపు పనులు పూర్తయ్యేలా కార్యాచరణ సిద్ధం చేయాలి
- జలసౌధలో అధికారులతో మంత్రులు ఉత్తమ్, సీతక్క సమీక్ష

2

# రాష్ట్రానికి రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు

**విశ్వంభర, హైదరాబాద్:** తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సచివాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు.''ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచుతూ అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయి'' అని సీఎం వివరించారు.

**దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు: శ్రీధర్‌బాబు..**

హైదరాబాద్ అంటేనే.. బిజినెస్ అనే బ్రాండ్ ఏర్పడిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ''గతేడాది దావోస్ సదస్సులో రూ.40వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ఇది స్థిరమైన, వ్యాపార అనుకూలమైన ప్రభుత్వం అని వ్యాపారులు విశ్వసించారు. అందుకే 2024 దావోస్ పర్యటనకంటే ఈసారి నాలుగు రెట్లు అధికంగా ఒప్పందాలు జరిగాయి. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ కోసం సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. యువతలో సాంకేతిక నైపుణ్యాలు పెంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. అధునాతన సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చేలా ప్రణాళిక రూపొందించాం.పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందించేలా స్కిల్ యూనివర్సిటీ ప్రణాళిక ఉంది. పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని నైపుణ్య కల్పనకు కూడా ఇస్తున్నాం. సాంకేతిక నైపుణ్యం, విద్యార్థుల బదిలీ జరిగేలా సింగపూర్‌తో ఒప్పందం చేసుకున్నాం. రూ.450 కోట్లతో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు క్యాపిటలాండ్ ముందుకు వచ్చింది. దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు వస్తాయి. మూసీ నదిని ప్రక్షాళన చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అదిస్తాం'' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

# భారత్‌లో 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ప్రయత్నాలు

మొదటిపేజీ తరువాయి

ముఖ్యంగా పర్యాటకం మెరుగుపడుతుంది'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**యూసీసీ అమలుపై హర్షం**

రాజ్యాంగ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఉమ్మడి పౌరస్మృతి బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యూసీసీని అమలు చేస్తున్న ఉత్తరాఖండ్‌ను అభినందించిన ఆయన.. ఈ చట్టాన్ని సెక్యులర్ సివిల్ కోడ్‌గా అభివర్ణించారు. క్రీడల మాదిరిగానే యూసీసీ కూడా జట్టు స్ఫూర్తితో కూడుకున్నదని, ఎవరిపైనా వివక్ష లేదన్నారు.

# కొత్త ఐటీ పాలసీ తీసుకొస్తాం

**విశ్వంభర, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌కు గ్లోబల్ కేపబిలిటీ ఉందని తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ''ఏపీకి కోస్తా ప్రాంతం.. అపార వనరులు ఉన్నాయి. ఆ రాష్ట్రానికి మంచి పరిశ్రమలు వస్తాయి.. పలు కంపెనీలతో ఎంవోయూలు కూడా చేసుకున్నారు. ఎంవోయూల వివరాలు ఏపీలోనే ప్రకటిస్తామని దావోస్‌లో లోకేశ్ చెప్పారు. ఏపీకి అనుకూలతలు, పెట్టుబడుల సాధనకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు బాగున్నాయి. హైదరాబాద్ కంపెనీలు ఏపీకి తీసుకెళ్లి ఇక్కడ ఆటంకాలు సృష్టించే ఆలోచనలో చంద్రబాబు లేరు. హైదరాబాద్ ఇంకా అభివృద్ధి కావాలని చంద్రబాబు కోరుకుంటున్నారు. వచ్చే మూడేళ్లలో ఏపీకి భారీ పెట్టుబడులు వచ్చే అవకాశముంది.

**ఇప్పుడు వచ్చినన్ని పెట్టుబడులు గత పదేళ్లలో ఎప్పుడూ రాలేదు..**

పదేళ్లలో రాష్ట్రానికి ఇప్పుడు వచ్చినన్ని పెట్టుబడులు ఎప్పుడూ రాలేదు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఐటీ పాలసీ తీసుకొస్తాం. ట్రిపుల్ ఆర్ చుట్టూ ఐటీ విస్తరించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. హైదరాబాద్ చుట్టూ మాల్స్ తెచ్చే యోచనలో సర్కార్ ఉంది. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ వయసు పెంచే ఆలోచన లేదు. తెలంగాణలో రెండు డ్రై పోర్టులు రానున్నాయి. రెండోశ్రేణి నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు, ఐటి అభివృద్ధి చేస్తాం. ఫ్యూచర్ సిటీని నాలుగేళ్లలో అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్ తూర్పు వైపు ఐటీని అభివృద్ధి చేస్తాం. ఎవరు అధికారంలో ఉన్నా అప్పటికే ఉన్న పాలసీలు ముందుకు తీసుకెళ్లాలి. మన్మోహన్ సింగ్ తెచ్చిన పాలసీలు మోదీ తీసుకొని పోతున్నారు. పాలసీలను ముందుకు తీసుకు వెళ్లనిది.. ఏపీలో జగన్ మాత్రమే'' అని శ్రీధర్‌బాబు అన్నారు.

# సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లి

**విశ్వంభర, హైదరాబాద్:** సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన జాన్‌వెస్లి ఎన్నికయ్యారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నాలుగు రోజులుగా జరిగిన సీపీఎం మహాసభల్లో జాన్‌వెస్లీని పార్టీ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అమరచింత ప్రాంతానికి చెందిన జాన్‌వెస్లీ.. ప్రస్తుతం వనపర్తి జిల్లాలోకి వస్తుంది. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. సీపీఎం రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఒక దళితుడ్ని రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షుడిగా జాన్ వెస్లీ పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం నియమితులయ్యారు. తర్వాత జరిగిన రెండు మహాసభల్లోనూ ఆయన తిరిగి ఎన్నికయ్యారు. తాజాగా సంగారెడ్డిలో జరిగిన సీపీఎం మూడో మహాసభలో జాన్ వెస్లీని మహాసభలకు హాజరైన ప్రతినిధులు ఎన్నుకున్నారు.ఈ మహాసభల్లో సీపీఎం చరిత్రలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖమ్మం జిల్లాలో అంచెలంచెలుగా ఎదిగి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదిగిన తమ్మినేని వీరభద్రం.. వయస్సు రీత్యా ఈ మహాసభల్లో పార్టీ రాష్ట్ర కమిటీ నుంచే తప్పించారు. ఆయనతోపాటు సీనియర్ నేతలు సీతారాములు, నర్సింగరావులను కూడా తొలగించారు. 70 ఏండ్లు దాటిన నేతలను రాష్ట్ర కమిటీ నుంచి తొలగిస్తూ సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్ణయం తీసుకున్నాయి.

# పల్లి రైతుల ఆందోళన

**విశ్వంభర, మహబూబ్‌నగర్:** కష్టపడి తెచ్చిన పంటకు రైతులకు లాభం చేసేది పోయి రైతులకే నష్టం చేస్తున్న వైనంపై అన్నదాతలు కన్నెర్రజేశారు. మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో పల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉధృతంగా మారింది. సమీపంలో ఉన్న బోయపల్లి గేట్ రైల్వే పట్టాలపై నిరసన తెలియజేయడంతో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులను శాంతింపజేసే యత్నం చేశారు. అయినా రైతులు ఆందోళన కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డు వందల క్వింటాళ్ల వేరుశనగను అమ్ముకోవడానికి తీసుకోవచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర రాకుండా మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు, ట్రేడర్లు కుమ్మక్కు అయి ధరలు తగ్గించారని రైతులు ఆరోపించారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టారు. రైతుల ఆందోళనతో మార్కెట్ అధికారులు అక్కడ నుంచి జారుకున్నారు.

# క్షణికావేశం కాదు- పక్కా ప్లాన్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్య కేసు నిందితుడు గురుమూర్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ఇంటికి తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. తన భార్య వెంకట మాధవిని గురుమూర్తి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలు, ముక్కలుగా చేసి కుక్కర్‌లో ఉడికించిన సంగతి తెలిసిందే. ఎముకలను కాల్చి బూడిద చేసి చెరువులో పడేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు ఆమె తల్లి సుబ్బమ్మతో కలిసి జనవరి 16న మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని తెలుసుకున్న పోలీసులు.. గురుమూర్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తానే భార్యను హత్య చేశానని గురుమూర్తి అంగీకరించాడు. గురుమూర్తి చెప్పిన విషయాలపై ఆధారాలు సేకరించిన పోలీసులు తాజాగా అతడిని అరెస్టు చేశారు.

**'ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా?' అని నివ్వెరపోయాం..**

గురుమూర్తిని పోలీసులు మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. కేసు వివరాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. వెంకట మాధవి హత్య కేసు దర్యాప్తులో ఆధారాలు సేకరించేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందన్నారు. 'ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా?' అని మేం నివ్వెరపోయామన్నారు. భార్యను ఇంత దారుణంగా చంపిన గురుమూర్తిలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించడం లేదన్నారు.'క్షణికావేశంలో జరిగిన హత్య కాదు.. పథకం ప్రకారమే హత్య చేశాడు. గురుమూర్తి స్వతహాగానే క్రూరుడు' అని సీపీ వివరించారు. ''సంక్రాంతి పండగకు మాధవి, గురుమూర్తి తమ పిల్లల్ని తీసుకుని బంధువుల ఇంటికి వెళ్లారు. 15న పిల్లల్ని బంధువుల ఇంటి వద్దే వదిలేసి వెంకటమాధవి, గురుమూర్తి రాత్రి 10.41 గంటలకు ఇంటికి చేరుకున్నట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో గుర్తించాం. 16న ఉదయం 8 గంటలకు ఆమెతో అకారణంగా గొడవ పెట్టుకొని ఘర్షణకు దిగాడు. మాధవి తలను గోడకేసి కొట్టి కిందపడిపోయిన తర్వాత గొంతు నులిమి హతమార్చాడు. ఇంట్లో ఉన్న కత్తితో కాళ్లు, చేతులు, శరీరం, తల నాలుగు భాగాలుగా కట్ చేశాడు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మృతదేహాన్ని ముక్కలు చేసినట్టు గుర్తించాం. వాటర్ హీటర్‌తో నీళ్లు మరిగించి శరీర భాగాలను ఉడక బెట్టాడు. ఆ తర్వాత వాటిని స్టవ్‌పై పెట్టి కాల్చాడు. రోకలి బండతో ఆ భాగాలను దంచి పొడి చేశాడు. ఆ పొడిని ప్లాస్టిక్ బకెట్‌లో తీసుకెళ్లి జిల్లెలగూడ చెరువులో పోశాడు. ఇంట్లో మొత్తం ఆనవాళ్లు లేకుండా చేసిన తర్వాత బంధువుల ఇంటికి వెళ్లి పిల్లల్ని తీసుకొచ్చాడు''

**గురుమూర్తి మెతక స్వభావి.. ఇంత రాక్షసంగా ఎలా మారాడో!**

''అమ్మ ఏది' అని పిల్లలు అడిగితే ఎక్కడికో వెళ్లిందని చెప్పాడు. చంపినట్లు భౌతిక ఆధారాలు లేకుంటే.. కేసు నుంచి తప్పించుకోవచ్చని భావించాడు. పిల్లలు ఉంటే సాక్ష్యం చెబుతారనే అనుమానంతో వారిని బంధువుల ఇంటి వద్దే ఉంచాడు. రెండ్రోజుల తర్వాత మాధవి తల్లిదండ్రులు అడిగితే.. పోలీస్ స్టేషన్‌కు వచ్చి మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ విషయాలన్నీ మాధవి మేనమామకు గురుమూర్తి చెప్పాడు. గురుమూర్తి చాలా క్రూరమైన స్వభావం కలిగిన వ్యక్తి. ఆర్మీలో 15 ఏళ్లు పనిచేశాడు. ఒక పథకం ప్రకారమే భార్యను హత్య చేశాడు. సాంకేతిక ఆధారాలు సేకరించాం. వెంకటమాధవి హత్య కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నాం. భార్యను కిరాతకంగా చంపడంపై గురుమూర్తిలో కొంచమైనా పశ్చాత్తాపం లేదు. హత్య కేసులో నిందితుడు ఉపయోగించిన స్టవ్, కత్తి, రోలర్, రోలర్ స్టోన్, బకెట్, వాటర్ హీటర్, రూమ్ ఫ్రెషనర్, యాసిడ్ బాటిల్, డోర్ మ్యాట్, స్క్రాప్ బకెట్, సర్ఫ్ ప్యాకెట్, బ్లాక్ కలర్ షర్ట్, మృతురాలి డ్రెస్, రెండు మొబైల్ ఫోన్లు సహా మొత్తం 16 వస్తువులను సీజ్ చేశాం'' అని సీపీ సుధీర్‌బాబు తెలిపారు.

# రేవంత్ చెప్పేవన్నీ మాయ మాటలే..

మొదటిపేజీ తరువాయి



మరె ఇప్పుడు రుణమాఫీ జరిగిందా..? ఏ ఊర్లె గూడా 25 శాతం మందికి గూడా రుణమాఫీ కాలేదు. అసెంబ్లీలో ఇదే విషయమై నిలదీస్తే రేవంత్ రెడ్డి నోరు మెదపలే. ఏ ఊళ్లె అందరికీ రుణమాఫీ అయ్యిందో చూద్దాం పా.. అంటే సప్పుడు చెయ్యలే. అధికారంలోకి రాంగనే రుణమాఫీపై బ్యాంకులోళ్లందరినీ పిలిచి మాట్లాడింద్రు. రుణమాఫీ కోసం రూ.45,500 కోట్లు కావాలె అని బ్యాంకులోళ్లు చెప్పింద్రు. వారం రోజులకు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రూ.40 వేల కోట్లు సరిపోతయి అన్నడు. తర్వాత నెలకు రూ.31 వేల కోట్లు సరిపోతయన్నడు. ఆఖరికి జూన్‌లో క్యాబినెట్ మీటింగ్ పెట్టి రూ.26 వేల కోట్లు సరిపోతయని, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లే కేటాయించింద్రు. కానీ ఇప్పటికీ రుణమాఫీకి ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.12 వేల కోట్లు కూడా దాటలే. అందుకే అంటున్న 49 వేల కోట్లల్ల పావులా వంతు కూడా రుణమాఫీ కాలేదు' అని కేటీఆర్ అన్నారు.

**గ్రామాల్లో రైతులు నిలదీస్తున్నారు..**

'ఇప్పుడు గ్రామ సభల్లో అధికారులను రైతులు నిలదీస్తున్నరు. ఏమాయె రుణమాఫీ అంటే సమాధానం లేదు. ఏమాయె ఆరు గ్యారంటీలు అంటే సమాధానం లేదు. కేసీఆర్ బిచ్చమేసినట్టు రూ.10 వేలే ఇస్తున్నడూ.. నేను రూ.15 వేలు ఇస్తా అని రేవంత్ రెడ్డి చెప్పిండు. మరె ఇస్తున్నడా రూ.15 వేలు..? ఆఖరికి రూ.12 వేలు ఇయ్యాలని నిర్ణయం జేసింద్రు. పైగా అది చారిత్రాత్మక నిర్ణయం అని అంటున్నడు. మోసం చేసుడు గూడా చారిత్రాత్మకమేనా. ఆఖరికి రేషన్ కార్డు ఇయ్యడం కూడా చారిత్రాత్మకమట. ఏడాది నుంచి రాష్ట్రంలో రైతులను, గరీబులను ఈ ప్రభుత్వం చావగొడుతున్నది. రేషన్ కార్డు కావాలంటే దరఖాస్తు.. రైతు భరోసా అంటే దరఖాస్తు.. కులగణన అంటే దరఖాస్తు. ఇప్పుడు రాష్ట్రంలో ఎవరన్నా సంతోషంగా ఉన్నరా అంటే జిరాక్స్ సెంటర్లోల్లే. పెట్టిన దరఖాస్తే మల్లీమల్లీ పెట్టి ప్రజలు విసిగిపోతున్నరు' అని కేటీఆర్ చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ మాయమాటలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జనవరి 26 రాత్రి నుంచే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు పడుతాయని చెప్పాడని, కానీ ఇంతవరకు రైతు భరోసా డబ్బులు రాలేదని ఆయన ఆరోపించారు. నల్లగొండ రైతు ధర్నా లో మాట్లాడిన కేటీఆర్.. నల్లగొండ బిడ్డల బొక్కల్లో మూలుగ చావడానికి కారణమే కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. జనాన్ని మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు.

**రైతుభరోసా డబ్బులు టకీటకీమని పడుతయ్ అని రేవంత్‌రెడ్డి అన్నడు..**

'జనవరి 26న రాత్రి 12 గంటలకే రైతుభరోసా డబ్బులు టకీటకీమని పడుతయ్ అని రేవంత్‌రెడ్డి అన్నడు. మరె పడ్డయా..? మరె కేసీఆర్ 12 సార్లు ఇచ్చిండు గదా..! 2017 నుంచి ఆరేండ్లు నిరాటకంగా రైతు బంధు ఇచ్చింద్రు గదా..! ఒక్క రైతుబంధు పథకానికే 11 విడతల్లో కేసీఆర్ రైతుల ఖాతాల్లో వేసింది రూ.73 వేల కోట్లు. కానీ కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. మాటలే చెప్పింది. ఈ ముఖ్యమంత్రి, ఈ కాంగ్రెస్ పార్టీ మీకు కొత్త కాదు. 55 ఏళ్లుగా చూసిన పార్టే కాంగ్రెస్. నల్లగొండ జిల్లాలో తాగునీటికి ఇబ్బందై మన పిల్లల బొక్కల్లో మూలుగా చావడానికి కారణమే కాంగ్రెస్. నల్లగొండ బిడ్డలు జీవచ్ఛవాలుగా మారడానికి కారణమే కాంగ్రెస్. నల్లగొండ రైతుల అవస్థకు కారణమే కాంగ్రెస్. మిమ్మల్ని మోసం చేయడానికే కాంగ్రెస్ నేతలు కొత్త వేషాలు వేసుకుని ఎన్నికలకు వచ్చింద్రు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింద్రు' అని కేటీఆర్ మండిపడ్డారు.

**రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని...**

రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని, ఆ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ పేరే నిలబడుతదనే భయం సీఎం రేవంత్ రెడ్డిలో ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. అందుకే రైతుబంధు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల కోసం రేవంత్ మళ్లీ రైతుభరోసా నాటకం ఆడుతున్నాడని, ఎన్నికలు అయిపోంగనే రైతుబంధు మళ్లీ బందేనని ఆయన విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. 'ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అన్ని పంటలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తమన్నడు. మరె ఎవరికన్నా బోనస్ పైసలు పడ్డయా..? ఇప్పుడు మాట మార్చి సన్నవడ్లు పండిస్తేనే బోనస్ ఇస్తం అంటున్నరు. ఇగ వ్యవసాయ మంత్రి అయితే సన్నవడ్లకు బోనస్ ఇచ్చుడు బాగుంది, రైతు భరోసా అక్కెరే లేదని రైతులే చెప్తున్నరు అంటున్నడు. ఇప్పుడు ఎన్నికలు ఉన్నయ్ కాబట్టి రైతుభరోసా ఇస్తం అని నాటకమాడుతున్నరు. ఈ నాటకాలను మీరు గమనించాలె. ఎన్నికలు అయిపోంగనే రైతు భరోసా కూడా బందైతది' అని కేటీఆర్ హెచ్చరించారు.

'ఇప్పుడు ఆరోగ్య శ్రీ అంటే వైఎస్ఆర్ యాదికొస్తరు. రైతుబంధు అంటే కేసీఆర్ గుర్తుకొస్తరు. అందుకే రైతుబంధు ఇస్తే కేసీఆర్‌కే పేరు వస్తదని, ఆయనను ఎవరూ దేకరని రేవంత్‌రెడ్డి భయపడుతున్నడు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని మీరు ఇక్కడ గమనించాలె. కేసీఆర్ పేరు మోగొద్దంటే రైతుబంధు ఇయ్యొద్దు అన్నది రేవంత్ అభిప్రాయం. రైతుభరోసా పేరుతో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం.. ఇప్పుడు రైతులకు ఒక్కో ఎకరానికి రూ.17,500 బాకీ ఉన్నడు. కాంగ్రెసోళ్లు ఇప్పుడు మళ్లా ఓట్లు అడగడానికి వస్తరు. అప్పుడు ఈ బాకీ డబ్బులు అడుగుండ్రి. రుణమాఫీ ఏమైందని అడుగుండ్రి. ఏమైంది బోనస్ అని అడుగుండ్రి. ఆరుగ్యారంటీలు ఏమైనయని నిలదీయుండ్రి' అని కేటీఆర్ నల్లగొండ రైతులను కోరారు.

'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అన్నీ బందయితయని కేసీఆర్ ఆనాడే ప్రతి సభలో చెప్పింద్రు. ఆయన చెప్పినట్టే ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు రైతుబంధు ఇస్తలేరు. పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక్కసారి రైతుబంధుగా ఏసిండు. అది కూడా అంతకు ముందే మనం దాచిపెట్టిన పైసలే. కేసీఆర్ హయాంలో నాట్లప్పుడు రైతుబంధు పడేది. కానీ రేవంత్ పాలనలో ఓట్లప్పుడు మాత్రమే రైతుబంధు పడుతది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు వస్తున్నయ్. అందుకే మళ్లీ కొత్త డ్రామా ఆడుతున్నడు. జనవరి 26 నుంచి మార్చి 31 వరకు రైతుబంధు పైసలు పడుతయట. మరి ఏ సంవత్సరం మార్చి నెలనో చెప్పలేదు' అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సిగ్గుందా అని అడుగుతున్నా..**

నల్లగొండలో రైతు ధర్నాను అడ్డుకునేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిఅన్ని ప్రయత్నాలు చేశాడని, ఆఖరికి దివ్యాంగుడు అయిన బీఆర్ఎస్ నాయకుడు భూపాల్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో దాడి చేసింద్రని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సిగ్గుందా అని తాను అడుగుతున్నానని ఆయన మండిపడ్డారు. నల్లగొండ గడ్డ నాడు సాయుధ రైతాంగ పోరాటానికి రాష్ట్ర రైతుల్లో స్ఫూర్తి నింపిందని, ఇప్పుడు కూడా రైతులు తిరగబడేందుకు నల్లగొండనే వేదిక కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**అందుకే నల్లగొండ నుంచే ఈ రైతు పోరు మొదలుపెట్టినం..**

'పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ ఆనాడు మొత్తం రాష్ట్ర రైతాంగానికి సాయుధపోరాటంలో ఎట్లైతే స్ఫూర్తిని నింపిందో.. మళ్ల ఇప్పుడు గూడా అట్లనే నల్లగొండనే స్ఫూర్తి కావాలె. రైతులు తిరగబడుతందుకు నల్లగొండనే వేదిక కావాలె. అందుకే నల్లగొండ నుంచే ఈ రైతు పోరు మొదలుపెట్టినం. ఇంకా నాలుగేండ్ల సమయం ఉంది. మిమ్మల్ని అందరినీ నేను ప్రార్థించేది ఒక్కటే. కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధిచెప్పాలె. కేసీఆర్ తయారు చేసిన అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు అందరూ మీకు మద్దతు ఉంటరు. ఈ ప్రభుత్వంలో రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతా అనే మంత్రి ఒకడున్నడు. మీటింగ్ పెట్టుకుంటమంటే అడ్డుకునే సన్నాసి మంత్రి ఒకడున్నడు. భూపాల్‌రెడ్డిని తీస్కపోయి పోలీస్‌స్టేషన్‌ల దాడి చేసిండు. నీకు సిగ్గుందా అని అడుగుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**'నీకు ధైర్యం ఉంటే, దమ్ముంటే గడియారం సెంటర్‌కు రా...**

'నీకు ధైర్యం ఉంటే, దమ్ముంటే గడియారం సెంటర్‌కు రా. మా లెక్కనే వచ్చి మీటింగ్ పెట్టి రైతులకు మీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పు' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ చేశారు. 'ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిలకు ఆకారాలు బాగా పెరిగినయ్. అహంకారాలు బాగా పెరిగినయ్. కానీ నల్లగొండకు వాళ్లు చేసిందేమీ లేదు. కానీ కేసీఆర్ ఏం చేసిండని మాట్లాడుతరు. కేసీఆర్ ఏం చేసిండో చెప్తున్నా. వరి ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ చేసిండు. నల్లగొండను తెలంగానలోనే నెంబర్ వన్ చేసిండు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రిలో మూడు మెడికల్ కాలేజీలు కట్టిచ్చిండు. యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది లక్ష్మీ నరసింహస్వామి రుణం తీర్చుకున్నడు. దామరచర్లలో తెలంగాణలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కట్టిచ్చిండు. చెప్పుకుంటే పోతే ఒకటి రెండు కాదో ఎన్నో పనులు చేసినం. దమ్ముంటే క్లాక్ టవర్‌కు రా.. మా భూపాలన్న, జగదీష్ అన్న వస్తరు. నీ సంగతి చెప్తరు' అని కేటీఆర్ హెచ్చరించారు.

'మనం హైకోర్టుకు ధన్యవాదాలు చెప్పాలె. మన న్యాయవ్యస్థకు ధన్యవాదాలు చెప్పాలె. ఎందుకంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేసినా, రైతుల పోరాటంలో న్యాయం ఉందని అర్థం చేసుకుని ఇయ్యాల మనం ధర్నా చేసుకునేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. సీఎం రాజ్‌భవన్ ముందు ధర్నా చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది కాదటగానీ, మనం ఇక్కడ ధర్నా చేస్తే ప్రభుత్వానికి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఇబ్బంది అయితదట. నేను పోలీస్ అధికారులకు, జిల్లా అధికార యంత్రాంగానికి గుర్తుచేస్తున్న. మరిచిపోకండి. భవిష్యత్తు కచ్చితంగా గులాబీ జెండాదే. ముమ్మాటికి తిరిగివస్తాం. ఇయ్యాల ఎవరైతే కాంగ్రెస్ కార్యకర్తల కంటే అతిగా ప్రవర్తిస్తున్నరో అన్ని గుర్తుపెట్టుకుంటున్నం. వడ్డీతో సహా ఇస్తం. యాదికి పెట్టుకోండి' అని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.

# గోదావరి కరకట్ట నిర్మాణం వేగవంతం చేయాలి

**విశ్వంభర, హైదరాబాద్:** గోదావరి కరకట్ట నిర్మాణం వేగవంతం చేయాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ములుగులోని ఇరిగేషన్ పెండింగ్ పనులపై, ఫ్లడ్ కెనాల్ వర్క్స్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లక్నవరం నుంచి రామప్ప కెనాల్ నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. గడువులోపు పనులు పూర్తయ్యేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## అట్టహాసంగా పోలీసుల స్పోర్ట్స్ మీట్

**విశ్వంభర, కరీంనగర్:** కరీంనగర్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రస్థాయి తృతీయ పోలీస్ గేమ్స్, స్పోర్ట్స్‌మీట్-2025 అట్టహాసంగా ప్రారంభమైంది. ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి ఒకటోతేదీ వరకు జరిగే క్రీడాపోటీల్లో 29 క్రీడాంశాలకు 20 పోలీస్ జోన్‌ల నుంచి సుమారు 2400 క్రీడాకారులు పోటీ పడుతున్నారు. కరీంనగర్ నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోని 12 వేదికల ద్వారా ఈ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిధిగా హాజరైన ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. పౌరుషాల కరీంనగర్ గడ్డపై పోలీసుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. అనివార్య కారణాలతో 2017 తరువాత పోలీసుల క్రీడాపోటీలను నిర్వహించలేకున్నా, రాష్ట్ర పోలీసు క్రీడాకారులు ఇటీవల జరిగిన జాతీయస్థాయి క్రీడాపోటీల్లో 26 బంగారు పతకాలు, 79 రజత, 102 కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారన్నారు. క్రీడాపోటీల్లో రాణించే పోలీసులను ప్రొత్సహించేందుకు పతకాలు సాధించిన వారికి ఇంక్రిమెంట్లు అందిస్తున్నామని శివధర్ రెడ్డి చెప్పాన్నారు. పోలీసు ఉద్యోగమనేది ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. మహిళా ఉద్యోగులు సైతం రాష్ట్ర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారని, వారి నుంచి పెద్ద సంఖ్యలో పతకాలు ఆశిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు పలు జోన్‌ల నుంచి వచ్చిన పోలీసు క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. వారి నుంచి ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఐజీపీ స్పోర్ట్స్ తెలంగాణ ఎం రమేష్‌రెడ్డి, మల్టిజోన్ ఐజీపీ-1 ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

## ఇది పూర్తిస్థాయిలో తప్పుడు పిటిషన్

**ఢిల్లీ:** ఏపీ సీఎం చంద్రబాబు పై ఉన్న సీఐడీ కేసులను సీబీఐకి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏడు కేసులు సీబీఐకి బదిలీ చేయాలంటూ హైకోర్టు న్యాయవాది బి.బాలయ్య ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇది పూర్తిస్థాయిలో తప్పుడు పిటిషన్ అని జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్‌కు సంబంధించి ఒక్క మాట మాట్లాడినా భారీగా జరిమానా విధిస్తామని జస్టిస్ బేలా త్రివేది హెచ్చరించారు. బాలయ్య తరపున వాదనలు వినిపించడానికి సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ సిద్ధమవగా.. ఇలాంటి పిటిషన్లను కూడా మీరు వాదిస్తారా? అని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి కేసుల్లో కూడా మీలాంటి సీనియర్లు హాజరవుతారని అసలు ఊహించలేదని వ్యాఖ్యానించింది. ఒక్క మాట కూడా మాట్లాడొద్దంటూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది.

## ఇసుక మాఫియాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి: సీఎం రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఎలా సరఫరా చేయాలో అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఫ్లాగ్ షిప్ కార్యక్రమాల కమిషనర్ శశాంక, టీజీఎండీసీ ఎండీ సుశీల్ కుమార్‌తో కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యయనం చేసి వారం రోజుల్లో విధివిధానాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా, గనుల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఏటా నిర్మాణాలు పెరుగుతున్నప్పటికీ.. ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆశించినంత ఆదాయం రావడం లేదన్నారు. ప్రజలు మాత్రం ఎక్కువ ధరకు ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ప్రజలకు తక్కువ ధరకే ఇసుక దక్కేలా.. ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా మార్గాలు అన్వేషించాలని సీఎం సూచించారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మేజర్, మైనర్ ఖనిజాల గనులకు వేసిన జరిమానాలు ఎందుకు వసూలు కావడం లేదని అధికారులను సీఎం ప్రశ్నించారు. ఖనిజ విధానంపై సమగ్ర అధ్యయనం చేసి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించారు. గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, సీఎంఓ ఉన్నతాధికారులు వి.శేషాద్రి, మాణిక్ రాజ్ పాల్గొన్నారు.

## ఎంజీయూ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్న కేటీఆర్



**విశ్వంభర, నల్లగొండ :** నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు మహాధర్నాకు వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మహాత్మా గాంధీ యూనివర్సిటీ విద్యార్థులు కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. ఇక తమకు గొడ్డు కారం పెడుతున్నారంటూ విద్యార్థులు తమ సమస్యలను కేటీఆర్‌కు విన్నవించుకుని బాధపడ్డారు.వీసీ అరాచక పాలన కొనసాగిస్తున్నారని విద్యార్థులపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని బాధిత విద్యార్థులు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే యూనివర్సిటీకి భవనాలు మంజూరు అయ్యాయని విద్యార్థులు కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ పాలనలో కడుపు నిండా అన్నం తినే వాళ్లమని విద్యార్థులు పేర్కొన్నారు. వీసీని తొలగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌ను విద్యార్థులు అభ్యర్థించారు. విద్యార్థులకు అండగా ఉంటామని, మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కేటీఆర్ చెప్పారు.

## రైతు భరోసా చిల్లర పంచాయితీనా ముఖ్యమంత్రి గారు..?

### సూటిగా ప్రశ్నించిన హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్ ఎలా ఉందంటే.. పెట్టుబడుల కట్టు కథను నమ్మించేందుకు శత విధాలా ప్రయత్నించి అట్టర్ ఫ్లాప్ అయినట్లు ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మీ ప్రెస్ రిలీజులు, మీ మీడియా కవరేజులు, మీ ఈనో స్టోరీలు ఎవరూ నమ్మడం లేదని చివరకు ప్రెస్‌మీట్ పెట్టావు అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.ఎప్పుడో అయిపోయిన దావోస్‌కు ఇప్పుడు ఎందుకు ఈ దావతు. దావోస్‌లో జరిగే ఎంవోయూలు అన్నీ కూడా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ మాత్రమే, ఎవరైనా ఓపెన్ టెండర్‌లో రావాల్సిందే.. అని ఆర్థిక మంత్రి భట్టి గారు అంటే, మీరేమో లక్షా 82 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లు గప్పాలు చెబుతున్నారు. భట్టి గారు చెప్పింది నిజమా? మీ మాటలు నిజమా? రేవంత్ రెడ్డి గారూ.. అని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు.పొంతన లేకుండా మీరు చెప్పిన కంపెనీలు, పెట్టుబడుల లెక్కలు యావత్ తెలంగాణ ప్రజానీకం గమనించింది. అంతా డొల్ల ప్రచారం అని తేలిపోయింది. రైతు భరోసా కోసం గంపెడు ఆశతో, కొండంత ఆందోళనతో ఎదురుచూస్తున్న రైతుల ఆరాటాన్ని చిల్లర పంచాయితీ అంటవా? ఇంతక ముందు రైతు బంధును బిచ్చం అన్నవు, ఇప్పుడు రైతు భరోసాను చిల్లర పంచాయతీ అంటున్నవు. సంక్రాంతికి ఇస్తానన్న సంగతి తేలిపోయింది, చబ్బీస్ (26) జనవరి చేదు మాత్రనే అయ్యింది, ఇప్పుడు మార్చి 31 దాకా గడువు పెంచినవు అని హరీశ్‌రావు మండిపడ్డారు.జర్నలిస్టులు ఇదేమని అడిగితే, చిల్లర పంచాయితీ అంటున్నవు. అప్పుల పాలవుతున్న రైతుల ఆవేదన పక్కన పెట్టి మీ ప్రచారం వినాలా? రైతుల అప్పులు ముఖ్యమా..? దావోస్ డప్పులు ముఖ్యమా..? మీ సెల్ఫ్ డబ్బాకు, మీ వెకిలి సెటైర్లకు కాలం చెల్లింది. ఇకనైనా కళ్ళు తెరువు రేవంత్ రెడ్డి. నీలో అటెన్షన్ డిక్రీసింగ్ డిజార్డర్ మొదలైంది. నీ మాటలు ఎవరు నమ్మడం లేదనే ఆందోళన పెరిగిపోయింది. మంచి మానసిక వైద్యుడిని సంప్రదించడం మంచిది అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి




**విశ్వంభర, చైతన్యపురి :** చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ భద్రయ్య ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివాజీ సర్కిల్ వద్ద ప్రజలకు రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నందునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రతా వారోత్సవాల నుంచి మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలని, రోడ్డు ప్రమాదాల కారణంగా నష్టపోతున్న వారిలో సుమారు 60 నుంచి 70 శాతం యువతే ఉన్నారని గుర్తు చేశారు. కాబట్టి రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల కుటుంబానికి కలిగే నష్టాన్ని ఎవరు పూడ్చలేరని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు. యాక్సిడెంట్స్ ఫ్రీగా మార్చడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు ఒకసారి ఆలోచించాలని గుర్తు చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిరోజు రోడ్డు భద్రతపై కొంత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, చంద్రశేఖర్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ రైడ్



**విశ్వంభర, తిరుమలగిరి:** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. రేషన్ బియ్యం కేసులో రూ.1 లక్ష లంచం తీసుకుంటూ ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు ఏసీబీకి పట్టుబడ్డారు.

# రాజ్యాంగ ద్రోహులే ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు

- వేల గొంతులు లక్షల డప్పుల సన్నాహక ప్రదర్శన
- దండోరా దరువులతో దద్దరిల్లిన మహేశ్వరం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ




విశ్వంభర, మహేశ్వరం: భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రమైన సామాజిక న్యాయానికి నిదర్శనంగా కొనసాగుతున్న ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్న మాలలు రాజ్యాంగ ద్రోహులుగా మిగిలిపోతారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం కేంద్రంలో వేల గొంతులు లక్షల డప్పుల సన్నాహక సమావేశం ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహా మాదిగ అధ్యక్షతన, మహేశ్వరం మండల ఇంచార్జి బకాని రవి మాదిగ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వాన్ని సూచిస్తుందని ఎస్సీలలో సమానత్వం సాధ్యం కావాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలని అన్నారు. గత డెబ్బై ఏళ్లుగా ఎస్సీలలో ఉమ్మడి రిజర్వేషన్ విధానం కొనసాగింపు వలన ఒక్క మాల కులమే విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు అందుకొని 58 ఎస్సీ కులాలు తీవ్రంగా నష్టపోయి వెనకబడ్డారని అన్నారు. దీని వల్లనే ఎస్సీలలో అంతర్గతంగా అసమానతలు తలెత్తాయని అన్నారు. ఈ అసమానతలు తొలగిపోవాలంటే ఎస్సీ వర్గీకరణ అమలు చేయడమే సరైన మార్గమని, తద్వారా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కోరిన సమానత్వ సాధన సాధ్యవుతుందని అన్నారు. జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించడమే సామాజిక న్యాయం, ఆ సామాజిక న్యాయాన్నే రాజ్యాంగం కోరుతుందని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు అందించేలా వర్గీకరణ చేయడం ద్వారానే సామాజిక న్యాయం అమలు జరుగుతుందని అన్నారు. కనుక ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి నిలువుటద్దంలా ఉంటుందని అన్నారు.అయితే కొంత మంది స్వార్థపరులైన మాలలు ఎస్సీ వర్గీకరణకు రాజ్యాంగం అంగీకరించదు అని అసత్యాలు, అబద్ధాలు మాట్లాడుతున్నారు. వాళ్ళు చరిత్రలో రాజ్యాంగ ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ ను రేవంత్ రెడ్డి ప్రభుత్వ వెంటనే అమలులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అందుకోసం ఫిబ్రవరి 7 న వేల గొంతులు లక్షల డప్పుల ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమగళ్ళ చంద్రయ్య మాదిగ మాజీ ఎంపిటిసి, ఒత్తుల రఘుపతి మాదిగ సీనియర్ నాయకులు, ఆనందం మహేశ్వరం మాజీ సర్పంచ్, మాజీ సర్పంచ్ యాదయ్య మద్దిలేటి మాదిగ, రావుగాళ్ళ బాబు మాదిగ ఎమ్మెస్ పి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, కట్ట గల ప్రశాంత్ మాదిగ, సురేష్ రావిరాల మాజీ సర్పంచ్, పోతుగంటి కృష్ణ మాదిగ, శివ శంకర్ మాదిగ, నందిగామ నరసింహ మాదిగ, దుబ్బచర్ల సర్పంచ్ ఎర్ర సత్యం మాదిగ నందిపల్లి సర్పంచ్ కృష్ణ, కలువుకోల్ ఎంపీటీసీ రవీందర్, నాగిరెడ్డిపల్లి ఎంపీటీసీ రమేష్, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ మనోహర్, ఎమ్మార్పీఎస్ మహేశ్వరం మండల అధ్యక్షులు ఎర్ర గణేష్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షులు ఎర్ర కృష్ణ మాదిగ, నడి కూడా అర్జున్ మాదిగ, శేఖర్, జంగయ్య, ఎమ్మెస్సార్ జిల్లా అధ్యక్షులు భాను ప్రసాద్, బోర రవి మాదిగ, మంద సాయిలు చిర్ర సాయిలు, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## క్యూబాను టెర్రరిస్ట్ దేశాల జాబితా నుండి తొలగించాలి

### * రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే.వి.ఎల్ డిమాండ్




**విశ్వంభర, మేడ్చల్:** అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని, షామీర్పేట్ ఎస్.పి.ఆర్ కళాశాల లో "ప్రపంచ శాంతి _ విద్యార్థుల పాత్ర" అనే అంశంపై జిల్లా కార్యదర్శి డి.జి. నరేంద్ర ప్రసాద్ అధ్యక్షతన సెమినార్ జరిగింది. ఈ సెమినార్ కు ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐపీఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్ మాట్లాడుతూ ప్రపంచంలో ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం జరుగుతుంది. మరొకవైపు పాలస్తీనా పై ఇజ్రాయిల్ ఏకపక్ష దాడి జరుగుతున్న సందర్భంలో, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ క్యూబా దేశంపై విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని, క్యూబా దేశాన్ని టెర్రరిస్ట్ దేశాల జాబితా నుండి తొలగించాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ స్థాయిలో పోరాటం చేస్తున్నదని కె.వి.ఎల్ తెలియజేశాను.

గత అమెరికా ప్రెసిడెంట్, బైడెన్ క్యూబాను టెర్రరిస్ట్ దేశాల జాబితా నుండి తొలగించినప్పటికీ, దురుద్దేశపూర్వకంగా ట్రంప్ మళ్లీ క్యూబాకు వ్యతిరేకంగా ఈ చర్యలను తీసుకోవడంపై అఖిల భారత శాంతి సంఘీభావ సంగం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ప్రపంచంలో యుద్ధం, తీవ్ర వాదం, టెర్రరిజం, హింసవాదం, మతోన్మాదం, ఆయుధ పోటీ, చాలా ప్రమాదకరమని యుద్ధాల వలన వేలాదిమంది ప్రాణాలను కోల్పోతున్నారు. ఆస్తి నష్టం అవుతుంది. ప్రకృతి సంపదలకు, పాఠశాలలకు, కళాశాలకు, వైద్యశాలలక, కర్మాగారాలకు, యుద్ధాల వల్ల దెబ్బ తగలడమే కాదు ప్రపంచ నాగరికత సంస్కృతులు దాడికి గురవుతున్నాయని అన్నారు. వీటికి వ్యతిరేకంగా శాంతి సంఘీభావ సంఘం జాతీయ కమిటీ పిలుపుమేరకు దేశమంతటా పోరాటాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రపంచంలోని విద్యార్థుల మౌలిక సమస్యలపై స్వాతంత్రం స్వేచ్ఛ సాధనలపై వివిధ రూపాలలో విద్యార్థులు చేసిన పోరాటాలు వీరోచితమైనవని స్ఫూర్తిదాయకంగా ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రపంచంలో విద్యార్థుల పోరాటాలు చేయని సంఘటనలు లేవని విద్యార్థుల పోరాటాల తోటే మార్పు సంభ ఇస్తుందని ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ శాంతి సాధనకు విద్యార్థులు రాజకీయాలకు అతీతంగా సమైక్య పోరాటాల నిర్వహించడానికి ముందుకు రావాలని శాంతి ఉద్యమంలో సభ్యులుగా చేరి ఐప్సో బలోపేతానికి కృషి చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని కె.వి.ఎల్ అన్నారు.

మేడ్చల్ జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ప్రపంచ శాంతి సంఘీభావ సంఘానికి అనుబంధంగా ఉందని, ఈ సంఘం ద్వారా సమాజంలో శాంతి స్థాపనకు కృషి జరుగుతుందన్నారు. మానవ హక్కులను కాపాడుకోవాలని విద్యార్థుల చరిత్ర గొప్పదని శాంతి ఉద్యమంలో పాల్గొనాలని అన్నారు.

ఐప్సో మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీ.జీ.నరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు శాంతియుతమైన పరిస్థితులను ఉండాలని, విద్యార్థుల మధ్య స్నేహభావం సమన్వయం ఉండాలని, మత్తు తదితర వసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ జిల్లాలో అఖిల భారత శాంతి సంఘీభావ సంగం బలమైన శక్తిగా ఎదగటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు.

రంగారెడ్డి జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి పోలగాని రవి కిషోర్ మాట్లాడుతూ ఏఐపీఎస్ఓ జాతీయ అంతర్జాతీయ సమస్యలపై పోరాడిందన్నారు. మణిపూర్ సంఘటనలు మళ్లీ పునరావృతం కాకూడదని, దేశంలో అశాంతి పరిస్థితిలు ఉండకూడదని అన్నారు, ఈ కార్యక్రమానికి ముందుగా మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీఎల్ రచించిన శాంతి ఉద్యమ పుస్తకాలను విద్యార్థులకు బహుమతులుగా అందజేశారు. కే.వి.ఎల్ గారి స్పీచ్ కు స్పందిస్తూ వెంటనే విద్యార్థులు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం లో సభ్యులుగా చేరారు. శాంతి ఉద్యమ బలోపేతం కొరకు కృషి చేస్తామని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతోపాటు కళాశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పద్మ అవార్డులపై రాజకీయ రచ్చ

మొదటిపేజీ తరువాయి

ముగిసినా.. తెలంగాణలో పద్మ అవార్డులపై రాజకీయ రచ్చమాత్రం చల్లారడం లేదు. ఈ వ్యవహారంపై పొలిటికల్ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ఐదు అవార్డులు వచ్చినప్పుడు తెలంగాణకు కనీసం నాలుగు అవార్డులు కూడా ఇవ్వకపోవడం వివక్ష కాదా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు.. తెలంగాణ ప్రభుత్వ సిఫార్సులను కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు.

గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు పేర్లు..

పద్మ అవార్డుల కోసం గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు పేర్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. కానీ వీరిలో ఏ ఒక్కరి పేరును కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు సీఎం రేవంత్. ఈ విషయంలో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రానికి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు.

బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు.. కాంగ్రెస్ కౌంటర్..

ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. అయితే నక్సల్స్ భావజాలంతో ఎందరో బీజేపీ నేతలను చంపించిన గద్దర్‌లాంటి వ్యక్తులకు..పద్మ అవార్డులు ఎలా ఇస్తామని ప్రశ్నించారు కేంద్రమంత్రి బండి సంజయ్. అలాంటి వ్యక్తులకు బరాబర్ అవార్డులు ఇవ్వమని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన పేర్లను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందన్న బండి.. అర్హులైన వారికే పద్మ అవార్డులు వస్తాయని తేల్చిచెప్పారు.

గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు..ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. మాజీ నక్సలైట్లకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వొచ్చు కానీ.. పద్మ అవార్డులు ఇవ్వడానికి పనికి రారా? అని ప్రశ్నలు సంధించారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ లాంటి వ్యక్తిని పద్మ అవార్డులకు ప్రతిపాదిస్తే తప్పా అని ప్రశ్నించారు.

బీజేపీ భావజాలం ఉన్నవారికి మాత్రమే అవార్డులు ఇస్తారా? అని ప్రశ్నించారు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గద్దర్ పోరాటం చేశారన్న చామల.. గద్దర్‌పై సంజయ్ చేసిన వ్యాఖ్యలను విత్ డ్రా చేసుకోవాలి అని కామెంట్స్ చేశారు.

గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించారు.. కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్. బుద్ధిస్ట్ మీకు మావోయిస్టుగానే కనబడ్డారా? అని ప్రశ్నించారు. గద్దర్‌లోని తెలంగాణ ఉద్యమకారుడు, దళిత ప్రజా ఉద్యమకారుడు కనిపించలేదా? అని నిలదీశారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు వ్యక్తిగతమా.. పార్టీ విధానమా? చెప్పాలని డిమాండ్ చేశారు అద్దంకి.

అయితే.. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు బండి సంజయ్. భావజాలం వేరు మావోయిస్టుగా చేయడం వేరన్న బండి.. మావోయిస్టులతో ఈటలకు సంబంధం లేదని చెప్పారు. ప్రభుత్వం ఇస్తామంటున్న గద్దర్ అవార్డులను బీజేపీ వాళ్లు తీసుకోరని స్పష్టం చేశారు.

కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు..

అటు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కూడా పద్మ అవార్డులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో సత్సంబంధాలు ఉన్న వారికే కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిరంజీవికి ఇస్తే, ఇప్పుడు బీజేపీ బాలకృష్ణకి ఇచ్చిందని విమర్శించారు కేఏ పాల్..

గద్దర్‌పై బీజేపీ నేత విష్ణువర్ధన్ సంచలన వ్యాఖ్యలు


గద్దర్‌కు, ఎల్టీటీఈకి పెద్దతేడా లేదంటూ బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అనేక మంది ప్రాణాలు తీసిన నరహంతకుడు గద్దర్.. ఆయనపై అనేక కేసులు ఉన్నాయన్నారు. భారత ప్రజాస్వామ్య విధానాలకు గద్దర్ వ్యతిరేకి.. నిషేధిత మావోయిస్టు సంస్థలో ఉన్న గద్దర్‌కు.. అవార్డు ఎలా ఇవ్వమంటారు? ఎల్టీటీఈకి కూడా పద్మ అవార్డులు ఇవ్వాలని రేవంత్ అంటారా? అంటూ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలపై ఇప్పటికే మండిపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. లేటెస్ట్‌గా యూజీసీ, పద్మ అవార్డుల అంశంలోనూ మోదీ సర్కారు తీరును తప్పుబడుతోంది. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మరి ఈ వ్యవహారం ఎంతవరకూ వెళ్తుందో చూడాలి.

## టేకాఫ్‌కు సిద్ధమైన విమానం.. ఎమర్జెన్సీ డోర్ తెరిచిన ప్రయాణికుడు

**బెంగళూరు:** విమానంలో బాంబు ఉందంటూ, గాల్లో ఉండగానే ఎమర్జెన్సీ డోర్‌ను తెరవడం ఇలా కొందరు వ్యక్తుల చర్యలు తోటి ప్రయాణికులను ఎంతో అసౌకర్యానికి గురి చేస్తుంటాయి. తాజాగా టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న విమానం అత్యవసర ద్వారాన్ని ఓ ప్రయాణికుడు తెరిచాడు. దీంతో ఆ వ్యక్తిని అధికారులు అరెస్టు చేశారు. ఈ ఘటన ఇండిగో విమానంలో చోటు చేసుకుంది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి బెంగళూరుకు వెళ్లేందుకు మంగళవారం ఉదయం ఇండిగో విమానం 6E 6033 సిద్ధమైంది. మరికొన్ని క్షణాల్లో టేకాఫ్ అవుతుందనగా.. ఒక ప్రయాణికుడు ఎమర్జెన్సీ డోర్‌ను తెరిచాడు. దీంతో విమానంలో గందరగోళ వాతావరణం నెలకొంది. సిబ్బంది వెంటనే అప్రమత్తమై పైలట్‌కు సమాచారం అందించడంతో ప్రమాదం తప్పింది. సదరు వ్యక్తిని విమానం నుంచి దింపేశారు. అతడిని సీఐఎస్ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో విమానం 20 నిమిషాల పాటు ఆలస్యమైంది. ప్రస్తుతం ఆ వ్యక్తిని విచారిస్తున్నారు. ఈ ఘటనపై ఇండిగో ఎయిర్‌లైన్స్ స్పందించింది. "టేకాఫ్ సమయంలో ఓ ప్రయాణికుడు ఎమర్జెన్సీ డోర్‌ను తెరిచాడు. ప్రయాణికులకు కలిగిన ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహిస్తాం" అని ఓ ప్రకటనలో పేర్కొంది.

## జూన్ లోపు అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తాం: సీఎం చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** జూన్ లోపు ప్రభుత్వంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారికంటే.. ఎప్పటి నుంచో పార్టీలో ఉండి పనిచేసిన వారిని నేతలు ప్రోత్సహించాలన్నారు. మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని తేల్చి చెప్పారు. 214 మార్కెట్ కమిటీలు, 1100 ట్రస్ట్ బోర్డులు ఉన్నాయని, రానున్న రోజుల్లో ఈ నియామకాలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదవి పొందిన వాళ్ల రెండేళ్ల పనితీరుపై సమీక్ష చేస్తామని తెలిపారు. దాని ఆధారంగా మళ్లీ నిర్ణయాలు, భవిష్యత్ అవకాశాలు ఉంటాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు.వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల్లో పదవి ఆశిస్తున్న వాళ్లు క్యాబ్స్ (క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్) విభాగాల్లో సభ్యులుగా ఉండాలన్నారు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని వెల్లడించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, నేతల పనితీరు వంటి అంశాలపై ఇందులో చర్చించారు. 2029లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలని తేల్చి చెప్పారు. 7 నెలల కాలంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టామన్న చంద్రబాబు ఈ విషయాలను నిరంతరం ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని, ఈ విషయంలో వైకాపా తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలని నేతలకు సూచించారు. మెంబర్ షిప్ బాగా చేసిన వారికి పదవుల్లో ప్రోత్సాహం ఇస్తామన్నారు.

## డాక్టర్ రవీందర్ నాయక్‌కు రిప్రజెంటేషన్ ఇచ్చిన హెల్త్ ఎంప్లాయిస్




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 1 ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుండి విచ్చేసిన మహిళా హెల్త్ అసిస్టెంట్లు, సూపర్వైజర్లు, పిహెచ్ఎన్ లు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ ని కలిసి రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ రిప్రజెంటేషన్ లోని ముఖ్యంశాలు హెల్త్ అసిస్టెంట్లు సూపర్వైజర్లుగా, సూపర్వైజర్లకు పీహెచ్ఎన్ లుగా, పీహెచ్ఎన్ లకు సీహెచ్ఓ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, మహిళా హెల్త్ అసిస్టెంట్లకు వెంటనే ట్రైనింగ్ ఇచ్చి సూపర్వైజర్లుగా ప్రమోషన్ కల్పించాలని, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టును వెంటనే అమలు చేయాలని కోరడం జరిగింది. ఆ తర్వాత మహిళా విభాగం హెచ్ వన్ యూనియన్ ఎన్నికలు నిర్వహించి, అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. మహిళా విభాగం అధ్యక్షురాలిగా లూర్దు మేరీ, కార్యదర్శిగా యాదమ్మలను ఎన్నుకోవడం జరిగింది. పూర్తిస్థాయి కమిటీని త్వరలోనే నియమిస్తామని అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, సువర్ణ, పద్మశ్రీ, సుజాత, అమరేశ్వరి, వనకుమారి, శాంతాబాయి, శాంత, జయశీల, భారతి సుకుమారి, దయామని, పుష్పావతి, కే.వల్లి తదితరులు పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోన్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నది. ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే మలక్‌పేటలో సావరియా ఫుడ్ ట్రేడర్స్ అండ్ టిప్ టాప్ ఫుడ్స్, ఎల్లారెడ్డిగూడలోని టేస్టీ స్పైసీ చైనీస్ ఫాస్ట్ ఫుడ్, శ్రీనగర్ కాలనీలో మేఘ కర్రీ పాయింట్, ఉప్పల్‌లోని పిస్తా హౌజ్‌లపై తనిఖీలు చేశారు. అపరిశుభ్ర వాతావరణం, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పదార్థాల తయారీని గుర్తించి సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తెలిపారు.





గిరిజనుల ఇలవేల్పు నాగోబా

ప్రజాదర్బార్, బేటింగ్‌లతో సాగే జాతర

పుష్య అమావాస్యరోజు.. లోకమంతా నలుపురంగు పులుముకుంటుంది..

అదే చీకటిలో వెలుగులు వెతుకుతారు ఆదివాసీలు!

నిష్ఠగా నాగదేవునికి దీపారాధన చేసి పూజిస్తారు!

పవిత్ర గంగాజలంతో అభిషేకిస్తారు!

# ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన మహా జాతర నాగోబా

ఆదిలాబాద్ జిల్లాలో అడవి బిడ్డల సంబురం మొదలైంది.ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా మహాజాతరకు అంతా సిద్ధమైంది. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం రాత్రి 11గంటలకు మహాపూజల నిర్వహణతో జాతర ప్రారంభమైంది.ఈ జాతరలో రాత్రి 12 గంటలకు గోదావరి నది జలాలతో అభిషేకం చేశారు.ఆదిశేషుని నాగోబా జాతర దేశంలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతర కావడం తెలంగాణకు ప్రత్యేకతను తెచ్చిపెట్టింది. నాగోబా జాతర ఉత్సవాలను ఆదివాసీలు సంప్రదాయ, ఆచార వ్యవ హారాలతో నిర్వహిస్తారు. జనవరి 30వ తేదీన ఆలయం వెనుక ఉన్న పెద్ద దేవతకు పూజలు నిర్వహించే కార్యక్రమం ఉంటుంది. వారం రోజులపాటు ఇక సందడే కొనసాగనుంది.జాతర సందర్భంగా ఏర్పాటయ్యే దర్బార్‌కు ఒక ప్రత్యేకత, చరిత్ర ఉంది. నిజాం హయాంలో మారుమూల గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు లేవు. నాగరికులంటేనే ఆదివాసులు పరుగెత్తేవారు. గిరిజనుల వద్దకు అధికారులెవరు వెళ్లేవారు కాదు. అప్పుడే భూమి కోసం.. విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి కొమురం భీం మరణించిన సంఘటన జరిగింది. ఈ సంఘటనతో ఉలిక్కిపడ్డ నిజాం ప్రభువులు గిరిజన ప్రాంతాల పరిస్థితులు, గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ ను ఆదిలాబాద్ జిల్లాకు పంపారు. అప్పుడు నిజాం దృష్టి జాతరపై పడింది. కొండలు, కోనలు దాటి వచ్చే గిరిజనుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జాతరలో దర్బార్ ఏర్పాటు చేయాలని అనుకున్నాడాయన. దీన్ని ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ 1946లో మొదట నిర్వహించాడు. స్వాతంత్రం వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. జాతర చివరి రోజున జరిగే ఈ దర్బార్‌కు గిరిజన పెద్దలు, తెగల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతూ ఉంటారు. మంగళవారం రాత్రి నుంచి పవిత్ర గోదావరి నదీజలాభిషేకం అనంతరం జాతర మొదలయింది. తొలినుంచి వస్తున్న ఆచారాలకి అనుగుణంగా జన్నారం మండలం కలమడుగుకు సమీపంగా పారే గోదావరి నుంచి ప్రత్యేకమైన కుండలలో జలాన్ని తీసుకువస్తారు మేస్రం కులస్తులు! వాటితో నాగోబా దైవానికి అభిషేకం జరపడంతో జాతర మొదలవుతుంది. రాత్రంతా నాగదైవానికి మహాపూజ నిర్వహిస్తారు. అది మొదలు వరుసగా మూడురోజులపాటు కోలాహలంగా జాతర కొనసాగుతుంది. వేడుకల అనంతరం(ఫిబ్రవరి 3న) ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. దీనికి స్థానిక ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు జిల్లా అధికారులందరూ హాజరవుతారు. ఈ దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పరిష్కరించుకునే వీలుంది.



జాతరకు వచ్చే మేస్రం వంశీయులు వేలాది మంది ఉన్నా వారు వంట చేసుకునేది మాత్రం 22 పొయ్యిల మీదే. ఈ పొయ్యిలు ఎక్కడపడితే అక్కడ పెట్టడానికి వీల్లేదు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ లోపల, గోడకు చుట్టూ దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక అరలు (దుగుడు) ఉన్నాయి. ఆ దీపాల కాంతుల వెలుగులో 22 పొయ్యిల్లో మేస్రం వంశీయుల వంతుల వారిగా వంటలు చేసుకుంటారు. మిగితా జాతుల వారు ఎక్కడైనా వంట చేసుకోవచ్చు. జాతర సందర్భంగా ఏర్పాటయ్యే దర్బార్‌కు ఒక ప్రత్యేకత, చరిత్ర ఉన్నాయి. 63 ఏడేళ్ల క్రితం మారుమూల గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు లేవు. నాగరికులంటేనే ఆదివాసులు పరుగెత్తేవారు. గిరిజనుల వద్దకు అధికారులెవరు వెళ్లేవారు కాదు. అప్పుడే భూమి కోసం.. విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి కొమురం భీం మరణించిన సంఘటన జరిగింది. ఈ సంఘటనతో ఉలిక్కిపడ్డ నిజాం ప్రభువులు గిరిజన ప్రాంతాల పరిస్థితులు, గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ ను ఆదిలాబాద్ జిల్లాకు పంపారు.

ఆయన దృష్టి జాతరపై పడింది. కొండలు, కోనలు దాటి వచ్చే గిరిజనుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జాతరలో దర్బార్ ఏర్పాటు చేయాలని అనుకున్నాడాయన. దీన్ని ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ 1946లో మొదట నిర్వహించాడు. స్వాతంత్రం వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. జాతర చివరి రోజున జరిగే ఈ దర్బార్‌కు గిరిజన పెద్దలు, తెగల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతూ ఉంటారు. నాగోబా పూజల అనంతరం నాగోబా ఆలయ ఆవరణలో ఉన్న పుట్టను మట్టితో మెత్తడంలో మేస్రం వంశీయుల అల్లుళ్లకు పెద్దపీట వేస్తారు. అల్లుళ్లు మట్టిని కాళ్లతో తొక్కి మెత్తగా చేస్తే కూతుళ్లు ఆ మట్టితో పుట్టను మెత్తి (అలికి) మొక్కులు తీర్చుకుంటారు. అల్లుళ్లు మట్టిని తొక్కినందుకు వారికి ప్రత్యేక నజరానా అందజేయడం సంప్రదాయం. ఈ జాతరకు మన రాష్ట్రం నుంచే కాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు.

**జాతర కథ..**

క్రీ.శ 740.. కేస్లాపూర్‌లో పడియేరు శేషసాయి అనే నాగభక్తుడుండేవాడు. నాగదేవతను దర్శించుకునేందుకు ఓసారి నాగలోకానికి వెళ్లాడు. నాగలోక ద్వారపాలకులు శేషసాయిని అడ్డుకొని దర్శనానికి వీల్లేదన్నారు. నిరుత్సాహానికిగురై తిరిగి పయనమవుతూ.. పొరపాటున నాగలోకం ద్వారాలను తాకుతాడు. తన ద్వారాలను సామాన్య మానవుడు తాకిన విషయం తెలుసుకున్న నాగరాజు కోపంతో రగిలిపోతాడు! ఈ సంగతి తెలుసుకున్న శేషసాయి ప్రాణభయం పట్టుకొని.. తనకు తెలిసిన పురోహితుడు (పధాన్ పడమార్)ని కలిసి నాగరాజును శాంతింపజేసే మార్గం తెలుసుకున్నాడు. ఏడు కడవల ఆవుపాలతోపాటు పెరుగు, నెయ్యి, తేనె, బెల్లం, పెసరపప్పు తదితర ఏడురకాల నైవేద్యాలు సమర్పించి, 125 గ్రామాలమీదుగా పయనిస్తూ, పవిత్ర గోదావరినీటిని తీసుకొచ్చి నాగరాజుకు అభిషేకం చేశాడు. ఆయన భక్తికి మెచ్చిన నాగరాజు కేస్లాపూర్‌లో శాశ్వత నివాసమేర్పరుచుకున్నాడు. ఆ స్థలమే నాగోబాగా ప్రసిద్ధికెక్కింది. ఆనాటినుంచి ప్రతి సంవత్సరం నాగరాజు విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నారు గిరిజనులు!

**సిరికొండ... కుండలు**

ఇచ్చోడ మండలం సిరికొండలోని గుగ్గిల్ల వంశీయులు మాత్రమే నాగోబా కోసం కుండలు తయారుచేస్తారు. ఇదికూడా ఆచారంలో భాగమే! గుగ్గిల్ల వంశీయులకు మెస్రం వంశీయులమధ్య తరతరాలుగా సంబంధాలు కొనసాగుతున్నాయి! పుష్యమాసంలో నెలవంక కనిపించిన తరువాత మెస్రం వంశీయులు ఎడ్ల బండ్లలో సిరికొండకు వస్తారు. అక్కడి గుగ్గిల్ల వంశస్థుడైన కుమ్మరి గుగ్గిల్ల పెద్ద రాజన్న ఇంటికి చేరుకొని కుండలు తయారు చేయాలని కోరుతారు. వంటల కోసం రెండు పెద్ద కుండలు, (కాగులు), వాటిపై కప్పిపెట్టేందుకు పాత్ర (చిప్పలు), దీపాంతలు, నీటికుండలు కలిపి సుమారు 130కి పైగా కుండల తయారీకి ఆర్డర్ ఇస్తారు. మేస్రం వంశీయులు ఈ కుండల్లోనే గంగా జలాన్ని తీసుకురావడమే కాకుండా, వంట చేసి జాతరలో భక్తులకు భోజనం పెడతారు.

**నాగోబా పూజా విధానం**

గోదావరి నదినుంచి తీసుకొచ్చిన జలంతో నాగోబా విగ్రహాన్ని శుభ్రపరుస్తారు. ఆలయాన్నంతా శుద్ధి చేస్తారు. బాజా భజంవూతీలతో ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్షికమాలను నిర్వహిస్తారు. ప్రత్యేక పూజ సమయంలో మొలకెత్తిన నవధాన్యాలను తెస్తారు. ఒక రాగి చెంబులో పాలను తీసుకుంటారు. నవధాన్యాలు, మొలకలు, పాలు అన్నిటికీ ఒక కొత్త రుమాలుతో కప్పి పుట్టపైన ఉంచుతారు. పుట్టమీది రుమాలు 'పైకెత్తినట్లు' కనిపిస్తే పూజా కార్యక్షికమాన్ని ఆరంభిస్తారు. ఇప్పటికీ నాగదేవుడు రాగి చెంబులోని పాలు తాగుతాడనే విశ్వాసం వారిలో ఉంది. పూజా కార్యక్షికమంలో పాట్లాల్, గయిక్ వాడి, హవాల్ దార్ మొదలైన వారు పాల్గొంటారు.

**భేటింగ్ కీయ్‌వాల్ : నూతన వధువు పరిచయ వేదిక**

మెస్రం వంశస్థుల్లో వివాహమైన నూతన వధువులను తప్పక కేస్లాపూర్‌లో నాగోబా దేవుని వద్దకు తీసుకెళతారు. ఆమె చేత ఆ దేవునికి పూజ చేయించి వధువును పరిచయం చేస్తారు. దీన్నే 'భేటింగ్ కీయ్‌వాల్' అంటారు. ఎప్పటి వరకైతే మెస్రం తెగ వధువు ఈ పరిచయ వేదికలో పాల్గొనదో అప్పటి దాకా వారు నాగోబా దేవుణ్ని చూడడం, పూజించడం నిషిద్ధం. వధువులు ఇంటి నుంచి ఎడ్లబండి వెనుక వెదురు బుట్టలో పూజసామాక్షిగిని పట్టుకొని, కాలినడకన బయలుదేరతారు. కేస్లాపూర్‌లోని నాగోబా గుడిని చేరుకుంటారు. పరిచయం చేయాల్సిన వధువులను 'భేటి కొరియాడ్' అని పిలుస్తారు. వధువులు ఇద్దరు చొప్పున జతలు గా ఏర్పడి ముఖం నిండా తెల్లటి దుస్తులతో ముసుగు ధరిస్తారు. పూజా కార్యక్షికమానికి ముందు నాగోబా దేవుని దగ్గరకు వారిని తీసుకెళ్లి పరిచయం చేస్తారు. అక్కడి నుంచి శ్యాంపూర్‌లోని (బోదుందేవ్) జాతర అయ్యాక ఎవరి గృహాలకు వాళ్లు వెళతారు.

# సకల శుభాల మౌని అమావాస్య..

మౌని అమావాస్య ధ్యానానికి జ్ఞానానికి చిహ్నం. ఆరోజు మౌనంగా వుంటూ ..పరమేశ్వుడిని ధ్యానిస్తూ పవిత్ర గంగా స్నానంచేసి పితృదేవుళ్లకు నీరాజనాలు అర్పిస్తారు. తద్వారా పూర్వీకులకు సద్గతులు కలగడం సహా అందరికీ సకల శుభాలు కలుగుతాయంటారు పండితులు. మహాకుంభమేళానే ఎంతో మహిమాన్వితం. ఇక ఈసారి మౌని అమావాస్య కలిసిరావడం మరెంతో శుభప్రదం..

ఈ నెల 29న మౌని అమావాస్య రానుంది. కుంభమేళా జరుగుతున్న వేళలో ఈ అమావాస్య ప్రత్యేకమైనదిగా పురాణాలు పేర్కొంటున్నాయి. మౌని అంటే సంస్కృతంలో మౌనంగా ఉండటం. ఈ దినాన మౌనదీక్ష పాటించాలి. ఎవరితోనూ మాట్లాడకుండా పూర్తిగా మౌనంగా ఉండాలి. మహాశివరాత్రి ముందు వచ్చే అమావాస్య కావడంతో సాధువులు, యోగసాధకులు దీన్ని పవిత్రంగా పరిగణిస్తారు.

**ఆలోచనలపై నియంత్రణకు..**

శాస్త్రాల ప్రకారం మన ఆలోచనలకు మూలబిందువు చంద్రుడు. అమావాస్య కావడంతో ఆ రోజున చంద్రుని ప్రభావం ఉండదు. అందుకనే మన నోటి నుంచి వచ్చే మాటలపై నియంత్రణ ఉండదు. వీటి నియంత్రణకే పూర్తిగా మౌనం పాటించాలి. మన మనసుపై నియంత్రణ లేకపోతే ఏం మాట్లాడుతామో ఏం చేస్తామో తెలియదు. అందుకే పూర్తిగా మౌనంగా ఉండాలి. దీంతో అంతఃశుద్ధీకరణ జరుగుతుంది. మాటలపై నియంత్రణ ఎలా ముఖ్యమో భగవద్గీతలోని ఒక పద్యం ఇలా వివరిస్తుంది.

**''ఉద్ధరేదాత్మనాత్మానం**
**నాత్మనమవసాదయేత్**
ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ''

మానవునికి అతని మనస్సే పెద్ద సాయం చేస్తుంది. ఏ నిర్ణయమైనా మనసే మంచిదో కాదో చెబుతుంది. దీని ప్రకారంగా మనల్ని మనం బాగు చేసుకోవాల్సివుంటుంది. అంతేగాని పెడమార్గం పట్టరాదు. పరిపూర్ణమైన మనసు మిత్రుడిగా ఉంటుంది. కలుషితమైతే శత్రువుగా మారుతుంది.

**ఆ రోజు గంగా స్నానం అమృతప్రాయమే**

ఆధ్యాత్మికంగా ఈ రోజు గంగానదిలో ప్రత్యేకించి త్రివేణి సంగమంలోని జలాలు అమృతంతో సమానంగా ఉంటాయి. ఈ సమయంలో పుణ్యస్నానమాచరిస్తే ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుంది

**అందుకే నాగసాధువుల పరంపరలో ప్రవేశాలు**

ఇంత పవిత్రదినం కావడంతో ఈ రోజే కొత్తగా నాగ సాధువుల్లో చేరేవారికి దీక్షఇస్తారు. రావిచెట్టు నీడలో దీపాలు వెలిగించి పితృదేవతలకు తర్పణం కూడా పెట్టాలి.

**పవిత్ర నదులలో స్నానం చేస్తే కుంభమేళాలో స్నానం చేసిన పుణ్యఫలం**

మహా కుంభమేళాకు వెళ్లలేనివారు మౌని అమావాస్య రోజున పవిత్ర నదులలో పుణ్యస్నానం చేస్తే మహా కుంభమేళాలో స్నానం చేసినంత పుణ్యఫలం దక్కుతుంది. మూడుసార్లు లేదా ఐదు సార్లు పవిత్ర నదిలో మునక వేసి శ్రీహరికి, లక్ష్మీదేవికి, గంగామాతకు పూజలు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెబుతున్నారు. మౌని అమావాస్య రోజున మహాకుంభమేళాకు వెళ్లలేని భక్తులు మౌన ఉపవాస దీక్షను చేస్తే కూడా శుభాలు చేకూరుతాయని, దీనివల్ల శుభం కలుగుతుందని చెబుతున్నారు.

**మౌని అమావాస్య నాడు ఇలా చెయ్యండి**

మౌని అమావాస్య రోజున సాయంత్రం ఇంట్లో తులసి మొక్క దగ్గర నెయ్యి దీపం వెలిగించి భక్తితో పూజలు చేస్తే కూడా ఫలితం బాగుంటుందని చెబుతున్నారు. మౌని అమావాస్య రోజున తెల్లవారుజామున భక్తులు మనకు కనిపించే ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడికి అర్ఘ్యాన్ని సమర్పించి పూజలు చేస్తే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇలా చేస్తే పవిత్ర స్నానం చేసినంత పుణ్యఫలం ఎవరైతే మౌని అమావాస్య రోజున ఓం పితృదేవతాయై నమః అనే మంత్రాన్ని 11 సార్లు జపిస్తారో వారి పూర్వీకులకు ఆత్మశాంతి కలుగుతుందని, దీనివలన మహా కుంభమేళాలో పవిత్ర స్నానం చేసినంత పుణ్యఫలం లభిస్తుందని చెబుతున్నారు. జనవరి 29వ తేదీన మౌని అమావాస్య కుంభమేళా జరుగుతున్న వేళలో ఈ అమావాస్య చాలా ప్రత్యేకమైనదిగా పురాణాలు చెబుతున్నాయి.



**పవిత్రమైన మౌని అమావాస్యతో పుణ్య ఫలాలు**

మౌని అంటే సంస్కృతంలో మౌనంగా ఉండడం అని అర్థం. మౌని అమావాస్య నాడు మౌన దీక్షను పాటించి ఎవరితోనూ మాట్లాడకుండా ఎవరైతే ఉపవాస దీక్షను ఆచరిస్తారో వారికి పుణ్య ఫలాలు లభిస్తాయి అని చెబుతారు. మహాశివరాత్రి ముందు వచ్చే అమావాస్య కావడంతో దీనిని సాధువులు, యోగ సాధకులు అందరూ పవిత్రంగా పరిగణిస్తారు.

## రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు



**విశ్వంభర, కల్వకుర్తి:** జడ్చర్ల నియోజకవర్గం లోని ఊర్కొండపేట లో మంగళవారం తెల్లవారు జామున శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి రథోత్సవ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుర్తి నియోజకవర్గ బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్. నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రసిద్ధమైన దేవస్థానాలలో ఊర్కొండ ఆంజనేయ స్వామి దేవాలయం చాలా ప్రసిద్ధమైనదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఈ దేవాలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి దేవాలయ అభివృద్ధి లో పాలుపంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం,మాజీ మార్కెట్ ఛైర్మన్ విజయ్ గౌడ్, మాజీ ఎంపీపీ గోవర్ధన్, మాజీ సర్పంచ్ లు మ్యాకల శ్రీనివాసులు, బోస్ వెంకటయ్య, లింగం గౌడ్, నాయకులు శరత్ చంద్ర శర్మ, బన్నె శ్రీధర్, విష్ణువర్ధన్ యాదవ్, టి.వి గౌడ్, నరేందర్ గౌడ్, మహేష్ నేత, కృష్ణ యాదవ్, రాజు, సాయి బాబా వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జైళ్ల శాఖ రిట్రీట్ 2024 ప్రారంభోత్సవం



**విశ్వంభర, మలక్ పేట్:** తెలంగాణ జైళ్ల శాఖ రిట్రీట్ 2024 కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక, ప్రణాళిక శాఖ కె. రామకృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జైళ్ల పరిపాలన, సంస్కరణలను మెరుగుపరిచే లక్ష్యంతో సాంకేతికత, మాదకద్రవ్యాల వ్యసనం, రద్దీ, భద్రత, సంక్షేమం, మహిళల జైళ్లు వంటి కీలక అంశాలపై ఈ తిరోగమనం దృష్టి సారించింది. ఈ కార్యక్రమంలో ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా, ఐపీఎస్, జైళ్ల ఐజీ వై. రాజేష్, ఎన్. మురళీ బాబు, జైళ్ల ఐజీ డాక్టర్ డి.శ్రీనివాస్, జైళ్ల శాఖ డీఐజీ (హైదరాబాద్ రేంజ్) ఎం. సంపత్, డీఐజీ ఆఫ్ జైళ్ల (వరంగల్ రేంజ్) ఇతర సీనియర్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనానికి భూమి కేటాయింపు



**విశ్వంభర, షాద్ నగర్:** చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల భూమి కేటాయింపు ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారు. ఫరూఖ్ నగర్ మండలంలోని లింగారెడ్డి గూడ గ్రామంలోని అలీ సాబ్ గూడ శివారు లోని సర్వే నంబర్ 21 లో పాలిటెక్నిక్ కళాశాలకు 3-00 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ - 109 ద్వారా కేటాయించింది. అట్టి జీఓ ఆధారంగా జనవరి 27, 2025 న ప్రొసీడింగ్ నెం.ఎల్ సి ఐ/255/2024 ద్వారా జిల్లా కలెక్టర్ భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తూ ఉన్నత విద్య శాఖ (హైయర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్)కి భూమిని కేటాయింపు పూర్తి చేయలని స్థానిక ఫరూఖ్ నగర్ తహసీల్దార్ కు ఆదేశాలు జారీ చేశారు. పై భూమి కేటాయింపు విషయం లో సేరి కల్చర్ డిపార్ట్మెంట్ నుంచి భూమి బదలాయింపు ఉత్తర్వులు పొందే విషయంలో స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, కీలకంగా వ్యవహరించారు. శాఖల అధిపతులతో మాట్లాడి భూమి కేటాయింపుకై మార్గం సుగమం చేశారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వర్, శాఖధిపతులు విజయ్ కుమార్, లక్ష్మయ్య ప్రసాద్, ఏవో శీతల్ తదితర సిబ్బంది, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి తదితరులు షాద్ నగర్ ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు.

## ఏల సుందర్‌ను సన్మానించిన యువకులు



**విశ్వంభర, దేవరుప్పుల:** దేవరుప్పుల మండల కేంద్రం నుండి పాలకుర్తి కి వెళ్ళే ప్రధాన రహదారిలో దేవరుప్పుల బ్రిడ్జి ప్రమాద కరంగి మారింది. మూల మలుపు లో గత కొద్ది రోజులుగా ప్రమాదాలు జరిగి బ్రిడ్జి పై నుండి కింద పడి కొందరు ప్రమాదానికి గురి అయిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఏల సుందర్ దృష్టికి రాగ తన సొంత ఖర్చులతో బ్రిడిపై గ్రిల్స్ ను ఏర్పాటు చేయించారు. ప్రజలను ప్రమాదాల భారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టిన ఏల సుందర్ ను గ్రామస్తులు, యువకులు శాలువాతో సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగు సుదర్శన్, జోగు మధు, ఉప్పుల సామ్రాట్, జోగు ప్రదీప్, జోగు కిరణ్, ఉప్పుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో కంటెంట్ రైటింగ్ వర్క్ షాప్ ప్రారంభం

- నాలుగు రోజుల పాటు కొనసాగనున్న కార్యశాల
- నైపుణ్యాలను పెంపొందించనున్న పరిశ్రమ నిపుణులు



**విశ్వంభర, సంగారెడ్డి:** కంటెంట్ సృష్టి, కమ్యూనికేషన్ యొక్క వేగంగా అభివృద్ధి చెందుతున్న వాతావరణానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడం లక్ష్యంగా నాలుగు రోజుల 'కంటెంట్ రైటింగ్ వర్క్ షాప్'ను గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) మంగళవారం ప్రారంభించారు. మీడియా స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం, విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధిలో జీవితకాల పెట్టుబడిగా రూపొందించారు. ఈ వర్క్ షాప్ ను జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ లాంఛనంగా ప్రారంభించి, సాంకేతికత పరిజ్ఞానం యొక్క మార్పుకు అనుగుణంగా, ముఖ్యంగా కంటెంట్ రైటింగ్ వృత్తిపై కృత్రిమ మేధస్సు ప్రభావాన్ని స్వీకరించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యశాల ప్రాంగణ నియామకాలకు సిద్ధం కావడం గురించి మాత్రమే కాదని, కాలానుగుణంగా అభివృద్ధి చెందడం గురించన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాణించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కెరీర్ గైడెన్స్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మమతా రెడ్డి మాట్లాడుతూ, కొత్త సాంకేతికతలను స్వీకరించడం యొక్క ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ కార్యశాల నిరంతర అభ్యాస సంస్కృతిని పెంపొందించడంలో నిర్వాహకుల దూరదృష్టికి నిదర్శనంగా ఆమె అభివర్ణించారు. మొదటి సెషన్ రిసోర్స్ పర్సన్ గా జియో మారియా పాల్గొని, కంటెంట్ రైటింగ్ ప్రాథమిక అంశాలు, కంటెంట్ రకాల, ఎస్ఈవో టెక్నిక్ వంటి కీలక అంశాలను విద్యార్థులకు పరిచయం చేశారు. మరో మూడు రోజులు కొనసాగే ఈ కార్యక్రమంలో పరిశ్రమ నిపుణులు పాల్గొని ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మండల్, మీడియా స్టడీస్ విభాగాధిపతి ఎస్ ఆర్ సంజీవ్ కుమార్ తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కంటెంట్ రైటింగ్ పరిశ్రమ యొక్క సవాళ్లు, అవకాశాలకు సిద్ధం చేయడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో దాదాపు 40 మంది యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొంటున్నారు.

# పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎం సహాయ నిధి

**లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎంపీ కడియం కావ్య**



**విశ్వంభర, వరంగల్:** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హన్మకొండ కనకదుర్గ కాలనిలోని ఎంపీ నివాసంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 5గురు ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 2లక్షల 55వేల రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. అనంతరం ఎంపీ కావ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వరంగల్ ప్రజల ఎన్నో ఏండ్ల కలను గౌరవ ముఖ్యమంత్రి రెడ్డి నెరవేర్చారని అన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పేరున్న వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా అభివృద్ధికి 6 వేల కోట్లు కేటాయించారని అన్నారు. వరంగల్ సిటీ మాస్టర్ ప్లాన్, భూగర్భ డ్రైనేజీ, మామునూరు ఎయిర్ పోర్టు, కాజీపేట జంక్షన్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పనులు వెగంగా జరుగుతున్నాయని తెలిపారు. నిరంకుశ పాలన నుండి కాంగ్రెస్ ప్రజా పాలనలోకి అడుగులు పెట్టాం అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన పాలన ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అందజేస్తుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్ మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విత్తనాలను అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు

**తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫీడ్ ఛైర్మన్ గంగారెడ్డి**



**విశ్వంభర, కడ్తాల్:** తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫీడ్ ఛైర్మన్ గంగారెడ్డిని కడ్తాల్ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్ గుప్తా కడ్తాల లో మర్యాదపూర్వకంగా మంగళవారం కలుసుకున్నారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు విత్తనాలను ఇబ్బంది కలగకుండా ముందస్తుగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రైతులు మధ్య దళారులను, ఆసాములను రైతులు ఆశ్రయించి మోసపోకుండా కట్టడి చేయాలని కోరితే గంగారెడ్డి తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్లాక్ మార్కెట్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరినట్లు తెలిపారు. గంగారెడ్డిని సన్మానించిన వారిలో మాజీ ఎంపీటీసీ రమేష్, బీఆర్ఎస్ నాయకులు రాములు గౌడ్, సాయిలు గౌడ్ తదితరులు ఉన్నారు.

# డా. పెండెం కృష్ణ కుమార్ సేవలు వెలకట్టలేనివి

**- డీఈవో కె. అశోక్**



**విశ్వంభర, సూర్యాపేట:** గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, 400 విభిన్న పాత్రదారులు, రచయిత, సమాజ సేవకులు, పర్యావరణ వేత్త డా. పెండెం కృష్ణ కుమార్ సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ నందు గల జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయములో జిల్లా విద్యాశాఖాధికారి కె. అశోక్ కు జాతీయ నాయకుల, స్వాతంత్ర సమరయోధుల, శాస్త్రవేత్తల చిత్రపటాలను, వాటర్ క్యాన్, గోడ గడియారం, అందరికి 15 కేజీల బరువు మోయగల రీయుజబుల్, వాషబుల్ క్లాత్ సంచులు అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ 400 విభిన్న పాత్రలలో నటించి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ నాలుగు సార్లు పొందిన పర్యావరణవేత్త ఎన్నో పాఠశాలలందు ఎన్నో సేవలు అందించిన గొప్ప వ్యక్తి డా. పెండెం కృష్ణ కుమార్ అని అన్నారు. విద్యా వైద్యం పర్యావరణం, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై అభివృద్ధికి తన స్వంత నిధులతో సేవలు చేస్తున్న సేవా దృక్పథుడని, తెలుగు వారి కీర్తిని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిన కృష్ణ కుమార్ ప్రస్తుత మన భారత దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చే ప్రశంసలు పొందిన వ్యక్తి అని కొనియాడారు.

## ఎస్పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



**విశ్వంభర, మహబూబాబాద్:** రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బైక్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా పోలీసు యంత్రాంగం పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన హామీలు ఎన్ని?

- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు
- మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ యాదయ్య



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మార్కెటింగ్ కమిటీ వైస్ ఛైర్మన్ సి హెచ్ యాదయ్య, అమీర్పేట్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో పద్మావతి ఫంక్షన్ హాల్లో నాయకుల తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ గత పది సంవత్సరలుగా సబితా ఇంద్రారెడ్డి మీరు ఎన్ని రేషన్ కార్డులు, ఎన్ని డబల్ బెడు రూమ్ లు, పేద ప్రజలకు ఎన్ని సంక్షేమా పథకాలు ఇచ్చారు. దళితుల కు మూడు ఎకరాలు, బీసీ బంధు, మైనారిటి బంద్, అర్హులందరికీ దళిత బందు ఇచ్చారా? ఇంకా లక్ష రూపాయలు రుణ మాఫీ అన్నారు.. ఎంత మందికి అయిందన్నారు. అరకొర పథకాలు ఏమైనా ఉంటే మీ లీడర్లకు ఇచ్చారు. మీ బీఆర్ఎస్ పార్టీ పాలనా మొత్తం అవినీతి మాయం, మీ లీడర్లు అడ్డగోలు సంపాదన మీదే దృష్టి పెట్టారు. ఈ నాయకులా కాంగ్రెస్ పార్టీ ని విమర్శించేది. ఒక్కసారి మీరు ఆత్మ విమర్శ చేసుకోవాలని గుర్తు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ అర్హులైన పేదలకు తప్పకుండ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మండల్ సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య, కే జే ప్రసాద్, గ్రామ ఇంద్రమ్మ కమిటీ అధ్యక్షులు ఆవుల రఘుపతి, గాజుల ఆనంద్, మహేశ్వరం అసెంబ్లీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర చంద్రమోహన్, జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఛైర్మన్ గోల్కొండ శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు హైతబాద్ రాజేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గళ్ళ శ్రీకాంత్, నాయకులు సిహెచ్ రవి, కమ్మరి యాదయ్య, సిహెచ్ బాలు, ఎర్ర శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి అనుచిత వ్యాఖ్యలు

**బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించిన ఎర్ర చంద్రమోహన్**



**విశ్వంభర, మహేశ్వరం:** కేంద్రమంత్రి బండి సంజయ్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని మహేశ్వరం అసెంబ్లీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర చంద్రమోహన్ అన్నారు. గద్దర్ చేసిన ప్రజా పోరాటాలు తెలియక మాట్లాడుతున్నారని, 70 సంవత్సరాలుగా ప్రజల కోసం గొంతు పాడింది, కాలు ఆడింది. రజాకార్ల పాలన మీద యుద్ధం చేసింది. పాటలు, సాహిత్యం ద్వారా ప్రజల్ని చైతన్యపరిచిన ఉద్యమ దీపిక దొరల పాలనకు దడ పుట్టించిన వీరుడు 1969 లో పుట్టిన మొదటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా అని పాటతో ఉద్యమానికి ఊపిరి పోశారు. గద్దర్ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల ప్రాణాలు కోల్పోతుంటే చూసి చలించి ముందుండి ఉద్యమాన్ని నడిపిన యుద్ధ నౌక, పల్లె, పట్టణ ప్రజలను చైతన్యం చేస్తూ చివరి వరకు ప్రజల కోసమే తన జీవితాన్ని త్యాగం చేసిన ఒక విప్లవాగ్ని గద్దర్. ఆయన గురించి కనీస అవగాహనా లేని బండి సంజయ్ ఇకనైనా గద్దర్ పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహారించుకోవాలని ఎర్ర చంద్రమోహన్ డిమాండ్ చేశారు.

## జూలకంటి లక్ష్మమ్మ మృతికి ప్రముఖుల నివాళి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బి.తుర్కపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు జూలకంటి వెంకటేశ్వర రెడ్డి మాతృమూర్తి జూలకంటి లక్ష్మమ్మ మృతి చెందడంతో వారి మృతదేహానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు దైద రవీందర్ పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి, బి.తుర్కపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు పెసర జాన్ రెడ్డి, బి.తుర్కపల్లి మాజీ ఎంపీటీసీ చల్ల వెంకటరెడ్డి, చల్ల పిచ్చిరెడ్డి, బి.తుర్కపల్లి మాజీ అధ్యక్షుడు చిట్టి మాల యాదయ్య, అమ్మనబోలు మాజీ ఎంపీటీసీ కొంపెల్లి సైదులు, సూరారం గ్రామ శాఖ అధ్యక్షుడు సంకబుడ్డి సైదులు, యూత్ కాంగ్రెస్ నాయకులు దోమల గంగరాజు, సంకబుడ్డి మల్లేష్, బెంకట్టి లింగస్వామి, శ్రీనివాస్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వేముల



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని రామన్నపేట పట్టణ పద్మశాలి సంఘం 2025 నూతన క్యాలెండర్ ను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం ఆవిష్కరించారు. సంఘం సభ్యులు సంఘటితమై ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు సాగాలని సంఘం స్వప్రయోజనాలను కాపాడుకుంటూ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి, ప్రధాన కార్యదర్శి కైరంకొండ నాగభూషణ్, కొండా లక్ష్మణ్ బాపూజీ ట్రస్ట్ ఛైర్మన్ సంగిశెట్టి సుదర్శన్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, టెర్రి కాటన్ సొసైటీ అధ్యక్షులు జెల్ల వెంకటేష్, వనం విట్టల్, సంఘం సహాయ కార్యదర్శి పెండెం లక్ష్మీనారాయణ, నాయకులు కైరంకొండ నందు, గంజి చంద్రయ్య, బూరుగు వెంకటేష్, యువజన నాయకులు రాపోలు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## ఉచిత పుర్రు నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోండి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలో సోమవారం ప్రభుత్వం అందించే ఉచిత పుర్రు నివారణ టికాలను శ్రీ మల్లికార్జున గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షురాలు గోగు పద్మ వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు మాట్లాడుతూ గొర్రెల, మేకల పెంపకందారులకు పుర్రు నివారణ టీకాలను ప్రభుత్వం ఉచితంగా వేస్తున్నందున గ్రామంలో ఉన్న పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ భాను చందర్, పండుగ స్వామి, ఎర్రబోయిన కిష్టయ్య, ఆగు ఎల్లయ్య, ఆగు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ క్షేమమే ముద్దు.. మద్యంతో వాహన ప్రయాణం వద్దు

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**విశ్వంభర, షాద్ నగర్:** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో జరిగిన హెల్మెట్ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ట్రాన్స్పోర్ట్ కమిషనర్ సదానంద్ గౌడ్, పట్టణ ఉప రవాణా అధికారి వాసు యాదవ్ తో కలిసి హెల్మెట్ ర్యాలిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మితిమీరిన వేగం వల్ల యువతలో ప్రాణ నష్టం కలుగుతుందని, పరిమిత వేగమే ప్రాణానికి హద్దు అని తెలుపుతూ, తల్లిదండ్రులు చిన్నతనం నుంచే తమ పిల్లలను అల్లారు ముద్దుగా పెంచుతూ ఎన్నో డబ్బులు ఖర్చు చేసి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ప్రయత్నం చేస్తుంటే, కొంతమంది యువకులు చెడు వ్యసనాల వలన, చెడు దారుల్లో ప్రయాణిస్తూ, మద్యం సేవించి మితిమీరిన వేగంతో రోడ్లపై ప్రయాణిస్తూ తమ ప్రాణాల పైకి తెచ్చుకోవడమే కాకుండా, ఎదుటివారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే చిన్నతనం నుంచి రోడ్డు భద్రత నియమాలను పాఠ్యాంశంలో చేర్చి వారికి రోడ్డు భద్రత నియమాలు ఒంటపట్టే విధంగా నేర్పించాలని అన్నారు. మన ప్రాణాలు మనకు ముఖ్యం కావున మన కుటుంబ సంక్షేమ లక్ష్యంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ర్యాలీ సందర్భంగా ట్రాన్స్పోర్ట్ కమిషనర్ సదానంద గౌడ్ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాల సందర్భంగా ప్రజలందరికీ రోడ్డు భద్రత పట్ల అవగాహన కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఉప రవాణా శాఖ అధికారి వాసు మాట్లాడుతూ రోడ్డు భద్రత, మరియు రోడ్డుపై జరిగే ప్రమాదాలను నివారించడానికి హెల్మెట్లను కచ్చితంగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వాహనదారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వంభర V3 NEWS

## ప్రత్యేక అధికారిగా జాయింట్ కలెక్టర్



**విశ్వంభర, మహబూబాబాద్:** మున్సిపల్ పాలక వర్గం సమయం పూర్తి అయిపోయినందున ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వచ్చినందున మహబూబాబాద్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో నియమించడం జరిగింది. మంగళవారం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ /మున్సిపల్ ప్రత్యేక అధికారి లెనిన్ వత్సల్ టొప్పోను మున్సిపల్ కమిషనర్ రవీందర్ యాదవ్, జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్, టీజీవో నాయకులు తదితరులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## దావుస్ పర్యటన దిగ్విజయంగా ముగించుకున్న ఐటీ మంత్రి

**మర్యాదపూర్వకంగా కలిసిన ఆది శ్రీనివాస్, కుందారపు జలంధర్**



**విశ్వంభర, మేడిపల్లి:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం మాజీ జడ్పీటీసీ కుందారపు జలంధర్ వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దావుస్ పర్యటనను దిగ్విజయంగా ముగించుకొని వచ్చిన సందర్భంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసిన ప్రభుత్వ వి ప్ ఆది శ్రీనివాస్. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించడంలో మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యభూమికను పోషించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలియజేశారు. వారితో పాటు ఉమ్మడి మేడిపల్లి మండల మాజీ జడ్పీటీసీ కుందారపు జలంధర్ పాల్గొన్నారు.

## పత్తాలేని జగ్గాసాగం పంచాయితీ కార్యదర్శి

**విశ్వంభర, మెట్ పల్లి:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ కుమార్ ఉదయం సుమారు 10 గంటలైనా విధులకు హాజరు కాకపోవడం వల్ల ఖాళీ కుర్చీ దర్శనం ఇవ్వడంతో ప్రజలు గ్రామపంచాయతీలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు సరైన సమయంలో విధులకు హాజరుకాక వారి ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పథకాలైన ఆహారభద్రత కార్డు, ఇందిరమ్మ ఇల్లు, గృహ జ్యోతి తదితర పథకాల అమలులో అమ్యామ్యాలకు ఆశపడి కార్యదర్శులు వారికి నచ్చిన వ్యక్తుల పేర్లు ప్రభుత్వానికి సిఫారసు చేశారని గ్రామ సభలలో ప్రజలు వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి విధులను దుర్వినియోగం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

**– కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



**విశ్వంభర, మహబూబాబాద్:** మంగళవారం కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా పరిషత్ నేరడ చిన్న గూడూరు, కేజీబీవీ నేరడ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఉత్తమమైన ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులని ఉత్తేజపరిచారు. విద్యార్థులు కేవలం పాస్ వరకే కాకుండా ఉన్నతమైనటువంటి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాలు వంటగది, ఆహార పదార్థాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించినారు. పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో తీసుకోవలసిన కోర్సుల గురించి కూడా వారికి క్యారియర్ గైడెన్స్ ని అందజేయాలని, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను కోరారు. ప్రభుత్వం వసతి గృహాల్లో అమలు చేస్తున్న మెనో చాట్ ప్రకారం ఖచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, మంచి పోషకాహారం అందించాలని, నేరడ గ్రామం కురవి మండలం, చిన్నగూడురు మండల కేంద్రాల్లోని కస్తూరిబా గాంధీ బాలిక వసతి గృహం పరిసరాలను, విద్యార్థినీలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం చిన్నగుడురు మండల కేంద్ర హైస్కూల్లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కచ్చితంగా మెనూ పాటించాలని, పదవ తరగతి విద్యార్థుల రోజువారి గ్రాండ్ టెస్టుల ఉత్తీర్ణతను పరిశీలించారు. ఉత్తీర్ణత శాతం ఇంకా పెంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట పగిడిపల్లి లలిత, స్పెషల్ ఆఫీసర్ సరస్వతి, ఉపాధ్యాయులు, వసతి గృహ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

# బీటీ రోడ్లకు ఎంఆర్ఆర్ నిధుల నుండి రూ.15 కోట్లు

- కలిసి రండి ఆమనగల్లును అభివృద్ధి చేద్దాం
- కసిరెడ్డి నారాయణరెడ్డి



**విశ్వంభర, ఆమనగల్లు:** బీజేపీ నాయకులు సహకరిస్తే ఆమనగల్లు పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి నీ ఉద్దేశించి కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం కళ్యాణి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం అభివృద్ధి చెందాలంటే కలిసి రావాలని రాష్ట్ర నాయకులను, దేశ నాయకులను కలిసి నియోజకవర్గానికి నిధులు తీసుకొద్దామని అన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఎంఆర్ఆర్ నిధుల నుండి 9 రోడ్లకు గాను 15 కోట్ల 59 లక్షల 40 వేల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు కాబట్టే నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తానని తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ రాజ్యం లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం పాటుపడిందని ఇచ్చిన హామీలలో భాగంగా గణతంత్ర దినోత్సవం నుంచి రైతుల ఖాతాలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన డబ్బులను జమ చేస్తామని ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని, గత ప్రభుత్వం చేసిన అప్పుకు సంబంధించి వడ్డీ చెల్లిస్తూనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోపక్క రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు.

# జ్యోతిరావు పూలే, పండుగ సాయన్న విగ్రహావిష్కరణ

**తాలూకా యువత అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ముదిరాజ్**



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ తాలూకా లోని ఎలికట్ట గ్రామంలో ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మహనీయులైన జ్యోతిరావు పూలే ముదిరాజ్, పాలమూరు ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్, విగ్రహాలను ఏర్పాటు చేయబోతున్నారు. ఈ కార్యక్రమానికి తాలూకా ముదిరాజ్ సంఘం కార్యవర్గాన్ని పిలవడం జరిగింది. అధ్యక్షులు మంగ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మహనీయులను ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామంలో నియోజకవర్గంలో ప్రతి జిల్లాలో రాష్ట్రాలలో ఒక అఖండ జ్యోతిని వెలిగించినట్లు మహనీయుల విగ్రహాలు గ్రామాల్లో వారిని స్ఫూర్తిగా తీసుకొని ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తున్న ఎలుకట్ట గ్రామ ప్రజలను అభినందించాడు. వీరితోపాటు గ్రామ పెద్దలు మరియు పూజారి మల్లేష్, బైరామోని మల్లేష్, వీరితోపాటు తాలూకా యువత అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులు ఐక్యతతో ముందుకు వెళ్లాలని పట్టుదల ఉంటే కానిది లేదని ఆత్మవిశ్వాస%స్త్ర%తో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని అందుకు మహనీయులైన జ్యోతిరావు పూలే, పండుగ సాయన్న బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడిన మహనీయులు కావున ప్రతి ఒక్కరూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఈ మహనీయుల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని అన్నారు. తాలూకా ముదిరాజ్ సంఘం తరఫున కచ్చితంగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో 2025 నూతన క్యాలెండర్ మంగళవారం ఎలికట్ట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో యువకుల ఆదేశానుసారం పెద్దలు గౌరవ సభ్యులు అంద పైలయ్య, జట్టి కృష్ణయ్య, చంద్రయ్య, అశోక్, శివ కుమార్, తాలూకా కార్యవర్గం, ఎలికట్ట గ్రామ సంఘం పెద్దలు, పాల్గొన్నారు.

# పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

**పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ**



**విశ్వంభర, మహబూబాబాద్:** ఫిబ్రవరి 4,5 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగే పి.డీ.యస్.యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని పి.డీ.యస్.యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనీ కోర్టు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర పి.డీ.యస్.యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ వాల్ పోస్టర్లు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పెద్దింటి రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చేజికించుకునేందుకు ప్రతిపక్షంలో ఉండి విద్యార్థుల తరపున గొంతు విప్పిన రేవంత్ రెడ్డి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ బలోపేతానికి ఏమాత్రం కృషి చేయడం లేదని అన్నారు. రాష్ట్రంలో మేధావులు ప్రజాస్వామ్యవాదులు విద్యార్థులను గుర్తించాలని అన్నారు. రాష్ట్రంలో గురుకులాలలో వరుసగా ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుంటే అత్యున్నత న్యాయస్థానమే మందలించే స్థితికి మన విద్యా వ్యవస్థ దిగజారిపోయిన స్థితిని ముఖ్యమంత్రి గుర్తించాలని ఆయన అన్నారు.సంవత్సరాల తరబడి స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ 7,500 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన ఒక సంవత్సరం గడిచిన నేటికీ చెల్లించకపోవడం వల్ల పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు పెను భారంగా మారిందని వారు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లను నియమించలేని దుస్థితి నెలకొని ఉందని అన్నారు.ఖాళీగా ఉన్న ప్రొఫెసర్,టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టు భర్తీ చేయడం వదిలేశారని విశ్వవిద్యాలయాలలో కనీసం సౌకర్యాలు లేకుండా నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం ఈనెల 4,5 తేదీలలో భద్రాచలంలో జరిగే పి.డీ.యస్.యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్లో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని విద్యార్థి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళుతుందని వారు తెలిపారు. యూనివర్సిటీల వీసీల నియామకం కూడా కేంద్ర ప్రభుత్వమే చేపడుతూ ఉండటం రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని అందుకు ఐక్య పోరాటాలు అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పి.డీ.యస్.యూ జిల్లా కార్యదర్శి గౌతం, జిల్లా ఉపాధ్యక్షులు నందిశ్వర్, జిల్లా నాయకులు సుహిత,తరుణ్, శ్యామ్ , ప్రవీణ్ కుమార్, రవీందర్, సాయి విష్ణు, వివేక్, శివ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే తక్షణమే చెక్ డ్యాం లో నీళ్లు నింపాలి

– బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ గౌడ్



విశ్వంభర, దేవరుప్పుల: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కేంద్రంలోని భార్గవి గార్డెన్ లో దేవరుప్పుల మండలం బీజేపీ పార్టీ నూతన అధ్యక్షుడు పెద్దగాని రాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్రే శ్రీనివాస్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుబ్బా రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని ఉన్నటువంటి చెక్ డ్యామ్ లలో నీళ్లు అడుగంటి పోయాయిని, దేవరుప్పుల గొల్లపల్లి గ్రామాలలోని చెక్ డ్యామ్ వాగు పరిహారపు చుట్టుపక్కల రైతులు రోజు రోజుకు పెరుగుతున్న ఎండలకు బోర్లు తగ్గు ముఖం పట్టాయి అని, రైతులు వేసిన వరి పంట చేతికి వస్తుందో లేదో అని ఆవేదన చెబుతున్నారని రైతులకు సాగునీరు అందించు విషయంలో తక్షణమే పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్పందించి అన్ని చెక్ డ్యామ్ లలో నీళ్ల సకాలంలో నింపి రైతులను ఆదుకోవాలని అన్నారు. అలాగే దేవరుప్పుల బస్టాండ్ ను ఆక్రమించుకొని పట్టా చేసుకొవాలని చూస్తున్నారు కానీ అఖిలపక్ష నాయకులు దాన్ని పరిరక్షించాలని, దాని స్థలంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని గత కొద్దిరోజుల క్రితం స్థానిక ఎంపీడీవోకి ఫిర్యాదు చేయడం జరిగింది. దాని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానానికి గుర్తింపుగా ప్రశంసా పత్రం

**అవయవ దానం చేసిన ఫరూక్ నగర్ వెంకటేష్ ముదిరాజ్**



**విశ్వంభర, షాద్ నగర్:** అవయవ దానం అనేది అందరి వల్ల సాధ్యమయ్యే పని కాదని, అది కొంతమంది మంచి మనుషుల వల్లనే సాధ్యపడుతుందని, అవయవ దానం వల్ల మరి కొంతమందికి జీవితాన్ని ప్రసాదించి అవయవ దానం చేసిన వ్యక్తి మరొక పునర్జన్మ పొందిన వ్యక్తిగా ఉంటాడని ప్రభుత్వ సంస్థ జీవన్ దాన్ అభిప్రాయపడింది. ఇటీవల కాలంలో ఫరూక్ నగర్ కు చెందిన భైరమోని వెంకటేష్ ముదిరాజ్ మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులు మృతి చెందిన వెంకటేష్ యొక్క అవయవాలను ప్రభుత్వ సంస్థ జీవన్ దాన్ కు దానం చేశారు. ఈ సందర్భంగా జీవన్ దాన్ సభ్యులు ఫరూక్ నగర్ కు విచ్చేసి అవయవ దానం చేసిన భైరవుని వెంకటేష్ ముదిరాజ్ భార్య పార్వతమ్మను, కుమారులైన బైరమోని సతీష్, హరీష్, రాజేష్ లను సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ దాన్ సభ్యులు మాట్లాడుతూ అవయవ దానం అనునది ప్రపంచంలో అతి గొప్ప దానమని, అవయవ దానం అవసరం ఉన్నవారు. అవయవ దానం చేయాలనుకున్నవారు ప్రభుత్వ సంస్థయైన జీవన్ దాన్ లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఇంకా వారు మాట్లాడుతూ ఆహారపు అలవాట్ల వలన, మేనరికపు వివాహాల వలన, సరియైన నీరు తాగకపోవడం వలన అవయవాలు పాడవుతాయని, బ్రెయిన్ డెడ్ వలన మనిషి చనిపోయినట్లేనని, అలాంటి బ్రెయిన్ డెడ్ చెందిన వ్యక్తుల అవయవాలను దానం చేయడం వలన మరో జన్మ పొందే అవకాశం లభిస్తుందని, జీవన్ దాన్ అనే సంస్థ ప్రభుత్వ సంస్థ అని, అవయవ దానం చేయడం అనేది, అవయవాలను అమ్ముకున్నట్లు కాదని, జీవన్ దాన్ అనునది ఒక్క పైసా ఆశించకుండా అవయవాలను దానం చేసిన వారికి, అవయవాలు అవసరం ఉన్నవారికి అందించడం నిష్పక్షపాతంగా జరుగుతుందని ఒక్క రూపాయి చెల్లింపు కూడా లేకుండా పూర్తిగా ఉచితంగా జరిగే ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు నాయకులు, ప్రభుత్వ సంస్థ జీవన్ దాన్ డాక్టర్లు, సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రులకు చెర్వుగట్టు జాతర ఆహ్వానం



**విశ్వంభర, నార్కెట్ పల్లి:** ఫిబ్రవరి 02 నుంచి జరిగే నార్కెట్‌పల్లి మండల చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ను మర్యాదపూర్వకంగా కలిసి, దేవాదాయశాఖ తరుపున నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు, పోతుల పాటి రామలింగేశ్వర శర్మ ఆహ్వానపత్రికను అందించారు. కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు వడ్డే భూపాల్ రెడ్డి, నేతగాని కృష్ణ తదితరులు ఉన్నారు.

## ఉప్పల ట్రస్ట్ ద్వారా సిమెంటు బస్తాల అందజేత



**విశ్వంభర, ఆమనగల్లు:** ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పూర్తి ఇండ్ల నిర్మాణం, అసంపూర్తి ఇండ్ల నిర్మాణం లో భాగంగా మంగళవారం ఆమనగల్ పట్టణం గుర్రం గుట్ట కాలనీకి చెందిన నిరుపేద కుటుంబమైన వంకేశ్వరం సత్యనారాయణ తండ్రి తిమ్మయ్య ఇంటి ఫినిషింగ్ కోసం సిమెంట్ ను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ మాజీ ఛైర్మన్ మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ జడ్పీటీసీ వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా సిమెంట్ బస్తాలను అందజేశారు. వంకేశ్వరం సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాగిల్ల జగన్ బురుగుపల్లి మహేష్ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ పరివర్తన్ - యువతేజం కబడ్డీ పోటీలు



**విశ్వంభర, నార్కెట్ పల్లి:** నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్ – యువతేజం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ యువత యొక్క క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. ఆసక్తి గల గ్రామీణ యువకులు తమ యొక్క టీం సభ్యుల పేర్ల జాబితాను సంబంధిత పోలీస్ స్టేషన్ లో ఫిబ్రవరి 02, 2025, లోపు నమోదు చేసుకోవచ్చు, ఫిబ్రవరి 03, 2025 నుడి ఫిబ్రవరి 09,2025 వరకు మండల స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహణ, గెలుపొందిన అభ్యర్థులకు మొదటి బహుమతిగా 5000 రూపాయలు, ద్వితీయ బహుమతి గా 2500 రూపాయలు, తృతీయ బహుమతిగా 1500 రూపాయలు. మండల స్థాయిలో గెలుపొందిన అభ్యర్థులకు ఫిబ్రవరి 10, 2025 నుండి ఫిబ్రవరి 16, 2025 వరకు డివిజన్, జిల్లా స్థాయి పోటీ, డివిజన్ స్థాయిలో గెలుపొందిన అభ్యర్థులకు ప్రథమ బహుమతిగా 10,000 రూపాయలు, ద్వితీయ బహుమతి గా 5,000 రూపాయలు, తృతీయ బహుమతిగా 2,500 రూపాయలు. డివిజన్ స్థాయిలో గెలుపొందిన అభ్యర్థులకు జిల్లా స్థాయిలు పోటీలు. జిల్లా స్థాయిలో గెలుపొందిన అభ్యర్థులకు మొదటి బహుమతిగా గా 25,000 రూపాయలు, ద్వితీయ బహుమతి 15,000 రూపాయలు, తృతీయ బహుమతిగా 10,000 రూపాయలు అందజేస్తారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



**విశ్వంభర, సికింద్రాబాద్:** భారతీయ పండుగలలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అని ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రథమ మహిళ లయన్ డి.వి.ఎస్. లక్ష్మి అన్నారు. ప్రకృతి సౌందర్యం, సాగు పంటల విజయోత్సాహమే ఈ పండుగని తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లయన్స్ భవన్ లో ముగ్గులు పోటీలు, భోగి పళ్ళు పోయడం, హరి దాసులు, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా పిల్లల్లో భారతీయ సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడం, పెద్దల సమక్షంలో ఆనందభరితమైన సమయాన్ని కల్పించడం ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన లయన్ దీపా రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి అంటే కేవలం పంట పండుగ మాత్రమే కాదు కుటుంబ విలువలను కలసి జరుపుకునే పండుగన్నారు. ఇలాంటి పండుగల ద్వారా మన పూర్వీకుల సంప్రదాయాలను తరం తరానికి అందించడానికి అద్భుతమైన అవకాశమన్నారు. పిల్లలకు పండుగ వెనుక ఉన్న భావాన్ని, సంస్కృతీ సంప్రదాయాల మహత్తును వివరిస్తూ వారిని ప్రోత్సహించడానికే ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నాం అని చెప్పారు. నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాటలు, కోలాటం డ్యాన్స్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి లయన్ జి. సుజాత, కార్యక్రమ చైర్‌పర్సన్ లయన్ టి. నైనా దేవి, మాస్టర్స్ ఆఫ్ సెర్మనీ, లయన్ శోభావతి, లయన్ అల్కా జెజానీ, సురేఖ, డా.హిప్నో పద్మా కమలాకర్, జి.కృష్ణ వేణి, జ్యోతి రాజా, శోభారాణి,డా జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జలసౌధలో మంత్రులు ఉత్తమ్, సీతక్క సమీక్ష



**విశ్వంభర, హైదరాబాద్:** ఎర్రమంజిల్ లోని జల సౌధ లో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ములుగు లోని పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు, ఫ్లడ్ కెనాల్ పనుల పై అధికారులతో కలిసి సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గోదావరి కరకట్ట నిర్మాణం వేగవంతం చేయాలని, లక్నవరం నుండి రామప్ప కెనాల్ నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, గడుపులోపు పనులు పూర్తి అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## బీసీ రాజకీయ యుద్ధభేరి ప్రచార రథాలు ప్రారంభం

**విశ్వంభర, హనుమకొండ:** హలో బీసీ, చలో వరంగల్ నినాదంతో ఫిబ్రవరి 2వ తేదీన హనుమకొండ జిల్లా ఆర్ట్స్ సైన్స్ కళాశాల వేదిక నిర్వహించనున్న రాజకీయ యుద్ధభేరి ప్రచార వాహనాలను సోమవారం హనుమకొండ జిల్లా రాంనగర్ లోని బీసీ భవన్ లో బీసీ నేత, మాజీ కూడా చైర్మన్, టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. వరంగల్, హన్మకొండ, ఖాజీపేట తో పాటు శివారు గ్రామాల్లో ఈ వాహనాలు ప్రచారం చేస్తాయని ఆయన తెలిపారు. గ్రామ స్థాయికి బీసీ ఉద్యమాన్ని తీసుకెళ్లేందుకు ఈ సభ దోహద పడుతుందన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని బీసీ సంఘాలు ఈ సభకు మద్దతు పలుకుతున్నాయన్నారు. లక్షలాది మంది పైగా సభకు తరలిరావాలని సుందర్ రాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు కుల సంఘాల నాయకులు గడ్డం బాస్కర్, మాదం రజని కుమార్ బోనగాని యదగిరి గౌడ్, గిరబోయిన రాజయ్య యాదవ్, సిద్ధిరాజు యాదవ్, పులిరజనికాంత్, బుట్టి శ్యాం యాదవ్, బోయిని బిక్షపతి యాదవ్, దొంగల చెన్నమల్లు, వెంకటేశ్వర్లు, అబ్బగాని సత్యనారయణ, బోంగు రాజు, పెద్ద ఎత్తున బీసీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్పిటల్ లో మెరుగైన ప్రసూతి సేవలు అందించాలి

- సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలి
- విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- మెను ప్రకారం విద్యార్థులకి భోజన సౌకర్యం కల్పించాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**విశ్వంభర, సూర్యాపేట:** ప్రభుత్వ హాస్పిటల్ లో మెరుగైన ప్రసూతి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం నూతనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కేజీబీవీ లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఫార్మసీ స్టోర్ రిజిస్టర్ ని పరిశీలించి ఏమైనా మందులు అవసరం ఉంటే ముందుగానే తెప్పించుకొని ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ తో మాట్లాడుతూ హాస్పిటల్ కి వచ్చే వారికి ఎన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒపీ రిజిస్టర్ ని పరిశీలించి హాస్పిటల్ కి వచ్చే వారికి సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని అన్నారు. ఎ యన్ యం లతో మాట్లాడుతూ ఎంతమంది ప్రసూతి లు రిజిస్ట్రేషన్ చేపించుకుంటున్నారని అలాగే ఎంత మంది ప్రభుత్వ హాస్పిటల్ నందు వైద్య సేవలు పొందుతున్నారని అడిగి తెలుసుకొని ప్రజలలో అవగాహన కల్పించి ప్రభుత్వ హాస్పిటల్ నందు ప్రసూతి సేవలు పొందేలాగా చూడాలని అలాగే సిజేరియన్లు చేయకుండా సాధారణ ప్రసవాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్లకి, సిబ్బంది కి కలెక్టర్ సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం నూతనకల్ మండలంలోని కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయం ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్టోర్ రూమ్ ని పరిశీలించి మధ్యాహ్నం విద్యార్థులకి వడ్డించే భోజనాన్ని పరిశీలించి మెను ప్రకారం విద్యార్థులకి భోజన సౌకర్యం కల్పించాలని కలెక్టర్ అన్నారు. తదుపరి పదవతరగతి గదిలో జరుగుతున్న హిందీ క్లాస్ ని కలెక్టర్ సందర్శించి విద్యార్థులను హిందీ సబ్జెక్ట్ పై పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల చూసి రాత నోట్స్ ని పరిశీలించారు. విద్యార్థులు మార్చి లో జరగబోయే పదవతరగతి వార్షిక పరీక్షలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో పెండింగ్ లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు అసంపూర్తిగా ఉండటంతో సంబంధిత ఇంజనీరింగ్ అధికారితో మాట్లాడి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేజీబీవీ లో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలియపర్చాలని సూచించారు. అంతకుముందు నూతనకల్ మండలం గుండ్లసింగారం లోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అంగన్వాడీ కేంద్రం లో మొత్తం ఏడు మంది ఉన్నారని ఈ రోజు నలుగురు హాజరు అయినారని, వారికి ప్రాథమిక పాఠశాల లో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ కి అంగన్వాడీ టీచర్ వివరించారు. తదుపరి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎక్కువ మంది పాఠశాలకి హాజరు అయ్యేలా ప్రజలకి అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకి సూచించారు. విద్యుత్ సమస్య ఉందని కలెక్టర్ కి తెలియపర్చగా సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పీ హెచ్ సీ సూపర్ వైజర్లు చిన్ని, శ్రీలక్ష్మి స్టాఫ్ నర్స్ శైలజ, ల్యాబ్ టెక్నీషియన్ ఉష, యం యల్ హెచ్ పీ లు శిరీష, మనీషా, దీపిక కేజీబీవీ ఉపాధ్యాయురాలు వీరలక్ష్మి, కవిత, జ్యోతి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, పద్మజ అంగన్వాడీ టీచర్ పద్మ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ పోటీ

**రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్**



**విశ్వంభర, బషీర్ బాగ్:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న గ్రామ పంచాయితీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ వెల్లడించారు. యువత రాజకీయాల్లోకి వస్తేనే అవినీతి లేని ప్రభుత్వం సాధ్యమవుతుందని, స్థానిక సంస్థలలో టికెట్ల కేటాయింపులో యువతకే అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. మంగళ వారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్రంలోని 12769 గ్రామపంచాయతీలకు, 5817 ఎంపీటీసీ స్థానాలకు, 539 జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేస్తుందని తెలిపారు. అదేవిధంగా ఈ సంవత్సరం డిసెంబర్ లో జరిగే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కూడా తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి 2028 లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి, రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పార్టీ కమిటీలలో కూడా యువతకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిన కాంగ్రెస్ పార్టీ నీ, రాష్ట్రాన్ని అవినీతి కుంభకోణాలలో ముంచిన బీఆర్ఎస్ పార్టీని, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీని ఓడించడమే తమ పార్టీ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి రత్నం రాజు, మేకల సారయ్య, ఉప్పుగల్లా సోమన్న, మీదేంటి సురేందర్, దాసరి శ్యామ్ రావు, ఉదయ్ కుమార్, సామ్యూల్, కే. ఎన్ స్వామి, కే.ప్రసంగి గడ్డం బాబు, ఖమ్మం స్టీవెన్ పాల్గొన్నారు.

## పదేళ్ల పాలన మొత్తం వైఫల్యాలే

**– అధ్యక్షుడు బోయిని శంకర్ యాదవ్**



**విశ్వంభర, ఎల్బీనగర్:** బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో వైఫల్యాలు విధ్వంసమే తప్ప అభివృద్ధి లేదని సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్ యాదవ్ అన్నారు. మంగళవారం సరూర్ నగర్ లోని ఏఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తుండడంతో జీర్ణించుకోలేక బలంగా నిలబడిన కేఎల్ఆర్‌కు ప్రతి అడుగును వ్యతిరేకిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్ యాదవ్, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఎంఐ గుల్షానీ, ఎన్.ధన్‌రాజ్ గౌడ్, జంగారెడ్డి, అరుణ సంగీత, షఫీ, మహమ్మద్ నయీం, నరేరీగౌడ్ పాల్గొన్నారు.

## ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపూర్ గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేయడం జరిగింది. ఈ శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పశువులు వ్యాధి బారిన పడకుండా సకాలంలో టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగింది. ఎదలో ఉన్న వాటికి కృత్రిమ గర్భధారణ చేశారు. అదేవిధంగా చూడి పరీక్షలు చేయడం జరిగింది. దూడలకు నట్టల నివారణ మందులు వేయడం జరిగింది. రైతులకు కృత్రిమ గర్భధారణ, మేలు జాతి పాడి పశువులపై అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా విటమిన్ ఇంజక్షన్లు ఇవ్వడం జరిగింది. పాల దిగుబడిని పెంచే ఖనిజ లవణ మిశ్రమాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్ వైజర్ మహేష్, జేవిఓ శ్రీనివాస్, మల్లేశం, ఉపేందర్, గోపాల మిత్రులు బిక్షం, సురేందర్, స్వామి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి మాత దేవాలయంలో సామూహిక కుంకుమార్చన



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాలను పురస్కరించుకొని 2వరోజు మంగళవారం సామూహికంగా మహిళలతో కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది మహిళలు ఈ కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన కార్యదర్శి ఈగ వెంకటేశ్వర్లు, వాసవి మాలాధారణ నిర్వాహకులు పబ్బతి వేణుమాధవ్, కల కోట లక్ష్మయ్య మాట్లాడుతూ ఈనెల 31న వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని ఐదు రోజులపాటు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 2వ రోజు కుంకుమార్చనలు, వాసవి మాత పారాయణం, లలితా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించినట్లు తెలిపారు. నేడు బుధవారం 102 కలశములతో మాలధారణ స్వాములతో శోభాయాత్ర నిర్వహించి శ్రీ వాసవి మాతకు మహా అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30న పెద్ద ఎత్తున సాయంత్రం శోభయాత్ర నిర్వహిస్తున్నట్లు, భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించుకుని తరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్, తోట శ్యాంప్రసాద్, పోలా రాధాకృష్ణ, వెంపటి శబరినాథ్, ఈగ దయాకర్, బిక్కుమల్ల కృష్ణ, నూక రవిశంకర్, మంచాల శ్రీనివాస్, రాచకొండ శ్రీనివాస్, గుండా శ్రీధర్, రాచర్ల కమలాకర్, తోట రమేష్, మీలా వంశీ, బజ్జూర్ శ్రీనివాస్, డోగుపర్తి ప్రవీణ్, గుమ్మడవెల్లి శ్యామ్, యామ సంతోష్, వంగవీటి రమేష్, సింగరకొండ ప్రదీప్ కుమార్ ,చిలుకల స్వాతి శ్రీనివాస్, సింగిరికొండ కరుణశ్రీ, దేవరశెట్టి ఉమారాణి, తెడ్లపల్లవి, లకుమారపు పద్మ, తెడ్ల రాధిక, పోలా సుధామని, కలకోట అనిత, తేడ్ల పల్లవి పాల్గొన్నారు.

## సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

**– అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ గౌడ్**



**విశ్వంభర, నాగోల్:** రాజకీయాలకు అతీతంగా సంఘం అభివృద్ధికి కృషి చేయాలి అని తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం నాగోల్ గౌడ రావుల రాజు గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కులం వృత్తి సమస్యలు వచ్చే సమయంలో రాజకీయాలు వద్దు అని ఐక్యంగా ఉండటానికి సంఘం ఎంతో అవసరం అని అన్నారు. సమాజంలో వృత్తి దారులందరికి స్కిల్ డెవలప్మెంట్ ట్రెయినింగ్ ఇవ్వాలి అని అన్నారు. వ్యక్తుల సమస్యలు వచ్చినప్పుడు రాజకీయంగా పక్కకు పెట్టి అతని సమస్య పరిష్కారానికి అందరూ తోడవాలన్నారు. ఐక్యంగా ఉంటేనే సంఘం బలపడి సమాజంలో మర్యాద, గౌరవం ఇస్తారని తెలిపారు. 60 ఏండ్ల చరిత్రలో ఎంతో ఉద్యమాలు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాములు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, యట్టేశ్ గౌడ్, కట్ట ఈశ్వరయ్య గౌడ్, కొలను చంద్రశేఖర్ ఆజాద్, చెరుకు శ్రీనివాస్ గౌడ్, జంగయ్య గౌడ్, బద్దం రామకృష్ణ గౌడ్, కంది కంటి శ్రీధర్ గౌడ్, కొత్త మహేష్ , దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లికుదురు ఎమ్మార్పీఎస్ కమిటి ఎన్నిక



**విశ్వంభర, నెల్లికుదురు:** ఎమ్మార్పీఎస్ నెల్లికుదురు నూతన కమిటీని సీనియర్ నాయకులు గుండెపాక ఉప్పలయ్య మండల అధ్యక్షులు తూల్ల వెంకన్న, తూల్ల చిన్న వెంకన్న, హెచ్ అశ్విన్ ల సమక్షంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా హెచ్ రవి, ఉపాధ్యక్షులు హెచ్ యాకయ్య, మచ్చ వెంకన్న, ప్రధాన కార్యదర్శి హెచ్ అశోక్, అధికార ప్రతినిధి హెచ్ యాకయ్య, కోశాధికారి మచ్చ కిరణ్, జాయింట్ సెక్రెటరీ హెచ్ వెంకన్న, సలహాదారులు హెచ్ శ్రీను పెద్ద, హెచ్ చిరంజీవి. కార్యవర్గ సభ్యులు హెచ్ సమ్మయ్య, హెచ్ మల్లేష్, దైద నరేందర్, ముసిపట్ల చంటి, ముప్పట్ల నాగయ్య, గుండెపాక శ్రీను, దైద ప్రభాకర్, హెచ్ హుస్సేన్, యాకయ్య, హెచ్ సతీష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## వాహనదారులు సరైన పత్రాలు కలిగివుండాలి

**– ట్రాఫిక్ పట్టణ ఎస్ఐ సాయిరాం సూచన**




**విశ్వంభర, సూర్యాపేట:** వాహనదారులు తప్పనిసరిగా ధ్రువ ప్రతాలను, డ్రైవింగ్ లైసెన్స్, కలిగి ఉండాలని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం సూచించారు. మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని వాహనాల గురించి ఖమ్మం %ఇ% రోడ్ వద్ద అవగాహన కార్యక్రమం ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పక హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు వెంట తెచ్చుకోవాన్నారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను చెల్లించాలని వాహనదారులకు సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

## శివం రోడ్డులో అగ్నిప్రమాదం



**విశ్వంభర, హైదరాబాదు:** హైదారాబాద్ విద్యానగర్ శివం రోడ్డు లో మంగళవారం నేషనల్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ప్రమాదవశాత్తు ట్రాన్స్ ఫార్మర్ లోమంటలు చెలరేగాయి. వెంటనే స్పందించి విద్యుత్ సిబ్బంది ఫైర్ సేఫ్టీ వాళ్ళ ను పిలిపించి మంటలను అదుపు చేయించారు.

## కస్తూర్బా పాఠశాల ఆకస్మిక తనిఖీ

**– తనిఖీ చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**విశ్వంభర, దేవరుప్పుల:** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, వంట గదిని పరిశీలించారు. విద్యార్థులను ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకొని, విద్యార్థుల తో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ వెంట స్థానిక ఎమ్మార్వో మైపాల్ రెడ్డి , ఆర్ ఐ రాజు, సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శంతన్ రామరాజు దంపతుల జన్మదిన వేడుకలు



**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర బీసీనేత శంతన్ రామరాజు జన్మదిన వేడుకలు మంగళవారం నాడు ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీరాం నగర్ బీసీ కాలనీలో జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మానుకోట ఎమ్మెల్యే ఉమా మురళీ నాయక్ దంపతులకు అపూర్వస్వాగతం లభించింది. శాలువాకప్పి, బొకే ఇచ్చిన అనంతరం టపాసులు పేలుస్తూ 'రెడ్ కార్పెట్" పరిచి, గజమాలతో ఘనంగా ఆహ్వానం పలికారు. తన అనుచరుడు శంతన్ రామరాజు దంపతుల ఇరువురి పుట్టినరోజు ఒక్కరోజే కావడం పట్ల ఎమ్మెల్యే ఆశ్చర్యానందాన్ని వ్యక్తం చేశారు. కేక్ కట్ తినిపించి ఇద్దరినీ ఆశీర్వదించారు. బోజనానతరం ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ అత్యదిక మెజారిటీతో ఎమ్మెల్యేగా నన్ను గెలిపించిన మానుకోట నియోజకవర్గ ప్రజలకు జన్మజన్మలకూ రుణపడి వుంటానన్నారు. ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న తాను నిర్దేశించుకున్న లక్ష్యం కోసం అహర్నిశలూ పనిచేస్తున్న శంతన్ రామరాజుకు తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. శంతన్ రామరాజు మాట్లాడుతూ నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం ఎమ్మెల్యే మురళీ నాయక్ అని అన్నారు. ప్రజల ఆశీస్సులతో త్వరలోనే మంత్రిపదవి వరిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలోశనిగపురం మాజీ సర్పంచ్ రామరాజు భిక్షపతి, తెలంగాణ ఉద్యమకారులు కమ్మగాని కృష్ణమూర్తి, నారాయణ్ సింగ్, గోనె శ్యామ్ రావు, ఆంధ్రప్రభ స్టాఫర్ మహ్మద్ సుభాని, సీనియర్ జర్నలిస్ట్ గొర్రె చిట్టిబాబు, రామరాజు సాగర్, ఆవేత్ కుమార్, చిట్టిమల్ల శ్రీమన్, చుక్క శ్రీనివాస్, బండి శ్రీహరి, వేల్పుల లక్ష్మణ్, విష్ణు, బోయిని విజయ్, లకావత్ కిషన్, సురేష్, రాం రాథోడ్ పాల్గొన్నారు.

## కనులపండువగా సంకీర్తన అకాడమీ వార్షికోత్సవం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీ వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో సంగీత గురువు ఎమ్. సత్యవతి, కృష్ణా రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించిన సంకీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ 7 వ వార్షికోత్సవం కార్యక్రమం కు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించాడు. అనంతరం చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో పిల్లలకు చక్కని సంగీతం, సంస్కారం నేర్పించడానికి, మహిళామణులకు తమ రోజు వారి ఒత్తిడి నుండి ఆధ్యాత్మికత, ఉత్సాహం కలగలిపిన చక్కని వ్యాపకంగా ఈ సంగీత తరగతులు ఎంతో ఉపయోగ పడుతున్నాయని అన్నారు. శాస్త్రీయ సంగీత గీతాలు, అన్నమాచార్య కీర్తనలు, ఆధ్యాత్మిక గీతాలతో శ్రోతలను అలరించారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ నరసింగా రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంగీత గురువు నూకల జగదీశ్వరి, సోమయాజులు, యాదవ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అద్యక్షుడు మైసయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వరులు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎన్. మాధవ రెడ్డి , తబలా వాద్యకారులు గంగాధర్, ఇతర సంగీత వాద్యకారులు పాల్గొన్నారు.

## డివిజన్ ఆర్గనైజర్ సెక్రటరీగా యశ్వంత్



**విశ్వంభర, ఇనుగుర్తి:** విద్యుత్ సంస్థ టీఆర్వీకేఎస్ ఆర్గనైజర్ సెక్రెటరీగా ఇనుగుర్తి లైన్మెన్ ఎం. యశ్వంత్ ను ఎన్నుకున్నారు. టీఆర్వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి జాన్సన్ సమక్షంలో డివిజన్ బాడీ ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఈ మేరకు యశ్వంత్ ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యశ్వంత్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన రాష్ట్ర,రీజనల్, డివిజన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## లారీ డీకొని విద్యార్థి మృతి



**విశ్వంభర, మేడిపల్లి:** మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్వతాపూర్ లో ట్యూషన్ కి వెళ్లి తిరిగి వస్తుండగా మంగళవారం తేజస్ చౌదరి (14) ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని అన్నారు.

## కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన సమ్మయ్య గౌడ్



**విశ్వంభర, మహబూబాబాద్:** కేసముద్రం నూతన మున్సిపాలిటీ మొదటి కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన కె.ప్రసన్న రాణి ని కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ యొక్క అభివృద్ధికి కమిషనర్ కృషి ఎల్లవేళలా ఉండాలని వారిని కోరారు.

## ఎంపీడీఓ మహేష్ బాబుకు ఘన సన్మానం



**విశ్వంభర, దోమ:** దోమ మండలం ఎంపీడీవో మహేష్ బాబుకు జిల్లా ఉత్తమ ఎంపీడీవో అవార్డును కలెక్టర్ ప్రతిక్ జైన్ చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్య గౌడ్ ఎంపీడీవో మహేష్ బాబును ఎంపీడీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఉత్తమ అవార్డు దోమ మండల ఎంపీడీవోకు రావడం అభినందనీయమన్నారు. మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్రి, సూపర్డెంట్ నరేందర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన రాహిత్యంతో మాట్లాడితే గుణపాఠం తప్పదు

**దుండిగల్ మాజీ సర్పంచ్ గణేష్**



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపల్ రాజకీయ ఎత్తుగడలతో బురుదజల్లే ప్రయత్నం చేయడం సరికాదని, ప్రజా సమస్యలపై అవగాహన లేకుండా మాట్లాడితే ప్రజలు హర్శించరని, పంచాయతి పాలక వర్గం తీర్మానం లేకుండా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని దుండిగల్ మాజీ సర్పంచ్ కావాలి గణేష్ అన్నారు. దుండిగల్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం పొందిన పనులకు టెండర్లు పిలిచి పనులను కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉంటుందన్నారు. టెండర్లు పిలువకుండా పాలక వర్గం తీర్మానం అంటూ పదవీ కాలం ముగుస్తుందనగా మూడు రోజుల ముందు 3వ వార్డు మాజీ కౌన్సిలర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు. వాస్తవాలను వెలుగులోకి తెస్తే పంచాయతి పాలక వర్గం లో తీర్మానం పొందకుండా పనులు అప్పగించారంటూ ఎదురదాడుచేటడం సరికాదన్నారు. అయిదు సంవత్సరాలలో చెయ్యలేని అభివృద్ధి కార్యక్రమాలను మూడు రోజుల ముందు హడావిడిగా శంకుస్థాపన చేయాల్సిన అవసరం ఏముందన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సి తో నిత్యం చుట్టూ తిరగడం తప్ప మీకు ప్రజా సమస్యలపై చర్చించే సోయలేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలను మోసం చేసి సొమ్ము చేసుకునే సంస్కృతి మీదన్నారు. కాంట్రాక్టర్ రాజు నాయక్ మాట్లాడుతూ ప్రతి పనిని పంచాయతి తీర్మాణంతోనే చేసినట్లు తెలిపాడు.

## గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లాలోని గ్రంథాలయాలను విజ్ఞానవంతమైన సమాజం కోసం, గ్రంథాలయ పాఠకులకు, పుస్తక ప్రియులకు ఉపయోగకరంగా జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని, అదేవిధంగా జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలు ఎప్పటికప్పుడు, గ్రంథాలయ పన్ను చెల్లించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రంథాలయంలో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంచాలి అన్నారు. 2024- 25 ఆర్థిక సంవత్సరం ఖర్చు చేసిన నిధుల వివరాలు, 2025 -26 బడ్జెట్ అంచనాలు ఆమోదం కోసం పంపేందుకు అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జె.హరిప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవీందర్ రెడ్డి, జిల్లా పౌరసంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, రుద్రారపు వీరేందర్ పాల్గొన్నారు.

## కుల దుఃహంకారంతో హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



**విశ్వంభర, కాటారం:** సూర్యాపేటలోని మామిళ్ల గడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అనే దళిత యువకుడు కులాంతర వివాహం చేసుకున్నాడని, కుల దురహంకారంతో బండరాలతో కొట్టి దారుణ హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని పత్రిక విలేకర్ల సమావేశం లో డిమాండ్ చేశారు. జనగామ రహదారి నుంచి పిల్లలమర్రి వెళ్లే మూసి కెనాల్ కట్టపై మృతదేహాన్ని పడేశారని, మృతుడికి ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడని అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయి తండ్రి, అన్న వారి ఫ్రెండ్స్ తో ఈ హత్య చేయించారని మృతుడి భార్య ఆరోపిస్తోందని తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసి, హత్య చేసిన నిందితులకు జాతీయ రాష్ట్ర ఎస్సీ కమిషన్ హైకోర్టు ఈ కేసును సుమోటోగా తీసుకొని నిందితులకు ఉరిశిక్ష వేయాలని పీక కిరణ్ డిమాండ్ చేశారు.

## కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదు

- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



**విశ్వంభర, భూపాలపల్లి:** కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పోలీసు అధికారులంతా బాధ్యత రహితంగా వ్యవహరించాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, విజుబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలను అదుపుచేస్తూ సత్వరమే స్పందించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో అధునాతన సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు, కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, వర్టికల్ డిఎస్పి నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## రహదారిపై సత్వరమే మరమ్మతులు చేపట్టాలి

**తాహసీల్దార్ కి వినతి పత్రం అందజేసిన ధర్మ సమాజ్ పార్టీ**



**విశ్వంభర, కోరుట్ల:** వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండలం కలికోట గ్రామం నుండి సిరికొండ గ్రామం పరిధి వరకు ఉన్న కోరుట్ల – వేములవాడ ప్రధాన రాష్ట్ర రహదారి గుంతలతో ప్రమాదాలకు నిలయంగా మారిందని ప్రభుత్వం తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ధర్మసమాజ్ పార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారి దాదాపుగా 40 చోట్ల గుంతలు పడి ప్రజల ప్రయాణానికి తీవ్ర నరకయాతనగా మారింది. వారం క్రితం రుద్రంగి మండల కేంద్రంలో జరిగిన గ్రామ సభ మీటింగ్ కి మంత్రులు పర్యటిస్తే గుట్టు చప్పుడు కాకుండా కొన్ని గుంతలను మాత్రమే మట్టితో చదును చేసి ప్రజా రవాణా భద్రతను గాలికి వదిలేసారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే వృద్ధులు, బాలింతలు, ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నారు. ప్రభుత్వం ఒకవైపు రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తూనే రోడ్ల నిర్వహణ భద్రత పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తుంది. త్వరలో జరగనున్న మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఈ రహదారిగుండానే వేలాది వాహనాలలో లక్షలాది మంది భక్తులు ప్రయాణం చేస్తారు. కావున తక్షణమే ఈ తీవ్రమైన ప్రజా సమస్యను పరిగణనలోకి తీసుకొని ప్రత్యేక నిధులతో వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ధర్మ సమాజ్ పార్టీ జగిత్యాల జిల్లా కమిటీ, కథలాపూర్ మండల కమిటీలు విజ్ఞప్తి చేశాయి.

## లక్ష డప్పులు వెయ్యి గొంతుకల సభను విజయవంతం చేయాలి

**వింజమూరి కృష్ణ మాదిగ**



**విశ్వంభర, చింతపల్లి:** ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ ఫిబ్రవరి 7న తలపెట్టిన ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అమలుకై నిర్వహిస్తున్న లక్ష డప్పులు వెయ్యి గొంతకల భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కోడుదుట్టి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులతో సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సన్నాక సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు వింజమూరి కృష్ణ మాదిగహాజరై మాట్లాడుతూ ఫిబ్రవరి 7న ఏబీసీడీ వర్గీకరణకై మందకృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు వెయ్యి గొంతుకల భారీ బహిరంగ సభకు ఎమ్మార్పీఎస్ నాయకులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఎర్ర జగన్, నల్గొండ జిల్లా ప్రచార కార్యదర్శి కుర్మేటి వెంకటరమణ, జిల్లా నాయకులు మాసని పెద్దయ్య, కోడిదొడ్డి శంకర్, కంబాలపల్లి రాజు, బుషీపాక శ్రీను, నల్ల సైదులు, అడ్వకేట్ భావండ్లపల్లి చెన్నయ్య, దామర రామకృష్ణ, డొంకు శంకర్, వింజమూరు శంకర్, తదితరులు ఉన్నారు.


## కల్యాణ లక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి**



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహానిధి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా మంజురైన రూ. 1,06,000 లను మంజూరి చేయించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి.127 డివిజన్ ఇందిర గాంధీ నగర్, బాచుపల్లి సాయి నగర్ చెందిన వాసులు జన శిరోమణికి రూ. 60,000 లు, ఉమకి 47,500 రూ చెక్కులను అందజేశారు. 127 డివిజన్ ఇందిర గాంధీ నగర్ మమత రూ. 1,00116/– ల కల్యాణ లక్ష్మి చెక్కును అందజేశారు. అనంతరం హన్మంతన్న మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెరికె శివ, తైలం శ్రీనివాస్, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, శామీర్ పెట్ ప్రకాష్ రావు, ప్రశాంత్ రెడ్డి, గొంగుల నవీన్, అది రెడ్డి, లక్ష్మి రెడ్డి, మాధవి రాణి, నీల గుప్తా, చిన్నమ్మ, జానకి, ధనలక్ష్మి, కోమల, తదితరులు పాల్గొన్నారు.

## వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్న కాళేశ్వరం



**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని ముక్తేశ్వర ఆలయంలో మధుప్రియ సాంగ్ షూటింగ్ వివాదం మరువక ముందే మరో వివాదాస్పరమైన ఘటనకు తెరలేచింది. మంగళవారం ఉదయం స్వామివారి దర్శనానికి వెళుతున్న సాధారణ భక్తులను అడ్డుకున్న ఆలయ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించారు. మంగళవారం ఉదయం స్వామి వారి దర్శనానికి వెళ్తున్న మహిళ భక్తులను అడ్డుకున్న ఆలయ సిబ్బంది దురుసుగా ప్రవర్తించి బయటకు పంపించారు. చాలా సేపటి నుంచి క్యూ లైన్ లో వేచి ఉన్న భక్తులు ఆలయ సిబ్బంది దురుప్రవర్తనతో తీవ్ర మనోవేదనకు గురై వెనుతిరిగారు. ఆలయ సెక్యూరిటీ సిబ్బందితో పాటు అక్కడ ఉన్న అర్చకులు సైతం తమపై దురుసుగా ప్రవర్తించారని మహిళా భక్తులు వాపోయారు. ఆలయ సిబ్బందికి అనుకూలమైన వ్యక్తులను బంధుమిత్రులను వీఐపీ క్యూ లైన్ నుండి స్వామి వారి దర్శనానికి పంపిస్తూ దగ్గర ఉండి మరీ అర్చన అభిషేకాలు చేపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

## ఘనంగా శ్రీనిధి గ్లోబల్ స్కూల్ యాన్యువల్ డే



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఐడీపీఎల్ లోని ఎంపీఆర్ కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించిన శ్రీనిధి గ్లోబల్ స్కూల్ అన్యువల్ డే వేడుకలకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో 30 నిమిషాల నిడివితో ప్రదర్శించిన సంపూర్ణ రామాయణం నాటక ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకర్షించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మన చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరానికి తెలిసేలా సంపూర్ణ రామాయణం నాటక ప్రదర్శనలో విద్యార్థులను ప్రోత్సహించిన పాఠశాల యాజమాన్యానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల ప్రత్యేక శ్రద్ధ ఎంతో అవసరమని అన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, నాయకులు ఎర్వ సాయి కిరణ్, శ్రీనిధి గ్లోబల్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్. నల్లపాటి వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్ నల్లపాటి రాజేశ్వరి, డైరెక్టర్ నల్లపాటి సాయినాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ సమావేశం



**విశ్వంభర, దోమ:** దోమ మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ వెంకట్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకట్ మాట్లాడుతూ.. అన్ని పాఠశాల విద్యార్థుల అప్పర్ ఐడీ జనరేట్ చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు సంబంధించిన అమౌంట్ అకౌంట్ లలో జమ చేయడం జరిగిందని తెలిపారు. పనులకు సంబంధించిన ఫోటోలు యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ శ్రీదేవి, సీఎంఓ రజిని, ఎంపీడీవో మహేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు మహా ధర్నాకై కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి మంగళవారం రోజున నల్లగొండ జిల్లా కేంద్రం గడియారం సెంటర్ నందు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యములో నిర్వహించిన రైతు మహా దర్నాకు మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యములో కార్లు, బైకులు, ఆటోలలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మరియు రైతులు స్వచ్ఛందంగా బయలుదేరారు. కాగా పట్టణములో ఉద్యమ నాయకులు యడవెల్లి శ్రీనివాస రెడ్డి జెండా ఊపి కార్ల ర్యాలీని ప్రారంబించి వారితో పాటు వెళ్ళి సభను విజయవంతం చేయడం జరిగినది. కార్యక్రములో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాక్దూమ్, మాజీ ఫ్లోర్ లీడర్ ఇలియాస్ ఖాన్, మాజీద్, షోయబ్, అయోధ్య, గుడిసె దుర్గాప్రసాద్, గంధం సైదులు, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, దినేష్, ఈశ్వర్ చారి, నల్లగ0తుల నాగభూషణం, చీర0జీవి, జంజీరాల నాగరాజు, నేరెళ్ళ శివ, నాగరాజు, పరిమి రామవతరం, ఫయాజ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## మట్టి రోడ్డును తలపిస్తున్న ప్రధాన రహదారి

- వాహన రాకపోకలతో లేస్తున్న దుమ్ము
- శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు



**విశ్వంభర, జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మట్టి రోడ్డును తలపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం గతంలో ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపంతో మండల కేంద్రంలో ప్రధాన రహదారి మట్టి రోడ్డుగా మారింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టారు. వర్షం వస్తే ప్రధాన రహదారిపై నీరు ప్రవహిస్తూ మట్టి చేరుతోంది. దీంతో ప్రధాన రహదారి మట్టి రోడ్డును తలపిస్తోంది. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి చర్చి కాంపౌండ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు అంగుళాల మేర మట్టి పేరుకుపోయింది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ము ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలు మట్టి తుంపర్లతో కప్పేయపడుతున్నాయి. నిత్యం దుమ్ముని పీలుస్తున్న ప్రజలు శ్వాస కోశ, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించాలని కోరుతున్నారు.

## ఎల్ఓసీ కాపీని అందించిన ఎమ్మెల్యే




**విశ్వంభర, మూసాపేట్:** మహబూబ్ నగర్ జిల్లాలోని మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన బైకని శివ కిడ్నీ సంబంధించిన ఆపరేషన్ ను హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రి చేయించుకున్నారు. అతనికి సీఎం సహాయ నిధి ద్వారా 2లక్షల 50 వేల రూపాయల ఎల్ ఓ సి మంజూరయ్యింది. ఆ కాపీని వారి కుటుంబ సభ్యులకు మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి హైదరాబాదులోనా అతని నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య ఉన్నారు.

## కళాశాల ప్రిన్సిపాల్‌లకు పరీక్షపై అవగాహన



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలోని ప్రైవేట్ అండ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లకు సూచనలు ఇచ్చిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డీఐఈఓ మహబూబాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లతో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ మరియు పర్యావరణ విద్య పరీక్ష పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మదార్ గౌడ్ మాట్లాడుతూ జనవరి 29, 2025 న మానవతా నైతిక విలువలు, 30వ తేదీన పర్యావరణ విద్య పరీక్ష, 31వ తేదీన మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్, ఫిబ్రవరి ఫస్ట్ తారీఖున రెండవ సంవత్సర విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ ఎగ్జామ్స్, ఫిబ్రవరి 3 నుండి 22వ వరకు సైన్స్ మరియు ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ నిర్వహించబడును. ఈ పరీక్షలను ఎలాంటి అవకతవకలు జరగకుండా సజావుగా నిర్వహించాలని సూచించారు. ప్రతి కళాశాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు ఆన్లైన్లోనే డౌన్లోడ్ చేసుకొని ఉంచుకోవాలి. మార్కులు ఆన్లైన్లో వేసేటప్పుడు చాలా జాగ్రత్తగా సరిచూసుకొని సబ్మిట్ చేయాలి. పరీక్షలను సజావుగా ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లాలోని అన్ని కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## రైతే దేశానికి రాజు



**విశ్వంభర, హైదరాబాద్:** నల్గొండ క్లాక్ టవర్ కూడలిలో భారాస రైతు మహాధర్నాకు హైదరాబాద్ అంబర్పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ తో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు వెళ్ళారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధు పథకం రైతు బీమా పథకం అమలు చేయడంలో జాప్యం చేస్తూ, అనేక విధాలుగా రైతులనీ చిన్న చూపు చూస్తుందని, రైతే దేశానికి రాజు అన్న విషయం మరవ వద్దని ఈ సందర్భంగా అన్నాడు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, అంబర్పేట్ డివిజన్ నుంచి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బెల్లం, పటికను పట్టుకున్న పోలీసులు

*** విలువ రూ.1 లక్ష 60 వేలు, వాహనం సీజ్..**

*** ఎస్ఐ రమేష్ బాబు**



**విశ్వంభర, నెల్లికుదురు:** గుడుంబాకు ఉపయోగించే నిషేధిత నల్లబెల్లాన్ని పోలీసులు పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికుదురు క్రాస్ రోడ్ (పాత రామకృష్ణ స్కూల్) వద్ద డిమాక్స్ ట్రాలీ పై అనుమానం వచ్చి వెంబడిస్తున్న క్రమంలో వాహనం నిలిపివేసి గుర్తుతెలియని వ్యక్తులు పరారయ్యారు. వాహనంలో 30 బస్తాల నల్ల బెల్లం, రెండు బస్తాల పటిక ను గుర్తించి వాహనంతో సహా బెల్లాన్ని పట్టికను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. నిషేధిత బెల్లం, పటిక విలువలు సుమారు రూ.1,60,000 ఉంటుందని వెల్లడించారు. సంబంధిత వ్యక్తులపై సంబంధిత వ్యక్తులను పట్టుకుంటామని చెప్పారు.

## నల్లగొండ కుక్క మూతి నేతలకు మేం భయపడం: జగదీష్ రెడ్డి



**విశ్వంభర, నల్లగొండ :** నల్లగొండ కుక్క మూతి నేతలకు మేం భయపడం. తెలంగాణ రాష్ట్రం రైతాంగం మద్దతుతో ఏర్పడిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలోని క్లాక్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన రైతు మహా ధర్నాలో ఆయన కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణలో కరెంట్ ధరల పెంపును ఒప్పుకోను అని చెప్పి నాడు కేసీఆర్ రాజీనామా చేశారు.అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులే మద్దతుగా నిలిచారన్నారు. 'కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో' నినాదాలతో తెలంగాణ సాధించారని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చాక ప్రజల కోరిక మేరకు అధికారం చేపట్టారు. అధికారంలోకి వచ్చాక రైతులను రాజులను చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తే కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. అయినా కేసీఆర్ ఆదేశాలతో కేటీఆర్, రైతులు నల్లగొండకు భారీగా తరలి వచ్చారు. కేటీఆర్‌కు రాహుల్ గాంధీనే పోటీ, ఇక్కడ జిల్లా నేతల గురుంచి కాదని స్పష్టం చేశారు.

## పరువు నష్టం కేసులో ఎన్నికల వేళ సీఎం ఆతిశీకి ఊరట



**ఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికల వేళ ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీకి ఊరట లభించింది. ఆమెకు వ్యతిరేకంగా భాజపా దాఖలు చేసిన పరువునష్టం పిటిషన్‌ను నగరంలోని రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. ఆమె మొత్తం పార్టీని ఉద్దేశించి మాట్లాడారని.. ఒక్క వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యానించలేదని న్యాయస్థానం పేర్కొంది. దీంతో ఆమెకు ఈ కేసులో ఉపశమనం లభించింది. గతేడాది లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రిగా వ్యవహరించిన ఆతిశీ భాజపాపై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పార్టీలో చేరకపోతే.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆప్ నేతలను అరెస్టు చేస్తుందని కాషాయ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు బెదిరించారని ఆమె ఆరోపించారు. దీంతో ఆతిశీకి వ్యతిరేకంగా బీజేపీ నేత ప్రవీణ్ శంకర్ కపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది.దీంతో పాటు ఆమెపై న్యాయస్థానంలో పరువునష్టం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుపై కోర్టు తాజాగా విచారణ చేపట్టింది. ఆతిశీ భాజపాను ఉద్దేశించి వ్యాఖ్యానించారని.. ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడలేదని పిటిషన్‌ను కొట్టివేసింది. ఇదిలా ఉండగా.. దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఫిబ్రవరి 5న పోలింగ్.. 8న ఫలితాలు వెలువడనున్నాయి. కల్కాజీ స్థానం నుంచి సీఎం ఆతిశీ మరోసారి ఎన్నికల బరిలోకి దిగిన సంగతి తెలిసిందే.

## యమున విషపూరితంపై ఆధారాలు కావాలి..

**బుధవారం రాత్రి ఎనిమిది గంటల్లోపు రిప్లై ఇవ్వాలని కేజ్రీకి ఈసీ ఆదేశం ..!**

**ఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటీసు జారీ చేసింది. ఢిల్లీకి పొరుగున ఉన్న హర్యానా.. యమునా నదిని విషపూరితం చేసిందంటూ పేర్కొన్న బహిరంగ వ్యాఖ్యలకు బుధవారం రాత్రి ఎనిమిది గంటల్లోపు సమాధానం చెప్పాలని ఆదేశించింది. దేశ సమగ్రత, ప్రజా సామరస్యానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన వారికి మూడేండ్ల జైలుశిక్ష విధించాలని కోర్టు తీర్పులు, చట్టాలు చెబుతున్నాయని ఈసీ గుర్తు చేసింది.యమునా నదిలో రసాయనాలు వేయడం వల్లే భారీ సంఖ్యలో ప్రజలు మరణిస్తున్నారని, మారణ హోమానికి దారి తీస్తుందని ఢిల్లీ జలబోర్డు ఇంజినీర్లు సకాలంలో గుర్తించారని అరవింద్ కేజ్రీవాల్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అధిక రసాయనాల మిశ్రమం యమునానదీ జలాల్లో కలవడంతో ఢిల్లీలో మారణ హోమానికి కారణమవుతుందంటూ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. యమునా నది విషపూరితంతో ఢిల్లీలో మారణ హోం జరుగుతుందని, ఇది నాగసాకి, హిరోషిమా నగరాలపై అణుబాంబుల ప్రయోగంతో సమానం అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. దీనికి ఆధారాలు తెలిపే పత్రాలు సమర్పించాలని ఈసీ డిమాండ్ చేసింది.



# మేధావుల మౌనం అందరికీ నష్టం : ఎంపీ రఘునందన్ రావు



**విశ్వంభర, మెదక్:** మేధావుల మౌనం గా ఉంటే ఉద్యోగులతో పాటు సామాన్యులకు కూడా నష్టం కలుగుతుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో మంగళవారం టీఎన్జీవో అధ్యక్షుడు దొంత నరేందర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ, డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, ఎమ్మెల్యే సునీతా రెడ్డి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... టీఎన్జీవో ప్రవేశపెట్టిన తీర్మానాల్లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు 30 రోజుల్లోగా అన్ని బెనిఫిట్స్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా తీర్మానం చేయాలని సూచించారు. ఏళ్ళ పాటు ప్రభుత్వం ఉద్యోగం చేసి సేవలు అందించిన ఉద్యోగులు రిటైర్మెంట్ అయితే వారికి రావలసిన బెనిఫిట్స్ అందక ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి ఎదురవుతుందని అవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదవీ విరమణ వయస్సు పెంచి ఉద్యోగులకు రావల్సిన బెనిఫిట్స్ ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా మరో మూడేళ్లు పెంచేందుకు యోచిస్తోందని అన్నారు.

దీనిని అన్ని ఉద్యోగాల సంఘాలు వ్యతిరేకించి పోరాడాల్సిన అవసరం ఉందని, దానికి తాను కూడా వచ్చి పోరాటం చేస్తానని చెప్పారు. ఉద్యోగులు, జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి 24 గంటల అందించాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన 5 డి ఏ లకు ఒక్కటి మాత్రమే ప్రభుత్వం ఇప్పటి వరకు ఇచ్చిందని, అన్ని డి ఎ లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం రెండు రెండేనని, ఎన్నికలకు ముందు ఉద్యోగుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి హామీ ఇవ్వడం, విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. కంట్రిబ్యూషన్ పెన్షన్ విషయంలో కేంద్రం ఇన్ ఫైవ్ పెన్షన్ సంబంధించిన సూచనలు ఇస్తే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. ఉద్యోగుల ఐ టి కి సంబంధించిన అంశంపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తనని అన్నారు.

రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తాము ఉంటామని, మెదవులు కూడా ప్రశ్నించి పోరాటం చేయాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... జిల్లాలో ఉద్యోగులు శక్తి వంచన లేకుండా సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ పథకాలు పక్కగా అమలు చేసేలా ఉద్యోగులు చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో అతి ముఖ్యమైన పిల్లర్ గా ఉద్యోగులు పని చేశారన్నారు. గత ప్రభుత్వం కూడా ఉద్యోగులకు అన్ని విధాలుగా సహకారం అందించిందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు పీ ఆర్ సి ఇచ్చిందని వివరించారు.

కానీ ప్రభుత్వ ఉద్యోగులకు కొంత మందికి ప్రతి నెల వేతనం రాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి నెల వేతనాలు ఇవ్వాలని కోరారు. సుభాష్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర ఉద్యోగులదే అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో కూడా ఎంతో కృషి చేశారని చెప్పారు. ఉద్యోగులకు గత ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. ఉద్యోగుల సమస్యల కోసం తాము ఎప్పుడూ ముందుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు దేవీ ప్రసాద్, శ్యాం రావు, మిల్కీ రాజ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, అనురాధ, గడ్డం శ్రీనివాస్, సుభాష్ చంద్రబోస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా చిలుకానగర్ మహాప్రస్థానం ఏర్పాటు చేస్తాం


**మేయర్ గద్వాల విజయలక్ష్మి**

**రూ. 2 కోట్లతో మహాప్రస్థానం శంకుస్థాపన**



**విశ్వంభర, ఉప్పల్:** ఉప్పల్ నియోజకవర్గం చిలుకానగర్ డివిజన్‌లో మేయర్ గద్వాల విజయలక్ష్మి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా చిలుకానగర్ డివిజన్‌లో సుమారు రూ.2 కోట్ల నిధులతో ఆదర్శనగర్ కాలనీలోని గ్రేవ్ యార్డ్‌లో మహాప్రస్థానం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ హాజరై లాంఛనంగా శంకుస్థాపన చేశారు. అనంతరం చిలుకానగర్ డివిజన్‌లో పలు పెండింగ్ సమస్యలపై స్థానికులు కార్పొరేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బ్యాంక్ కాలనీలోని రూ.కోటి 40లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే చిలుకానగర్ చౌరస్తా వివేకానంద విగ్రహం నుంచి కావేరి నగర్ కల్వర్టు వరకు నాలుగు ఫీట్ల స్ట్రామ్ వాటర్ ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాలని కుమ్మరి కుంట వాసులతో కలిసి కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మేయర్ విజయలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు మల్లికార్జున్ నగర్ కాలనీలో హెచ్ఎంటీ నగర్ చెరువు నుంచి వచ్చే ఓవర్ ఫ్లో స్ట్రామ్ వాటర్ కోసం ప్రత్యేకమైన ఏర్పాటు చేయాలని మల్లికార్జున్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. నార్త్ కళ్యాణ్ పూరి పార్కులో రూ.30 లక్షలతో పార్కు అభివృద్ధి చేసినందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి కార్పొరేటర్ గీతా ప్రవీణ్ నార్త్ కళ్యాణ్పురి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శాలువాతో సత్కరించి పార్కు లోపల ఉన్న ట్రాన్స్ఫార్మర్ ని బయటకు తరలించాలని కోరారు. అలాగే విశతత్ ఎంక్లేవ్ కాలనీ దగ్గర ఉన్న 6 ఫీట్ల కల్వర్టుని శంకుస్థాపన చేసి సుమారు ఏడాది గడిచిందని, వెంటనే పెండింగ్‌లో ఉన్న కల్వర్టు వెడల్పు పనిని పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మేయర్ విజయలక్ష్మిని కోరారు. కళ్యాణ్ ఇందిరా నగర్ కాలనీలో పోచమ్మ టెంపుల్ వద్ద ఉన్న బ్లైండ్ కరువుని వెంటనే రోడ్డు వెడల్పు చేసి ప్రజల సౌకర్యార్థం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కళ్యాణ్పురి ఇందిరానగర్‌లోని కమ్యూనిటీ హాల్‌ని మల్టీ యుటిలిటీ ఫంక్షన్ హాల్‌కి నిధులు కేటాయించి కట్టించాల్సిందిగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ఇంద్రానగర్ కాలనీ సభ్యులతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్సీ నిత్యానందం, బీసీ ఆంజనేయులు, ఏఎంహెచ్ఓ రంజిత్, హార్టికల్చర్ డీడీ అన్నపూర్ణ, పోలీసు ఏసీపీ చక్రపాణి, సీఐ ఎలక్షన్ రెడ్డి, ఎస్ఐ చిరంజీవి, పీఓ రాధా రాణి, ఈఈ నాగేందర్, హరిలాల్, ఈఈ నాయక్, డీఈ రవీందర్, డీఈ వెన్నెల గౌడ్, ఏఈ వినీత్, వివిధ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు, కాలనీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణ హైకోర్టులో హరీష్‌రావుకు ఊరట





**విశ్వంభర, హైదరాబాద్:** హైకోర్టు లో బీఆర్ఎస్ ముఖ్యనేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుకు ఊరట లభించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో వచ్చే ఫిబ్రవరి 5వ తేదీ వరకు హరీష్‌రావును అరెస్ట్ చేయొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పంజాగుట్ట పీఎస్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హైకోర్టులో హరీష్ రావు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో వచ్చేనెల 5న వాదనలు వినిపిస్తామన్న పీపీ పేర్కొన్నారు.కాగా, హైదరాబాద్ పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ నేత జి.చక్రధర్‌గౌడ్ హరీష్ రావుపై ఫిర్యాదు చేశారు. హరీష్ రావు తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని కంప్లైంట్‌లో పేర్కొన్నారు. తన ఫోన్‌తో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లను ఇంటెలిజెన్స్ విభాగం సహకారంతో ట్యాప్ చేశారని, దీని వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న హరీష్ రావు హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ చక్రధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో ఏ1గా హరీష్ రావు, ఏ2గా టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌ను పేర్కొన్నారు. దీంతో రాజకీయ కక్షతో తనపై ఇచ్చిన కేసును కొట్టివేయాలని కోరుతూ హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అరెస్ట్ చేస్తే తన రాజకీయ జీవితంతోపాటు ప్రతిష్ట దెబ్బతింటాయన్నారు.

## అల్లం చెరువులో మురుగునీరు చేరకుండా చర్యలు చేపట్టాలి

**- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**విశ్వంభర, కుత్బుల్లాపూర్ :** జీడిమెట్ల డివిజన్ దండముడి కాలనీకి అనుకొని ఉన్న అల్లంచెరువులోకిమురుగునీరు చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చెరువు పరిసరా ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అల్లం చెరువును కాకతీయ మిషన్ పథకం కింద రూ.40 లక్షల వ్యయంతో సుందరీకరణ చేసి, స్థానిక ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు అన్నీ సౌకర్యాలు కల్పించామన్నారు. ఎట్టి పరిస్థితిలో చెరువులో మురుగు నీరు చేరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు, కాలనీవాసులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

## ఆదివాసీల ఐక్యతకు ప్రతీక నాగోబా జాతర : కేసీఆర్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా జాతర ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీల ఐక్యతకు ప్రతీక నాగోబా జాతర అని కేసీఆర్ పేర్కొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ వేదికగా ఫిబ్రవరి 4వ తేదీ వరకు నాగోబా జాతర కొనసాగనుంది. తెలంగాణలో జరిగే ఈ ఆదివాసీ సంబురం తెలంగాణలో రెండో అతిపెద్ద జాతరగా పేరొందింది. మెస్రం వంశీయులు మంగళవారం నాగోబా జాతర పూజలను ప్రారంభించారు. గంగా జలాన్ని, ఆలయ ప్రాంగణంలోని మురాడి వద్దకు మెస్రం వంశీయులు తీసుకొచ్చారు. గ్రామంలోని పాత ఆలయం నుంచి నాగోబా విగ్రహాన్ని ఊరేగింపుగా గర్భగుడిలో భద్రపరిచారు. అనంతరం ఆలయ సమీపంలోని కోనేరు నుంచి మట్టి కుండల్లో నీటిని తీసుకువచ్చి పుట్టలు చేస్తారు.అర్ధరాత్రి 11:30 సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మెస్రం వంశీయులు పాల్గొంటారు. ఐదు రోజులపాటు జరిగే జాతరలో తెలుగు రాష్ట్రాల నుంచి కాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు.ఏటా పుష్యమాసంలో నెలవంక తొంగి చూడటంతోనే.. నాగోబా జాతరకు సన్నాహాలు మొదలవుతాయి. నెలవంక కనిపించిన రెండో రోజు మెస్రం వంశీయులు నాగోబాకు తొలిపూజలు చేస్తారు. తర్వాత ప్రత్యేకంగా తయారుచేసిన ప్రచార రథంలో వారం రోజులు గ్రామాల్లో తిరుగుతూ... జాతరకు హాజరు కావాల్సిందిగా మెస్రం వంశీయులను ఆహ్వానిస్తారు. జాతరకు పక్షం రోజుల ముందు ఈ మహత్తర క్రతువుకు శ్రీకారం చుడతారు. తమ దైవం నాగోబాకు అభిషేకానికి గానూ గంగాజలం తీసుకురావడానికి మెస్రం వంశీయులు ప్రయాణం అవుతారు. కేస్లాపూర్ నుంచి జన్నారం మండలం కలమడుగు వరకు దాదాపు వంద కిలోమీటర్లు కాలినడకన బయల్దేరి వెళ్తారు. అడవి దారిలో చెప్పుల్లేకుండా నడక సాగిస్తారు. అక్కడి హస్తలమడుగు దగ్గర పంచలింగాలకు పూజ చేసి 151 కలశాలతో గోదావరి జలాలను తీసుకొని కాలినడకన తిరుగు ప్రయాణం అవుతారు.

## ఏపీ మాజీ గవర్నర్ బిశ్వభూషణ్‌కు అస్వస్థత..


**హైదరాబాద్‌కు తరలింపు!**



**విశ్వంభర, అమరావతి:** ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మాజీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ హరిచందన్ పరిస్థితి క్రిటికల్‌గా ఉండటంతో.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన కుమారుడు, ఒడిశా రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు.ఒడిశాకు చెందిన బిశ్వభూషణ్ బీజేపీలో కీలకంగా వ్యవహరించారు. 2004 నుంచి 2009 మధ్య న్యాయ, రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. 2019 నుంచి 2023 వరకు బిశ్వభూషణ్ హరిచందన్ ఏపీకి గవర్నర్‌గా సేవలు అందించారు. 2023 ఫిబ్రవరి 23న ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. బిశ్వభూషణ్ హరిచందన్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గడిచిన 5 నెలల్లో ఆయన ఆస్పత్రిలో చేరడం ఇది రెండోసారి. అస్వస్థత కారణంగా గత ఏడాది సెప్టెంబర్‌లో ఆయన భువనేశ్వర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

## రెండు విడుతలుగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు..

**31న ప్రసంగించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**



**ఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31న ప్రారంభం కానున్నాయి. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడుతల్లో జరుగనున్న విషయం తెలిసిందే. తొలి విడత సమావేశాలు 31 నుంచి మొదలై.. ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఇక రెండో విడుత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. మంగళవారం విడుదలైన పార్లమెంటరీ బులిటెన్ ప్రకారం.. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్ 2025ను ప్రవేశపెడుతారు. అంతకుముందు రోజు రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం తర్వాత అరగంట తర్వాత.. రాజ్యసభ కార్యకలాపాలు మొదలవుతాయి.పార్లమెంట్ సమావేశాలకు ముందురోజు జనవరి 30న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాబోయే సమావేశాల్లో సభను సజావుగా నిర్వహించేందుకు ప్రతిపక్ష నాయకులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావించారు. రెండు సెషన్లలో పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం నెలకొంది. దాంతో పార్లమెంట్ ప్రతిష్ట దెబ్బతిందని.. ఈ సమావేశాల్లోనైనా ప్రతిపక్ష నాయకులు, ఇతర ఎంపీలు చర్చల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షం సహకరిస్తేనే పార్లమెంట్ పని చేయడంతో పాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈ సారి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెడుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సారి బడ్జెట్ బాగుటుందని అందరూ ఆశిస్తున్నారని తెలిపారు.

## మహా కుంభమేళాపై వివాదాస్పద వ్యాఖ్యలు..

**మల్లికార్జున్ ఖర్గేపై కోర్టులో ఫిర్యాదు..!**






**ఢిల్లీ:** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేపై బిహార్‌లోని ముజఫర్‌పూర్ కోర్టులో ఫిర్యాదు దాఖలైంది. ఈ కేసులో మధ్యప్రదేశ్‌లోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కుంభమేళా స్నానాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. స్థానిక న్యాయవాది సుధీర్ ఓజా కోర్టులో ఫిర్యాదు చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మనోభావాలను దెబ్బ తీశారని ఆయన ఆరోపించారు. రాజకీయ లాభం కోసం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు సనాతన హిందువుల మనోభావాలతో ఆటలాడారన్నారు. ఖర్గే వ్యాఖ్యలు హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు విచారణను ఫిబ్రవరి 3న విచారించేందుకు కోర్టు నిర్ణయించింది. ఫిర్యాదులో మతపరమైన మనోభావాలను దెబ్బతీయడంతో పాటు ప్రజాశాంతికి భంగం కలిగించినట్లు ఆరోపించారు.కేసుపై కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించలేదు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో సోమవారం స్నానం చేశారు. దీనిపై మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. గంగానదిలో స్నానం చేయడం వల్ల పేదరికం అంతమవుతుందా? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు కెమెరాల కోసం స్నానం చేసేందుకు పోటీపడుతున్నారని ఆరోపించారు. మోవ్‌లో జరిగిన 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' ర్యాలీలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, తాను ఎవరి విశ్వాసాలను ప్రశ్నించడం లేదన్న ఆయన.. తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధిస్తే క్షమాపణలు చెబుతున్నానన్నారు. పిల్లలు ఆకలితో చనిపోతున్నారని.. పాఠశాలలకు వెళ్లడం లేదని.. కార్మికులకు జీతాలు అందడం లేదన్న ఆయన.. వేలాది రూపాయలు ఖర్చు చేసి గంగానదిలో స్నానం చేసేందుకు పోటీపడుతున్నారన్నారు. దేవుడిపై తనకు నమ్మకం ఉందన్న ఆయన.. మతం పేరుతో పేదలను దోపిడీ చేయడాన్ని సహించబోమన్నారు.









# గులాబీమయమైన పోరుగడ్డ

ఆనాడు నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. నల్గొండ క్లాక్‌టవర్ కూడలిలో బీఆర్ఎస్ రైతు మహా ధర్నా నిర్వహించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. తొలుత నాగార్జున కళాశాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ నివాళులర్పించారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో నల్లగొండ గులాబీమయమైంది. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ''రైతు బంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.73 వేల కోట్లు ఇచ్చింది. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవంగా మారడానికి కారణం కాంగ్రెస్. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అవుతుందని కేసీఆర్ ఎప్పుడో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతుబంధు నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది'' అని కేటీఆర్ విమర్శించారు. - విశ్వంభర, నల్లగొండ










## ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా బుమ్రా..

### తొలి భారత పేసర్‌గా రికార్డు



**ముంబయి:** భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్‌ను ప్రతిష్టాత్మక ఐసీసీ అవార్డు వరించింది. ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ (2024) అవార్డుకు బుమ్రా ఎంపికయ్యాడు. సర్ గ్యారిఫీల్డ్ సోబర్స్ పేరిట ఇచ్చే ఈ పురస్కారం కోసం బుమ్రాతోపాటు జో రూట్, హ్యారీ బ్రూక్ (ఇంగ్లాండ్), ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) పోటీపడ్డారు. చివరకు భారత పేసర్ మేటి ఆటగాడిగా ఎంపికయ్యాడు. బుమ్రా ఐసీసీ టెస్టు జట్టులోనూ చోటు దక్కించుకున్నాడు. 2024 టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గానూ నిలిచాడు. గతేడాది టెస్టుల్లో బుమ్రా అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. 13 మ్యాచ్‌ల్లో 71 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలోనే 2024లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు.

**తొలి పేసర్‌గా రికార్డు..**

ఈ క్రమంలోనే ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు గెలిచిన తొలి భారత పేసర్‌గా రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా ఐదో భారత క్రికెటర్‌గా నిలిచాడు. అంతకుముందు రాహుల్ ద్రవిడ్ (2004), సచిన్ తెందూల్కర్ (2010), రవిచంద్రన్ అశ్విన్ (2016), విరాట్ కోహ్లీ (2017, 2018) ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

## జోఫ్రా ఆర్చర్‌ను అడ్డుకొనేందుకు సంజు 'స్పెషల్' ట్రైనింగ్!



**లండన్:** ఇంగ్లండ్‌తో తొలి రెండు టీ20ల్లో భారత ఓపెనర్ సంజు శాంసన్ పెద్దగా ప్రభావం చూపించలేదు. తొలి మ్యాచ్‌లో 26 పరుగులు చేసినా.. దానిని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. ఇక రెండో టీ20లో ఐదు పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. రెండుసార్లూ జోఫ్రా ఆర్చర్‌కే వికెట్ ఇచ్చాడు. షార్ట్ పిచ్ బంతులను ఆడటంలో ఇబ్బందిపడ్డాడు. రాజ్‌కోట్ వేదికగా జరగబోయే మూడో టీ20లో అలాంటి అవకాశం ఆర్చర్‌కు ఇవ్వకూడదనే ఉద్దేశంతో సంజు తీవ్ర సాధన చేశాడు. సిమెంట్ పిచ్‌పై కొత్త బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌తో కలిసి బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. త్రోడౌన్ స్పెషలిస్టులు కూడా అతడికి సాయం చేశారు. దాదాపు 45 నిమిషాల పాటు కేవలం ప్లాస్టిక్ బంతితోనే పుల్, హుక్ షాట్లను ఆడాడు. అదే విధంగా ర్యాంప్, కట్ షాట్లను కొట్టాడు. ఆ తర్వాత మరో అర్ధగంటపాటు క్లైంబింగ్ బాల్ (వేలాడదీసిన బంతులు)తో ప్రాక్టీస్ చేశాడు.

షమీ లేనట్లే.. దూబె వచ్చేసినట్లే!

ఇంగ్లండ్‌తో మూడో టీ20లో భారత తుది జట్టుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత మ్యాచ్‌తో పోలిస్తే మరోసారి మార్పులు ఉండే అవకాశం ఉంది. రెండో టీ20లో ధ్రువ్ జురెల్ ప్రభావం చూపించలేదు. అతడి స్థానంలో శివమ్ దూబెకు అవకాశం ఇవ్వనుంది. నితీశ్ కుమార్ రెడ్డి గాయం కారణంగా సిరీస్‌కు దూరమైన సంగతి తెలిసిందే. దూబెను జట్టులోకి తీసుకుంది. దూబె ఉండటం వల్ల మీడియం పేసర్ అందుబాటులో ఉన్నట్లవుతుంది. మరోవైపు షమీ పూర్తి స్థాయిలో ఫిట్‌గా ఉన్నప్పటికీ.. ఈ మ్యాచ్‌లో అతడు ఆడటం కష్టమేనని సమాచారం. మిగతా జట్టులో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. ఇప్పటికే ఇంగ్లండ్ తమ ఫైనల్ XIను ప్రకటించిన సంగతి తెలిసిందే.

తుది జట్లు

భారత్ (అంచనా): సంజు శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్

ఇంగ్లండ్: బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ (వికెట్ కీపర్), జోస్ బట్లర్ (కెప్టెన్), హ్యారీ బ్రూక్, లియామ్ లివింగ్‌స్టోన్, జేమీ స్మిత్, జేమీ ఓవర్టన్, బ్రైడన్ కార్స్, జోఫ్రా ఆర్చర్, అదిల్ రషీద్, మార్క్ వుడ్.

### త్రిష ఆల్ రౌండ్ ప్రదర్శన..

# స్కాట్లాండ్‌పై భారత్ ఘన విజయం



**కౌలాలంపూర్:** అండర్ 19 మహిళల వరల్డ్ కప్‌లో భారత అమ్మాయిలకు ఎదురులేకుండా పోయింది. సూపర్ సిక్స్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించంది. తెలుగు క్రికెటర్ గొంగడి త్రిష ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట బ్యాటింగ్‌లో సెంచరీ చేసిన త్రిష.. బౌలింగ్‌లోనూ కీలకమైన మూడు వికెట్లు పడగొట్టింది. దీంతో స్కాట్లాండ్‌ను భారత్ 150 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో స్కాట్లాండ్ 14 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలిపోయింది. ఓపెనర్లు పిప్పా (12), వాల్‌సింగమ్ (12), పిప్పా స్ప్రౌల్ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. భారత్ బౌలర్లలో శుక్ల 4 వికెట్లు పడగొట్టగా, వైష్ణవి శర్మ, త్రిష చెరో 3 వికెట్లు తీశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన త్రిషకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వచ్చింది. వరల్డ్ కప్‌లో ఇప్పటికే భారత్ సెమీస్ చేరిన సంగతి తెలిసిందే. జనవరి 31న సెమీ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

**అదరగొట్టిన త్రిష**

తెలుగు యువ క్రికెటర్ గొంగడి త్రిష (110*: 59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సులు) రికార్డు సెంచరీ బాదింది. కేవలం 53 బంతుల్లోనే శతకం చేసింది. దీంతో అండర్19 టీ20ల్లో తొలి సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించింది. ఈ టోర్నీలో ప్రతి మ్యాచ్‌లోనూ త్రిష నాణ్యమైన ఆటతీరుతో అభిమానులను అలరిస్తోంది. ఇప్పటికే సెమీస్‌కు చేరుకున్న భారత్.. సూపర్ సిక్స్‌లో తన చివరి మ్యాచ్‌లోనూ భారీ స్కోరు చేసింది. ఇది కూడా అండర్ 19 టీ20ల్లో రికార్డే. ఓపెనర్లు త్రిష కమలిని కలిసి తొలి వికెట్‌కు 147 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీ తర్వాత కమలిని ఔటైనా.. భారత ఇన్నింగ్స్ మాత్రం ఆగలేదు. సానికాతో కలిసి చివరి వరకూ క్రీజ్‌లో ఉన్న త్రిష రెండో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. ఈ క్రమంలో అండర్ 19 వరల్డ్ కప్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా ఘనత సాధించింది.

**క్రికెట్ చరిత్రలోనే ఏకైక ప్లేయర్**

ఈ సంచలన ఇన్నింగ్స్‌తో త్రిష క్రికెట్ చరిత్రలోనే అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఒక టీ20 మ్యాచ్‌లో శతకం చేయడంతోపాటు మూడు వికెట్లు పడగొట్టిన తొలి క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది.

## ఇంగ్లాండ్‌తో మూడో టీ20లో ఓటమిపాలైన టీమ్‌ఇండియా



**రాజ్‌కోట్:** వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీదున్న టీమ్‌ఇండియాకు ఇంగ్లాండ్ కళ్లెం వేసింది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో మ్యాచ్‌లో టీమ్‌ఇండియాపై ఇంగ్లాండ్ 26 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో పర్యటక జట్టు సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. 172 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా 9 వికెట్లు కోల్పోయి 145 పరుగులకే పరిమితమైంది. భారత బ్యాటర్లలో హార్దిక్ పాండ్య (40; 35 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఒక్కడే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. అభిషేక్ శర్మ (24), సూర్యకుమార్ యాదవ్ (14), అక్షర్ పటేల్ (15) పెద్దగా రాణించలేదు.

గత మ్యాచ్ సెంచరీ హీరో తిలక్ వర్మ (18) ఈ సారి ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. సంజు శాంసన్ (3), వాషింగ్టన్ సుందర్ (6), ధ్రువ్ జురెల్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమీ ఓవర్టన్ 3 వికెట్లు పడగొట్టగా.. జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్సే చెరో 2 వికెట్లు పడగొట్టారు. రషీద్, మార్క్‌వుడ్ తలో వికెట్ తీశారు. ఈ సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 21తో ఆధిక్యంలో ఉంది. నాలుగో టీ20 శుక్రవారం (జనవరి 31) పుణె వేదికగా జరగనుంది.తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఓపెనర్ బెన్ డకెట్ (51; 28 బంతుల్లో) అర్ధ శతకం చేయగా.. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ లివింగ్‌స్టన్ (43; 24 బంతుల్లో) దూకుడుగా ఆడాడు. జోస్ బట్లర్ (24) పరుగులు చేశాడు. టెయిలెండర్లు ఆదిల్ రషీద్ (10), మార్క్ వుడ్ (10) కీలక పరుగులు రాబట్టారు. భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/24) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. రవి బిష్ణోయ్ 4 ఓవర్లలో ఒక వికెట్ పడగొట్టి 46 పరుగులు సమర్పించుకున్నాడు. హార్దిక్ పాండ్య 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ పడగొట్టారు.

## కివీస్ ఆల్‌రౌండర్ మెలీ కెర్‌కు ఐసీసీ వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు



**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ మెలీ కెర్‌ను.. ఐసీసీ వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది. ప్రతిష్టాత్మకమైన రేచల్ హేహో ఫ్లింట్ ట్రోఫీకి ఆమె ఎంపికైంది. 2024లో అద్భుతమైన మహిళా క్రికెటర్‌గా ఆమె రికార్డుకెక్కింది. క్రికెట్‌కు చెందిన మూడు ఫార్మాట్లలో కెర్ గత ఏడాది అద్భుత ప్రదర్శన ఇచ్చింది. రేచల్ హేహో ఫ్లింట్ అవార్డు కోసం లౌరా వోల్వార్డ్, చామరి ఆటపట్టు, అన్నాబెల్ సుదర్‌లాండ్ పోటీపడ్డారు. కానీ కివీస్ క్రికెటర్‌ను ఆ అవార్డు వరించింది.మూడు ఫార్మాట్లలోనూ ఆమె వరల్‌డ్‌క్లాస్ ఆల్‌రౌండర్‌గా నిలిచింది. ప్రపంచంలోని మేటి మహిళా లెగ్ స్పిన్ బౌలర్‌గా కెర్ కీర్తికెక్కింది. బ్యాటింగ్‌లోనూ కివీస్ లైనప్‌ను మరింత పటిష్టం చేసింది. మిడిల్ ఆర్డర్‌లో బలమైన బ్యాటర్‌గా కీలక ఇన్నింగ్స్ ఆడింది. రేచల్ హేహో ఫ్లింట్ ట్రోఫీ అవార్డును 2017 నుంచి ప్రకటిస్తున్నారు. ఎలిసీ పెర్రీ(ఆస్ట్రేలియా), స్మృతి మంధాన(ఇండియా), స్కీవర్ బ్రుంట్ (ఇంగ్లండ్) ఇప్పటి వరకు ఈ అవార్డును గెలుచుకున్నారు.రేచల్ అవార్డును గెలుచుకున్న తొలి కివీస్ ప్లేయర్‌గా కెర్ నిలిచింది. ఐసీసీ మహిళా క్రికెటర్ అవార్డును కూడా గెలవడం కివీస్ క్రికెటర్‌కు ఇదే మొదటిసారి. 2024లో 9 వన్డేలు ఆడిన కెర్.. వాటిల్లో 33 సగటుతో 264 రన్స్ చేసింది. ఆ ఫార్మాట్‌లో 14 వికెట్లు కూడా తీసింది. టీ20 మ్యాచుల్లో అద్భుత ప్రదర్శన ఇచ్చిన కెర్... 18 మ్యాచుల్లో 387 రన్స్ స్కోర్ చేసింది. ఆ తర్వాత 29 వికెట్లను కూడా తీసుకున్నది. మహిళల టీ20 వరల్‌డ్‌కప్‌లో అత్యధికంగా 15 వికెట్లు తీసుకున్నది.

## విరాట్ కోహ్లీ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్!




**ముంబయి:** దాదాపు 13 ఏళ్ల తర్వాత విరాట్ కోహ్లీ రంజీల్లోకి అడుగుపెట్టబోతున్నాడన్న వార్తలు వచ్చాయి. దిల్లీ తరఫున జనవరి 30 నుంచి రైల్వేస్‌తో జరగబోయే మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఇప్పటికే కోహ్లీ పేరును దిల్లీ జట్టులో చేర్చిన సంగతి తెలిసిందే. ఆయుష్ బదోని నాయకత్వంలో దిల్లీ జట్టు బరిలోకి దిగనుంది. చివరిసారిగా 2012లో ఉత్తర్‌ప్రదేశ్‌పై రంజీ మ్యాచ్ ఆడాడు. అయితే, ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో ప్రతిఒక్కరూ ఆడాలనే బీసీసీఐ నిబంధనల నేపథ్యంలో ఇప్పటికే రోహిత్, యశస్వి, రిషభ్ పంత్, గిల్ ఆడారు. ఇప్పుడు విరాట్ కోహ్లీ కూడా ఇదే బాటలోకి వచ్చాడు. ఢిల్లీ కెప్టెన్సీ బాధ్యతలను కోహ్లీ తిరస్కరించాడని సమాచారం. అయితే, అతడి ఆటను మరోసారి చూద్దామనే అభిమానులకు షాక్ తగలనుంది. రోహిత్ ప్రాతినిధ్యం వహించిన ముంబయి మ్యాచ్‌ను బీసీసీఐ లైవ్ కవరేజీ ఇచ్చింది. కేవలం ఓటీటీకే పరిమితమైంది. ఇప్పుడు దిల్లీ మ్యాచ్‌కు మాత్రం అలాంటి అవకాశం ఉండొకపోవచ్చని సమాచారం. ఈవిషయంపై దిల్లీ క్రికెట్ సంఘం స్పందించింది.

**బుమ్రాదే టెస్టు కిరీటం..**

''బీసీసీఐ ఏమైనా చివరి నిమిషంలో లైవ్ కవరేజీకి ఏర్పాట్లు చేస్తుందేమో తెలియదు. ఇప్పటివరకైతే మాకు ఎలాంటి సమాచారం లేదు. సాధారణంగా పెద్ద మ్యాచ్‌లకు లైవ్ టెలీకాస్ట్ లేదా ఓటీటీ స్ట్రీమింగ్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో తమిళనాడుతో మ్యాచ్‌ను లైవ్ ఇచ్చిన సందర్భం ఉంది. బ్రాడ్‌కాస్ట్‌ను రోస్టర్ పద్ధతిలో చేసేందుకు ముందుగానే నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది'' అని దిల్లీ క్రికెట్ సంఘం అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజుల్లోనే మ్యాచ్ ప్రారంభం కానున్నవేళ.. లైవ్ ఇవ్వడానికి అవసరమైన సిస్టమ్‌ను ఏర్పాటుచేయాలంటే కాస్త సవాల్‌తో కూడుకున్న వ్యవహారమే. మల్టీ కెమెరా సెటప్‌ను సిద్ధం చేయాల్సిఉంటుంది.

ఢిల్లీ రైల్వేస్ మ్యాచ్‌ను లైవ్ కవరేజీలో చూసే అవకాశం లేనప్పటికీ.. కర్ణాటక హరియాణా మ్యాచ్‌ను వీక్షించొచ్చు. రోస్టర్ పద్ధతిలో ఈ మ్యాచ్‌కు లైవ్ ఇవ్వనున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. కర్ణాటక తరఫున కేఎల్ రాహుల్ బరిలోకి దిగనున్నట్లు సమాచారం. ''రంజీ ట్రోఫీ తదుపరి రౌండ్‌లో కర్ణాటక హరియాణా మ్యాచ్‌ను లైవ్ టెలికాస్ట్ చేయనుంది. అదేవిధంగా మరో రెండు మ్యాచ్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈడెన్ గార్డెన్స్‌లో బెంగాల్ పంజాబ్ జట్ల మధ్య మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. మరో మ్యాచ్ ఉన్నప్పటికీ అది దిల్లీ మ్యాచ్ కాదు'' అని బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు.

# మహాకుంభమేళాలో కోట్ల జనం ఉన్నా.. లేదు నెట్‌వర్క్ చింత!



**ప్రయాగ్‌రాజ్:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా జరుగుతోంది. ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు లక్షలాది మంది తరలివస్తున్నారు. ఇంతమందికి సౌకర్యాలు కల్పించడమంటే మాటలా? అంతేకాదు ఇంతమందికి ఎలాంటి అంతరాయం లేకుండా టెలికాం సేవలు అందించడమూ కత్తిమీద సామే. అలాంటిది భక్తజనం పోటెత్తుతున్నా కాల్స్‌కు అంతరాయం లేకుండా, మెరుగైన ఇంటర్నెట్ సేవల్ని స్థానిక యంత్రాంగంతో కలిసి టెలికాం కంపెనీలు అందిస్తున్నాయి. మహా కుంభమేళాకు వచ్చే ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా నెట్‌వర్క్ సేవల్ని అందించాలనే లక్ష్యంతో దాదాపు అన్ని టెలికాం సంస్థలు ఈ ప్రాంతంలో తమ సేవల్ని పెంచుకున్నాయని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ అండ్ కమాండ్ సెంటర్ (ICCC) నిర్వాహకులు తెలిపారు. ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్ ఐడియా కలిసి కుంభమేళా జరిగే ప్రాంతంలో మూడు విపత్తు ప్రతిస్పందన నిర్వహణ కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్ కోసం, సంక్షోభ పరిస్థితుల్లో వెంటనే చర్యలు చేపట్టేందుకు ఇవి సాయం చేస్తాయని తెలిపారు. అంతేకాదు టెలికాం ప్రొవైడర్లు 53 వరకు సహాయక కేంద్రాల్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

'డీప్‌సీక్' పని తీరు ఆకట్టుకుంటోంది.. ఓపెన్ ఏఐ సీఈఓ ప్రశంస

ప్రయాగ్‌రాజ్‌లో కొత్తగా 328 టవర్లు, మొత్తం 328 బీటీఎస్‌లు ఏర్పాటు చేశారు. హై స్పీడ్ నెట్‌వర్క్ కవరేజ్ అందించేందుకు 92 కిలోమీటర్ల వరకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ వేశారు. కుంభమేళాలో పొరపాటున ఎవరైనా తప్పిపోతే వారి సమాచారం తెలుసుకొనేందుకు నెట్‌వర్క్ సదుపాయం అనేది కీలకం. దీంతో టెలికాం సంస్థలు తమ నెట్‌వర్క్ సేవల్ని మెరుగుపరుచుకున్నాయి. ఎయిర్‌టెల్ కొత్తగా 287 సైట్స్ (టవర్స్), 78 సెల్స్ ఆన్ వీల్స్ ఏర్పాటు చేసింది.

మునుపటి కుంభమేళాతో పోలిస్తే ప్రస్తుతం నెట్‌వర్క్ సదుపాయం మెరుగ్గా ఉందని మహాకుంభ్ నగర్ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ వివేక్ చతుర్వేది తెలిపారు. డిజిటల్ పేమెంట్ సదుపాయం ఉండటంతో డబ్బును వెంట తీసుకెళ్లే సమస్య లేదన్నారు. ఇక ఏదైనా సమస్య ఎదురైతే అధికారులకు సమాచారం అందించడం కూడా ప్రస్తుతం సులువుగా మారిందన్నారు. పన్నెండేళ్లకు ఒకసారి జరిగే ఈ కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. ఈ వేడుక ముగింపు నాటికి 40 కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అంచనా. ఇలా 45 రోజుల పాటు ఈ జరగనుంది. ఇప్పటి వరకు 8 కోట్ల మంది భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం మౌని అమావాస్య (జనవరి 29) రోజు సుమారు 10 కోట్ల మంది భక్తులు తరలివస్తారని అంచనా.

## క్రెడ్‌లో ఇ-రూపీ వాలెట్.. తొలుత ఈ మెంబర్స్‌కే

**ముంబయి:** క్రెడిట్ కార్డు చెల్లింపులకు ప్రసిద్ధి చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ క్రెడ్ సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్టులో భాగమైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , యెస్ బ్యాంక్‌తో కలిసి అయిన ఇ రూపీ వాలెట్ బీటా వెర్షన్‌ను ప్రారంభించినట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. ఇరూపీ వాలెట్ అందిస్తున్న తొలి ఫిన్‌టెక్ సంస్థగానూ నిలిచింది. తొలుత బీటా వైట్ లిస్ట్ చేసిన క్రెడ్ మెంబర్లకు ఇరూపీ వాలెట్‌ను అందిస్తోంది. వాలెట్ వినియోగించాలంటే వీడియో కేవైసీ పూర్తి చేసి ఉండాలి. అప్పుడే యూపీఐ ద్వారా నగదును లోడ్ చేసుకోవచ్చు. ఒకసారి రూ.10 వేలు, ఒకరోజులో గరిష్ఠంగా రూ.50వేల వరకు డిజిటల్ కరెన్సీని పంపుకోవచ్చు. వాలెట్‌లో లక్ష రూపాయల వరకు లోడ్ చేసుకోవచ్చు. పిన్ లేకుండా రూ.500 వరకు పంపుకోవచ్చు. మర్చంట్ లావాదేవీలు సైతం ఎలాంటి ఫీజూ చెల్లించాల్సిన అవసరం లేదు. రాబోయే కొన్ని నెలల్లో అందరు క్రెడ్ సభ్యులకు ఈ సదుపాయం అందుబాటులోకి తేనున్నట్లు కంపెనీ తెలిపింది.మార్కెట్‌లో నగదు చెల్లింపులు తగ్గించి, డిజిటల్ చెల్లింపులను మరింత అందిపుచ్చుకోవడానికి ఆర్‌బీఐ ఎంతో దూరదృష్టితో ఇరూపీని తీసుకొచ్చిందని క్రెడ్ వ్యవస్థాకుడు కునాల్ షా పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ సామర్థ్యాన్ని ఇది బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. డిజిటల్ కరెన్సీ అనేది ప్రస్తుత కరెన్సీ నోట్లకు డిజిటల్ రూపం మాత్రమే. అదనపు చెల్లింపు అవకాశాలను కల్పించేందుకు సీబీడీసీని తీసుకొచ్చేందుకు 2022లో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. వివిధ బ్యాంకులతో కలిసి ప్రయోగాత్మకంగా లావాదేవీలు జరుగుతున్నాయి.

# బ్యాంక్ స్టాక్స్‌లో కొనుగోళ్ల ఉత్సాహం.. లాభాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నా దేశీయంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు భారీగా లాభపడ్డాయి. బ్యాంకింగ్ వ్యవస్థలోకి నిధులను జొప్పించేందుకు రూ.60వేల కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీస్‌ను బహిరంగ మార్కెట్ కార్యకలాపాల (ఓఎంఓ) ద్వారా కొనుగోలు చేయనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించడం ఇందుకు నేపథ్యం.ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, బ్యాంక్ యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో ఓ దశలో 1100 పాయింట్ల మేర లాభపడిన సెన్సెక్స్.. ఆఖర్లో అమ్మకాల వెల్లువెత్తడంతో 535 పాయింట్లకే పరిమితమైంది. ఇంట్రాడేలో నిఫ్టీ 23,100 మార్కు దాటినా చివరికి 23 వేల దిగువనే ముగిసింది. అదే సమయంలో బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం నష్టాల్లో ముగియడం గమనార్హం. ఉదయం సెన్సెక్స్ 75,659.00 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,366.17) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 76,512.96 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 535.24 పాయింట్ల లాభంతో 75,901.41 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 128.10 పాయింట్ల లాభంతో 22,957.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 22 పైసలు బలహీన పడి 86.53 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌ఎసీ బ్యాంక్, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. సన్‌ఫార్మా, ఎల్‌అండ్‌టీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 77 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2748 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**ఇతర కారణాలు**

ఇటీవల కాలంలో మార్కెట్లు భారీగా పతనమైన నేపథ్యంలో ఇదే సదవకాశంగా భావించి మదుపర్లు కొనుగోళ్లకు దిగడం నేడు మార్కెట్ పెరగడానికి ఓ కారణమని నిపుణులు చెబుతున్నారు.

ఇటీవల కాలంలో లార్జ్‌క్యాప్ స్టాక్స్ విలువలు సైతం క్షీణించడంతో ఎంపిక చేసిన స్టాక్స్‌లో కొనుగోళ్ల ఉత్సాహానికి కారణమని విశ్లేషిస్తున్నారు.

విశ్వంభర
V3 NEWS

# 'మాస్ జాతర' గ్లింప్స్ విడుదల



మాస్ మహారాజా రవితేజ కథనాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పుడు ఈ చిత్రం నుంచి గ్లింప్స్ విడుదలైంది.

రవితేజ పుట్టినరోజు సందర్భంగా, 'మాస్ జాతర' గ్లింప్స్ ను చిత్ర బృందం ఆవిష్కరించింది. ఈ గ్లింప్స్, అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న మునుపటి అసలు సిసలైన మాస్ మహారాజా రవితేజను గుర్తు చేసేలా ఉంది. తనదైన కామెడీ టైమింగ్, విలక్షణ డైలాగ్ డెలివరీ, ఎనర్జీకి పెట్టింది పేరు రవితేజ. రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విందు భోజనం లాంటి మాస్ ఎంటర్టైనర్ గా మాస్ జాతర రూపొందుతోందని గ్లింప్స్ ను చూస్తే అర్థమవుతోంది.


దర్శకుడు భాను బోగవరపు మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా ఆకర్షణీయంగా 'మాస్ జాతర' గ్లింప్స్ ను మలిచారు. మాస్ మహారాజాగా రవితేజ మాస్ ప్రేక్షకులకు ఎందుకు అంతలా చేరువయ్యారో ఈ గ్లింప్స్ మరోసారి రుజువు చేస్తోంది. సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం, రవితేజ ఎనర్జీకి ఏమాత్రం తగ్గకుండా ఉండటమే కాకుండా, గ్లింప్స్ కు ప్రధాన బలంగా ఉంది.

'మాస్ జాతర' చిత్రాన్ని మాసివ్ ఎంటర్టైనర్‌గా మలచడానికి ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ప్రముఖ ఛాయాగ్రాహకుడు విధు అయ్యన్న కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. నందు సవిరిగాన సంభాషణలు సమకూర్చారు.

ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. రవితేజశ్రీలీల జోడి 'ధమాకా'తో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. వీరి కలయికలో 'మాస్ జాతర' రూపంలో మరో బ్లాక్ బస్టర్ అందుకోవడం ఖాయమని చిత్ర బృందం నమ్మకంగా ఉంది.

తాజాగా విడుదలైన గ్లింప్స్ 'మాస్ జాతర' చిత్రంపై అంచనాలను రెట్టింపు చేసింది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి.

# క్యాస్టింగ్ కౌచ్‌పై 'దంగల్' నటి షాకింగ్ కామెంట్స్



బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఒక్క సినిమాతో రాత్రికి రాత్రే స్టార్‌గా మారిపోయారామె. అలాగే చాలా తక్కువ సమయంలోనే మంచి నటిగా కూడా గుర్తింపు పొందారు. బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ నటించిన 'దంగల్' మూవీతో తెరంగేట్రం చేసిన ఫాతిమా.. ఆ తర్వాత కూడా మంచి చిత్రాల్లో అవకాశాలు దక్కించుకున్నారు.

అయితే, తన కెరీర్ తొలినాళ్లలో ఎదురైన కాస్టింగ్ కౌచ్ అనుభవాలను తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. ఈ క్రమంలో సౌత్ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ గురించి కూడా ఫాతిమా షాకింగ్ కామెంట్స్ చేశారు.

ఫాతిమా మాట్లాడుతూ... "నా కెరీర్ తొలినాళ్లలో ఒక సినిమా కోసం ఆడిషన్‌కు వెళ్లాను. అక్కడ మీరు ఏం చేయడానికైనా రెడీనా..? అంటూ ఓ దర్శకుడు నన్ను అడిగాడు. కష్టపడి పనిచేస్తానని.. నా పాత్ర కోసం ఏం కావాలో అది చేస్తానని అతనితో చెప్పా. కానీ, అతను మాత్రం అదే ప్రశ్న మళ్లీ మళ్లీ అడిగాడు. నాకు అతని ఉద్దేశం అర్థమైంది. కానీ, అతడు ఎంతకు దిగజారుతాడో చూద్దామని నేను ఏమీ తెలియనట్లే ప్రవర్తించాను" అని ఫాతిమా తనకు ఎదురైన చేదు అనుభవం గురించి వివరించారు.

ఇక దక్షిణాది సినీ పరిశ్రమలో నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి ఓపెన్‌గా మాట్లాడుకుంటారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా దక్షిణాది సినిమాలో అవకాశం కోసం హైదరాబాద్‌కు వచ్చినప్పుడు తనకు ఎదురైన ఓ అనుభవాన్ని గుర్తు చేశారు.

హైదరాబాద్‌లో ఓ నిర్మాతను కలిసిన సమయంలో అనుభవాన్ని పంచుకుంటూ.."నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడుతారు. మీకు తెలుసా.. ఇక్కడ మీరు కొందరిని కలవాల్సి ఉంటుంది అనేవాళ్లు. ఆ విషయం నేరుగా చెప్పేవాళ్లుకాదు. ఎలా చెప్పినా వారి ఉద్దేశమైతే అదే అని తెలిసిపోయేది" అని ఫాతిమా తెలిపారు. దీంతో ప్రస్తుతం ఆమె కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

కాగా, ఫాతిమా సనా షేక్.. కమల్ హాసన్ హిందీ మూవీ 'చాచీ 420'లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కూడా కనిపించారు. ఆ తర్వాత 'దంగల్' మూవీతో తెరంగేట్రం చేసిన ఆమె.. 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్', 'లూడో', 'అజీబ్ దాస్తాన్స్', 'థార్', 'సామ్ బహదూర్' వంటి చిత్రాలలో నటించి మంచి గుర్తింపు పొందారు.

# రాజా మార్కండేయ ఆడియో విడుదల



శ్రీ జగన్మాత రేణుకా క్రియేషన్స్, ఫోర్ ఫౌండర్స్ పతాకాలపై బన్నీ అశ్వంత్ దర్శకత్వంలో సామా శ్రీధర్, పంజాల వెంకట్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "రాజా మార్కండేయ". గౌరిశెట్టి శ్రీనివాస్, బన్నీ అశ్వంత్ కో ప్రొడ్యూసర్స్. ఎస్ కే మీరావలి , రాయారావు విశ్వేశ్వరరావు , సత్యదీప్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రం ఆడియో ఆవిష్కరణ సోమవారం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఆత్మీయ అతిథుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ హీరో సుమన్, ప్రతాని రామకృష్ణ గౌడ్, హీరో తేజస్ వీరమాచినేని, హీరోయిన్స్ రోమి, దేవిక, ప్రత్యూష, దర్శకుడు బన్నీ ఆశ్వంత్, నిర్మాతలు సామా శ్రీధర్, పంజల వెంకట్ గౌడ్, సహ నిర్మాతలు గౌరిశెట్టి శ్రీనివాస్, మాజీ టూరిజం చైర్మెన్ శ్రీనివాస్ గుప్తా, హైకోర్ట్ అడ్వకేట్ రాపోలు భాస్కర్, హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ, సామాజికవేత్త ప్రొడ్యూసర్ డాక్టర్ మూసా అలీ ఖాన్, కటకం శ్రీనివాస్ గుప్తా, ఇన్స్టా ఫేమ్ కవిరాజ్ దంపతులు, ప్రముఖ సామాజికవేత్త గంగాపురం పద్మా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. చిత్రంలోని ఒక్కో పాటను విచ్చేసిన అతిథులు ఆవిష్కరించగా.. టీజర్‌ను రాపోలు భాస్కర్ విడుదల చేశారు. సినిమా ట్రైలర్ ను హీరో సుమన్ రిలీజ్ చేశారు.

అనంతరం హీరో సుమన్ మాట్లాడుతూ.. "రాజా మార్కండేయ" సినిమా సాంగ్స్ అన్నీ చాలా బాగున్నాయి. టీజర్, ట్రైలర్ చూస్తుంటే మంచి కంటెంట్ ను నమ్ముకొని తీసినట్టు వుంది. అందరూ కొత్తవాళ్ళైనా సినిమాలో మంచి కథ వుందని అర్థం అవుతుంది. ఇలాంటి కొత్త వాళ్ళని ఎంకరేజ్ చేయాలి. అప్పుడే మంచి సినిమాలు వస్తాయి. చిత్రంలో శివయ్య పాట చాలా అద్భుతంగా ఉంది. రాబోయే శివరాత్రి పండుగకు ప్రతి దేవాలయంలో ఈ పాట మార్మోగుతుంది" అన్నారు.

దర్శకుడు బన్నీ ఆశ్వంత్ మాట్లాడుతూ.. "ఇరవై సంవత్సరాలుగా ఇండస్ట్రీలో వున్నాను. ఎన్నో కష్టాలు పడ్డాను. సినిమా తీయాలని నా కల. నాకు సహకరించి ప్రోత్సహించిన మా నిర్మాతలకు, స్నేహితులకి ధన్యవాదాలు. శివుడి భక్తుడైన మార్కండేయ జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయి? వాటిని శివుడి అనుగ్రహంతో ఎలా అధిగమించాడు? అనేది కాన్సెప్ట్. మీరావలి మంచి సంగీతాన్ని అందించారు. లైఫ్ లాంగ్ కొత్త వారికి అవకాశాలు కల్పిస్తూ సినిమాలు తీయాలన్నదే నా ధ్యేయం" అన్నారు.

నిర్మాతల్లో ఒకరైన సామా శ్రీధర్ మాట్లాడుతూ.. "మా బన్నీ ఆశ్వంత్ వల్లే ఈ సినిమాని నిర్మించగలిగాం. కథని నమ్ముకొని తీసిన సినిమా ఇది. హీరో తేజస్, హీరోయిన్స్ రోమీ, దేవిక, ప్రత్యూష, టెక్నీషియన్స్ ప్రతి ఒక్కరూ సినిమా కోసం అహర్నిశలు కష్టపడ్డారు.ఆడియెన్స్ కి ఈ చిత్రం కచ్చితంగా నచ్చుతుంది" అన్నారు.

# రమేష్ స్టూడియోస్‌ను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



మణికొండలోని ఓయూ కాలనీలో రమేష్ స్టూడియోస్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఈ రమేష్ స్టూడియోస్ ను అలాగే డీఐ సూట్ ఓపెన్ చేశారు. తెలుగు చిత్ర నిర్మాత మండలి ప్రెసిడెంట్, ఫిలిం ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ చేతుల మీదుగా డబ్బింగ్ థియేటర్ ప్రారంభించారు. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఎడిటింగ్ రూమ్ ఓపెన్ చేశారు. అదేవిధంగా తెలంగాణ ఫిలిం ఛాంబర్ సెక్రటరీ అనుపమ రెడ్డి రెండవ సెకండు సూట్ ఓపెన్ చేశారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేంద్ర, ఫెడరేషన్ ప్రెసిడెంట్ & చిత్రపురి ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ కుమార్, నల్గొండ డీసీఎంఎస్ చైర్మన్ బొల్లా వెంకట రెడ్డి, ఇంకా పలువురు కౌన్సిలర్స్ అలాగే సినీ ప్రముఖులు పాల్గొని రమేష్ స్టూడియోస్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

CITY
Talent High School
Elite High School
Elite Kidz (Pre-KG)
New Vision High School
మేము అందించు ఫౌండేషన్ విద్యకు మా విద్యార్థుల ఫలితాలే నిదర్శనాలు
మీ పిల్లల భవిష్యత్తుకై ఇంకా శ్రమిస్తాం!
6 లేదా 7వ తరగతులలో కేవలం Foundation విద్యకై మా అన్ని బ్రాంచ్‌లలో Special "Elite" Batch లను ప్రారంభించాము
మీ పిల్లలను మాకు అందించండి. వారి మంచి భవిష్యత్తుకై మా శక్తివంచన లేకుండా శ్రమిస్తామని హామీ ఇస్తున్నాను.
బాలురకు హాస్టల్ వసతి కలదు.
అడ్మిషన్లు ప్రారంభమైనవి
18 సంవత్సరాల నమ్మకం
Cell: 9393073773, 9848086647, 9866040378

# ప్రశంసలు అందుకుంటున్న చైల్డ్ ఆర్టిస్ట్ గగన గీతిక



"డాకు మహారాజ్ లో నటించే అవకాశం రావడమే ఒక గొప్ప అవకాశం అనుకుంటే... ఆ చిత్రంలో బాలయ్యతో స్క్రీన్ షేర్ చేసుకోవడం, ఆయన ప్రశంసలు అందుకోవడం ఎప్పటికీ మర్చిపోలేనని" అంటోంది బాలనటి గగన గీతిక. "పిట్ట కొంచెం... కూత ఘనం" అనే సామెతను గుర్తు చేస్తూ... నాలుగున్నరేళ్ల ప్రాయంలోనే టిక్ టాక్ వీడియోస్ చేస్తూ ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించి... "లాయర్ విశ్వనాథ్" చిత్రంతో బాలనటిగా అరంగేట్రం చేసిన ఈ చిచ్చరపిడుగు.. రెండవ మూవీ . "ఆర్.ఆర్.ఆర్, నారప్ప, 18 పేజీస్, తెల్లవారితే గురువారం" తదితర చిత్రాల్లో హీరోయిన్ల చిన్నప్పటి పాత్రలతో తన ప్రతిభకు మరింత సానబెట్టుకుంది!!

"90's మిడిల్ క్లాస్ బయోపిక్, ది గ్రేట్ ఇండియన్ సూసైడ్, ప్రేమ విమానం" చిత్రాలలోనూ నటించి మెప్పించిన గగన.. ప్రస్తుతం "ఓదెల రైల్వే స్టేషన్ 2" చిత్రంలో తమన్న చిన్నప్పటి క్యారెక్టర్ చేస్తోంది. సినిమాలు చేస్తూనే చదువును నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్న "గగన"కు ప్రేరణ తన తండ్రి శ్రీతేజ. సినిమా రంగంపై ప్యాషన్ తో ఇండస్ట్రీకి వచ్చిన శ్రీతేజ... కుటుంబానికి అండగా ఉంటూనే... సినిమారంగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం కోసం యానిమేషన్ రంగాన్ని ఎంచుకుని... నటుడిగా తను కూడా తనకంటూ చిన్న ప్రత్యేకత సంపాదించుకునే దిశగా ముందుకు సాగుతున్నాడు. "హైదరాబాద్ డ్రీమ్స్" మూవీ లో లీడ్ రోల్ చేసి.. పలు మూవీస్ లో హీరో ఫ్రెండ్ క్యారెక్టర్స్ తో మెప్పించిన శ్రీతేజ్.. "కృష్ణతులసి, ఎద లోయలో ఇంద్రధనస్సు" వంటి ధారావాహికలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు!!

ఒకవైపు సంప్రదాయబద్ధంగా కూచిపూడి నేర్చుకుంటూనే... మరోవైపు వెస్ట్రన్ డాన్స్ కూడా సాధన చేస్తున్న గగన... తను నటించిన "డాకు మహారాజ్"... గాడ్ ఆఫ్ మాసెస్ బాలయ్య కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ కావడం, అందులో తను చేసిన పాయల్ అనే పాత్ర... కథను కీలక మలుపు తిప్పేది కావడం పట్ల పట్టరాని సంతోషం వ్యక్తం చేస్తోంది. తనపై ఎంతో వాత్సల్యం చూపించి, తనతో కాంబినేషన్స్ సీన్స్ లోనూ బెరుకు లేకుండా నటించేలా ప్రోత్సహించిన బాలయ్యకు, ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడు బాబీకి ఎప్పటికీ రుణపడి ఉంటానని చెబుతున్న గగన... భవిష్యత్తులో మంచి పెర్ఫార్మర్ గా పేరు గడించాలని ఆశీర్వదిద్దాం!!

శుభాకాంక్షలు తెలిపిన అందరికీ

## కృతజ్ఞతాభివందనాలు : నందమూరి బాలకృష్ణ



సినీ రంగంలో విశేష విజయాలు అందుకుంటూ, అటు రాజకీయ రంగంలోనూ, మరోవైపు సామాజిక సేవా దృక్పథంలోనూ తనదైన రీతిలో ముందుకు వెళుతున్న నందమూరి బాలకృష్ణను పద్మభూషణ్ పురస్కారం వరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, బాలకృష్ణ స్పందించారు.

తనకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన భారత ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు, ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన అందరికీ ధన్యవాదాలు అని నందమూరి బాలకృష్ణ వెల్లడించారు.

తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో పాలుపంచుకున్న తోటి నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, నిర్మాతలకు, పంపిణీదారులకు, ఎగ్జిబిటర్లకు, కుటుంబ సభ్యులకు మరియు యావత్ చలనచిత్ర రంగానికి ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు నుండి ఆయన వారసుడిగా నేటి వరకు తన వెన్నంటి ఉండి తనను ప్రోత్సహిస్తున్న అభిమానులకు, తనపై తమ విశేష ఆధారాభిమానాలు కురిపిస్తున్న అశేష ప్రేక్షక లోకానికి సదా రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా నాతోటి పద్మ అవార్డు గ్రహీతలందరికీ కూడా తన అభినందనలు తెలిపారు.

రిపోర్టర్స్ కావలెను
V3 NEWS లక్ష్యం సమాజహితం
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com